ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 15.07.2025 | సంపుటి :11 సంచిక : 357 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








తుంగతుర్తిలో నియోజకవర్గంలోని తిరుమలగిరిలో లబ్దిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ చామల, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు



## సాగునీటి ప్రాజెక్టులపై, సాగర్ కట్టపై
# చర్చకు సవాల్..

### ఆకలితీర్చే ఆయుధం,ఆత్మగౌరవం రేషన్ కార్డు: సీఎం రేవంత్

### పదేళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు

- పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే
- కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ
- కొత్త రేషన్ కార్డుల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 11.3 లక్షల మందికి లబ్ది
- బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులకే ప్రాధాన్యం
- రైతులకు రుణమాఫీ,బోనస్ ఇచ్చిన ఘనత మాది
- కేసీఆర్ కాళేశ్వరం..కూలేశ్వరంగా మారింది
- సూర్యపేట జిల్లా తిరుమలగిరిలో రేషన్ కార్డులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

**సూర్యపేటప్రతినిధి(జనంసాక్షి):** బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ మిగతా 2లో..

> "పదేళ్ల అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన భారత రాష్ట్ర సమితి నేతలకు రాలేదు. మా ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చాం."- సీఎంరేవంత్

### 2035లోపు తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం-పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం మిగతా 2లో..

## తెలంగాణ హైకోర్టు సీజేగా
# జస్టిస్ ఏకే సింగ్



### కొలీజియం సిఫార్సులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం త్రిపుర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేశారు. కొలిజియం చేసిన సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో ఈ బదిలీ అమలులోకి వచ్చింది. సోమవారం విడుదల చేసిన కేంద్ర నోటిఫికేషన్ ప్రకారం నాలుగు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను మిగతా 2లో..



కృష్ణాపై తెలంగాణ ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వడంతో పాటు, నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలి

## తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి
# చొరవ చూపాలి

### సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు కేంద్ర జల వనరుల శాఖ మంత్రికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):**కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ కృతనిశ్చయంతో ఉన్నారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని మిగతా 2లో..

### చంద్రబాబు, రేవంత్‌ల భేటీ 16న
ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏర్పాటు.. జలవివాదంపై కేంద్రం చొరవ 2లో



## విద్వేషపు ప్రసంగాలను
# కట్టడి చేయండి

- సుప్రీం కోర్టు ధర్మాసనం గుస్సా
- అయితే, అది భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** విద్వేష ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవా లని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, అది భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదని స్పష్టం చేసింది.వాక్ స్వాతంత్య్ర విలువను పౌరులు తెలుసుకోవాలని, ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలీపై ఫిర్యాదు చేసిన వజహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది."విద్వేష ప్రసంగాలు చేసే వారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావట్లేదు? ఇలాంటి వ్యాఖ్యలను షేర్ చేయకుండా కొన్ని కట్టడి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మిగతా 2లో..

భావ ప్రకటనా స్వేచ్ఛను
### దుర్వినియోగం చెయ్యొద్దు
అలా చేస్తే రక్షణ ఇవ్వలేం:సుప్రీం

భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్స్‌లను
### సాక్ష్యాలుగా పరిగణించొచ్చు
విడాకుల కేసులో సుప్రీం తీర్పు

### అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన సీజేఐ

పై వార్తల వివరాలు 2 లో



## కేరళ నర్సుకేసులో చేతులెత్తేసిన కేంద్రం
సుప్రీంకు వివరణ

'బ్లడ్‌మనీ'ఆప్షన్ పైనే ఆశలు పెట్టుకున్న ఆమె కుటుంబం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేరళకు చెందిన నర్స్ నిమిష ప్రియకు యెమెన్‌లో పడిన మరణశిక్ష విషయంలో అన్ని దారులు మూసుకుపోయాయని కేంద్రం సుప్రీంకు తెలియచేసింది. మిగతా 2లో..

## ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా
# పథకాలు ఆపడం లేదు

### రాష్ట్రాన్ని వెన్నాడుతున్న కేసీఆర్ పాలనా వైఫల్యాలు





- అప్పుడు ఏపీ ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు
- వ్యవసాయారంగాన్ని అభివృద్ధి చేయడం కాంగ్రెస్ లక్ష్యం
- పాలేర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన భట్టి,పొంగులేటి

**ఖమ్మం(జనంసాక్షి):** కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీ-ఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్ట్‌లు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ-సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటకు పెట్టు-బడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు- ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మిగతా 2లో..



## అన్‌డాకింగ్ విజయవంతం
మరికొన్ని గంటల్లో భూమిపైకి శుభాంశు శుక్లా

**వాషింగ్టన్(జనంసాక్షి):** యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు మరికొన్ని గంటల్లో భూమి మీదకు రానున్నారు.అంతరిక్ష కేంద్రంతో శుభాంశు బృందాన్ని తీసుకువస్తున్న 'డ్రాగన్' వ్యోమనౌక అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతమైంది. పలు విన్యాసాల మిగతా 2లో..

# బీహార్ జంగల్‌రాజ్



### రాష్ట్రంలో నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి: రాహుల్

**పట్నా(జనంసాక్షి):**బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు విమర్శలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'దేశ నేరాల రాజధాని'గా బిహార్ మారిందని విమర్శించారు. నిరుద్యోగ యువత హత్యలు చేస్తూ గూండాలుగా మారుతుంటే.. సీఎం నీతీశ్ కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. మరోవైపు భాజపా మంత్రులు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి ఓటు అనే ఆయుధాన్ని ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాకుండా.. బిహార్‌ను కాపాడేందుకు వినియోగించాలని పిలుపునిచ్చారు.బిహార్‌లో ఆదివారం దారుణం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టపగలు ఓ లాయర్‌ని దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా, భాజపా నేత సురేంద్ర కేవట్‌లు హత్యకు గురయ్యారు. వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు ప్రముఖ వ్యక్తులు హత్యకు గురవ్వడం రాష్ట్రంలోని మిగతా 2లో..



## భూమిపై విమానంలా..
దూసుకుపోయే చైనా సరికొత్త బుల్లెట్ రైలు..

విమానంతో పోటీపడే రీతిలో గంటకు 600 కి.మీ. వేగం

**బీజింగ్(జనంసాక్షి):** డ్రాగన్ దేశం చైనా సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. గత కొన్నేళ్లుగా హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టిన చైనా..తాజాగా విమానంతో పోటీపడే రైలును తయారు చేసింది. ఈ రైలు వేగం గంటకు 600 కిలోమీటర్లు అని తెలుస్తోంది. తాజాగా 17వ మోడ్రన్ రైల్వే ఎగ్జిబిషన్‌లో మాగ్లెవ్ రైలును చైనా ప్రదర్శించింది. దీంతో, ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మిగతా 9లో..

## కాళేశ్వరం ఎత్తిపోతలపై
# తీవ్ర నిర్లక్ష్యం



### రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని బీఆర్ఎస్ నేత కేటీఆర్ మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతులకు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ ఫైర్ అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం మిగతా 2లో..

## గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు
కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ముగిసిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పదవీకాలం

## ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి
విభేదాలు.. వివాదాలుగా మారకూడదు: సూచన

### నేషనల్ హెరాల్డ్ కేసులో తీర్పు రిజర్వ్

### మామిడికాయల లారీ బోల్తాపడి..
9 మంది దుర్మరణం.. అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

పై వార్తల వివరాలు 2 లో

## తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్

తెలంగాణ హైకోర్టుకు నియమించారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు ఇది ఒక కీలక బాధ్యత. 2023 ఏప్రిల్ 11న ఆయన త్రిపుర హైకోర్టు సీఎంజేగా నియమితులయ్యారు. ఆయనకు పుట్టిన కోర్టుగా జార్ఖండ్ హైకోర్టు గుర్తింపు ఉంది. న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవం, తీర్పుల్లో ఆయన చూపిన నిష్పక్షపాతత, న్యాయశాస్త్రంపై గల లోతైన అవగాహన తెలంగాణ న్యాయవ్యవస్థకు తోడ్పాటు-ను అందించనుందని న్యాయవర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## విద్వేషపు ప్రసంగాలను కట్టడి చేయండి

ప్రజలు కూడా ఇలాంటి వాటిని షేర్ చేయకుండా సంయమనం పాటించాలి. మేం ఇక్కడ సెన్సార్‌షిప్ గురించి మాట్లాడట్లేదు. కానీ, ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఈ విభజన ధోరణిని అడ్డుకోవాల్సిందే" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది."ఇలాంటి కేసుల్లో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు. కానీ, భావ ప్రకటనా స్వేచ్ఛపై బాధ్యతాయుత ఆంక్షలు సరైనవే. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ విలువలను ప్రజలు అర్థం చేసుకోవాలి" అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా.. విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది.

## భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చెయ్యొద్దు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలని కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అతడికి అరెస్టు నుంచి రక్షణ కల్పించడానికి నిరాకరించింది. కొందరు కళాకారులు, కార్టూనిస్టులు, స్టాండప్ కమెడియన్‌లు ఈ మధ్య భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై గతంలో కేసు నమోదయ్యింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణ జులై 15కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై కేసు నమోదయ్యింది. మధ్యప్రదేశ్ హైకోర్టులో అతడు ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా..జులై 3న పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కార్టూన్ గీయడంలో ఆయన విచక్షణ లేకుండా ప్రవర్తించాడని పేర్కొంటూ..దానిని తోసిపుచ్చింది. దీంతో మాలవీయ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.దేశంలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ కార్టూన్ ప్రచురితమయ్యిందని హేమంత్ మాలవీయ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఆ సమయంలో వ్యాక్సిన్ భద్రతపై వచ్చిన తప్పుడు సమాచారం, ప్రజల ఆందోళనల నేపథ్యంలో ఒక రాజకీయ నాయకుడు, పౌరుడికి టీకాలు వేస్తున్నట్లు వ్యంగ్య చిత్రాన్ని గీసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.


## భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్స్.. సాక్ష్యాలుగా పరిగణించొచ్చు

**ఢిల్లీ(జనంసాక్షి):** భార్యాభర్తల విడాకుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణించొచ్చని వెల్లడించింది.వారి మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికార్డింగ్స్ స్పష్టం చేస్తాయని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై పంజాబ్, హరియాణా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కోర్టు పక్కనబెట్టింది.పంజాబ్‌లోని బఠిండాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. తన పట్ల భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపించిన ఆయన.. అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులను సమర్పించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకుల కేసు విచారణను ప్రారంభించింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ ఆమె పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. తన సమ్మతి లేకుండా, తనకు తెలియకుండా ఆ సంభాషణలను రికార్డ్ చేశారని.. వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లేనని వాదించారు. ఆమె అభ్యర్థనను అంగీకరించిన హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టింది. దీంతో ఆ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేసింది."భార్యాభర్తల మధ్య సంభాషణకు సంబంధించిన సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిస్తే.. వైవాహిక బంధాలు ప్రమాదంలో పడుతాయని, భాగస్వాములపై నిఘా పెట్టడాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని కొందరు వాదిస్తున్నారు. కానీ, ఆ వాదన సమర్థనీయమైనదని మేం భావించట్లేదు. ఒకరిపై ఒకరు నిఘా పెట్టే పరిస్థితికి వచ్చారంటే.. వారి మధ్య వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చు. పరస్పరం విశ్వాసం లేదని స్పష్టమవుతోంది. అందుకే ఆ రికార్డింగ్స్‌ను సాక్ష్యాలుగా పరిగణించుకోవచ్చు" అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ విడాకుల కేసులో ట్రయల్ కోర్టు తమ విచారణ కొనసాగించొచ్చని తెలిపింది.

## అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన సీజేఐ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా దిల్లీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం ఆయన చికిత్సకు స్పందిస్తున్నట్లు తెలిపాయి. ఒకట్రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని పేర్కొన్నాయి.

## సీనియర్ నటి బి.సరోజాదేవి కన్నుమూత



సీనియర్ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజా దేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌ల వంటి దిగ్గజ నటులతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. 1938 లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో అభిమానులను సొంతం చేసుకొన్నారు. 1955లో 'మహాకవి కాళిదాస' అనే కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు సరోజాదేవి. 'పెళ్లిసందడి' (1959)లో తెలుగులో అవకాశం వచ్చింది. దీనికంటే ముందు పాండురంగ మహత్యం, భూకైలాస్ ముందుగా విడుదలై గుర్తింపునిచ్చాయి. సీతారామ కల్యాణం (1961), జగదేకవీరుని కథ (1961), శ్రీకష్ణార్జున యుద్ధం (1963), దాగుడు మూతలు (1964), ఆత్మబలం (1964), శకుంతల (1966), దానవీర శూర కర్ణ (1978), అల్లుడు దిద్దిన కాపురం (1991) వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. 1955 నుంచి 1984 మధ్య 29 ఏళ్ల పాటు వరుసగా 161 సినిమాల్లో లీడ్‌రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజాదేవి చరిత్ర సృష్టించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో, పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

# సాగునీటి ప్రాజెక్టులపై, సాగర్‌కట్టపై చర్చకు సవాల్

కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు- వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన సన్న బియ్యం పథకంతో పాటు, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషమని అన్నారు.గత పదేళ్లలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని,తాము 80శాతం జనాభాకి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్నామని అన్నారు. దేవాదుల ప్యాకేజీ- 6 పనులు ఆగిపోయాయని, తుంగతుర్తి, పాలకుర్తి ,స్టేషన్ ఘనపూర్ ,వర్ధన్నపేట నియోజకవర్గాలకు 200 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కేతిరెడ్డి ఫీడర్ ఛానల్ పూర్తికి నిధులు మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో గత వానాకాలం ,యాసంగి సీజన్ లు కలిపి 2 కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించామని తెలిపారు.నీటిపారుదల విషయంలో తుంగతుర్తి నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.49 కోట్ల 50 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలను మహిళలకు అందజేశారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ 1170.00 లక్షలతో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాంకు, నాగారంలో 11.25 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు, అడ్డగూడూరులో 11.25 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు, 5.30 కోట్ల విద్యా శాఖ నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యులు డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి, శంకర్ నాయక్, లక్ష్మారెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### 2035లోపు తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాం

హాజరయ్యారు.సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు."రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీని అద్భుతంగా నిర్మించారు. నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. .2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుందని అన్నారు

## పెండింగ్‌లో ప్రాజెక్టుల పూర్తి చొరవ చూపాలి

నీటి పారుదల శాఖ మంత్రిని ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనలతో ఉత్త మ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి లేఖ రాశారు.ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటా యింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయిం చారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా మరియు గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం వెంటనే చొరవచూపాలని లేఖలో కోరారు. తెలంగాణలో చేపట్టిన ఆయా ప్రాజెక్టులు, స్థితిగతులు, పరిణామ క్రమంపైన సవివరంగా లేఖలో ప్రస్తావించారు .తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా గోదావరి నదీ బేసిన్‌లలో తాజా పరిస్థితులు, పరిణామాలు, ఏపీ ఉల్లంఘనలు, ఉత్పన్నమైన సమస్యలు, భవిష్యత్తు ప్రమాదాలపై వెంటనే కేంద్రం జోక్యం చేసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని లేఖలో కోరారు. కృష్ణా నదీ జలాల వినియోగంలో ఇంతకాలం తెలంగాణకు తీరని ద్రోహం జరిగింది. గడిచిన పదేండ్లలో కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది.తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టింది. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యధేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించింది.ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటు గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టింది. దానికి బదులుగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. కృష్ణా, గోదావరి నదీ జలాలపై తాజా పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా మరియు గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం వెంటనే చొరవచూపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు

## చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల భేటీ 16న

**న్యూఢిల్లీ/అమరావతి(జనంసాక్షి):** ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు.

## కేరళ నర్సుకేసులో చేతులెత్తేసిన కేంద్రం

ఉరిశిక్ష అమలుకు ఇంకా రెండురోజుల సమయమే ఉన్నందున, ఆ శిక్షను ఆపేందుకు ఇప్పుడు భారత్ వద్ద పెద్దగా మార్గాలేమీ లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇక మిగిలింది బ్లడ్ మనీ ఆప్షనే. అయితే అది ప్రైవేటు- సంప్రదింపు అని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. హూతీల పాలనలో ఉన్న యెమెన్ చట్టాల ప్రకారం.. నేరం రుజువైన తర్వాత కూడా దోషిని బాధిత కుటుంబం క్షమిస్తే శిక్ష తప్పుతుంది. ఆ కుటుంబం బ్లడ్‌మనీకి అంగీకరిస్తే అది సాధ్యమవుతుంది. ఈ విషయంలో నిమిష కుటుంబం.. బాధిత కుటుంబంతో సంప్రదింపులు కొనసాగిస్తోందని 'ది సేవ్ నిమిషప్రియ ఆర్గనైజేషన్' సుప్రీంకోర్టుకు వెల్లడించింది. చెప్పుకోదగ్గ స్థాయిలో ధనాన్ని సేకరించింది. అయితే ఈ విషయంపై చర్చించేందుకు ఆ కుటుంబం, హూతీ యంత్రాంగం నిరాకరిస్తోంది. ఈ వ్యవహారం తమ గౌరవానికి సంబంధించినదిగా వారు చెప్తున్నారు. ఆ మొత్తం పెరిగితే.. వారి అభిప్రాయం మారుతుందో లేదో తెలియదు. ఇప్పటికైతే ఆ చర్చలు నిలిచిపోయాయని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టులో వెల్లడించారు.

### కాళేశ్వరం ఎత్తిపోతలపై తీవ్రనిర్లక్ష్యం

నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో తీర్పు రిజర్వ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, తదితరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాసిక్యూషన్ కంప్లయింట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జూలై 29న దీనిపై తీర్పు వెలువరించనుంది.

## మామిడికాయల లారీ బోల్తాపడి..

**అన్నమయ్య జిల్లా(జనంసాక్షి):** అన్నమయ్య జిల్లాలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ బోల్తా పడి తొమ్మిది మంది మృతిచెందారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై చోటుచేసుకుంది. రాజంపేట నుంచి రైల్వేకోడూరు మార్కెట్‌కు మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి చెరవుకట్టపై బోల్తా పడింది. లారీ బోల్తా పడటంతో 10 మంది కూలీలకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యులు వారి పరిస్థితిని సమీక్షించి చికిత్స అందిస్తున్నారు. తొమ్మిదిమంది మృతుల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మృతులు సబ్బరత్న(45), చిట్టె-(25), గజ్జల లక్ష్మీదేవి (36), రాధ (39), వెంకట సుబ్బ(37) రమ(42), మణిచం(38), గజ్జల దర్గ(32), గజ్జల శీను(33) గుర్తించారు. మృతులు రైల్వేకోడూరు మండలం సెట్టిగుంట వాసులుగా గుర్తించారు.

## అన్‌డాకింగ్ విజయవంతం..

అనంతరం భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంది. ఈ వ్యోమనౌక దాదాపు 21గంటల పాటు ప్రయాణించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగుతుంది. అనంతరం వారిని అక్కడి నుంచి క్వారంటైన్‌కు తరలిస్తారు. దాదాపు వారం రోజుల పాటు వ్యోమగాములు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలో ఉంటారు.యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాంశు బృందం గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. 28 గంటల ప్రయాణం అనంతరం 'ఐఎస్ఎస్'లోకి ప్రవేశించింది. వీరి బృందం దాదాపు 18 రోజుల పాటు పలు ప్రయోగాలు చేసింది. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై అధ్యయనం నిర్వహించింది. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై శుక్లా అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం రూపొందించారు.అంతకుముందు యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి వచ్చేందుకు వీలుగా శుభాంశు బృందం 'డ్రాగన్' వ్యోమనౌకలోకి చేరుకొని తమ తమ స్థానాల్లో కూర్చుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.35 గంటలకు వ్యోమనౌక అంతరిక్ష కేంద్రంతో విడిపోనుంది.

# ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు ఆపడం లేదు

బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని భట్టి విక్రమార్కమండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు-, ప్రాజెక్టులు అని అన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే..మాజీ సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు తప్పిదాలు చేసిందంటే కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అని తెలియజేశారు. తప్పులు చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టు-కుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టు-కుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరువిడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాష్ట్రపతి ద్రౌపదీముర్ము మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించారు. గోవా గవర్నర్‌గా తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్ నియమితులయ్యారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన గజపతి రాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హరియాణా గవర్నర్‌గా పనిచేసిన బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. అలాగే మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్ రావు పదవీకాలం కూడా గతంలోనే ముగిసింది. ఆయనకు మళ్లీ పొడగింపు ఇవ్వలేదు. ఇప్పుడు దత్తాత్రేయకు కూడా పొడగింపు లేదని స్పష్టమయ్యింది. ఇకపోతే విజయనగరం జిల్లా ప్రజలకు, రాష్ట్ర రాజకీయ వర్గాలకు పరిచయం అక్కర్లేని పేరు పూసపాటి అశోక్ గజపతిరాజు. విజయనగర సంస్థానాధీశుల వారసుడే అయినప్పటికీ రాచరికపు పోకడలకు దూరంగా ఉంటూ నిరాడంబర ప్రజానాయకుడిగా అశోకగజపతి రాజు గుర్తింపు పొందారు. నీతి, నిజాయతీలకు నిలువుటద్దంగా నిలిచారు. నమ్మిన సిద్ధాంతాలకు తుది దాకా కట్టుబడే నైజం అశోక్ సొంతం. విజయనగరం మహారాజు అయిన డాక్టర్ పీవీజీ రాజు కుమారుడైన అశోక్ గజపతి రాజు జిల్లా ప్రజలకు రాజుగారిగా చిరపరిచితులు. జిల్లా తెదేపా శ్రేణులు ఆయనను పెద్దాయనగా గౌరవించి ఆ పేరుతోనే సంబోధిస్తుంటాయి. అశోక్ గజపతిరాజు 1951 జూన్ 26న జన్మించారు. గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో చదువుకున్నారు. పుట్టింది రాజవంశంలోనే అయినా సామ్యవాద భావాలను చిన్నప్పటి నుంచే పుణికి పుచ్చుకున్నారు. విద్యార్థి దశలో కూడా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ ప్రత్యక్ష రాజకీయ అరంగేట్రానికి తెరతీశారు. జయప్రకాశ్ నారాయణ, జార్జ్ ఫెర్నాండెజ్, చంద్రశేఖర్ వంటి సోషలిస్టు నాయకుల ఉపన్యాసాలకు ఎక్కువగా అశోక్ ప్రభావితమయ్యారు. 1978లో మొట్టమొదటిసారిగా జనతా పార్టీ తరఫున విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు.. 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. నాటి నుంచి ఆ పార్టీలో కీలక సభ్యుడిగా కొనసాగారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో తెదేపా తరఫున గెలిచారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ- చేసి జయకేతనం ఎగురవేశారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరు విషయంలో కీలకంగా వ్యవహరించారు. అశోక్ సతీమణి సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలందించారు. అశోక్ గజపతిరాజుకు అదితి గజపతిరాజు, విద్యా గజపతిరాజు కుమార్తెలు. అదితి గజపతిరాజు ఇప్పుడు టిడిపి తరఫున ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో ఎక్సైజ్, వాణిజ్య, ఆర్థిక, రెవెన్యూ, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రిగా సేవలందించారు. ప్రస్తుతం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ముక్కుసూటి తనం వల్ల అప్పుడప్పుడూ ఇబ్బందులు ఎదురవుతున్నా ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. అశోక్ గజపతిరాజుకు క్రీడలంటే చాలా ఇష్టం. ఒక దఫా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా

## బీహార్ జంగల్‌రాజ్

శాంతిభద్రతలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. సరిగ్గా ఎన్నికలకు ముందు ఇలాంటి వరుస ఘటనలు చోటు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది.మరోవైపు ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా.. అధికారాన్ని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రానున్న ఐదేళ్లలో కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని కీలక ప్రకటన చేశారు.

## ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి

**బీజింగ్(జనంసాక్షి):**

విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ.. సంఘర్షణగా మారకూడదని భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన..ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఇరుదేశాల విదేశాంగశాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ.. దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు."అక్టోబర్ 2024లో ఇరుదేశాల నేతల సమావేశం జరిగిన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయి. బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి. ఇటీవల కాలంలో పలు అంతర్జాతీయ వేదికల్లో కలిసేందుకు, వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఇలా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని పరస్పరం చర్చించుకుంటే రెండు దేశాలకూ మేలు జరుగుతుందని భారత్ ఆశిస్తోంది. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రఖ్యాత మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమైనందుకు సంతోషంగా ఉంది. ఈ విషయంలో చైనాకు కృతజ్ఞతలు చెబుతున్నా.ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత 9 నెలల్లో కీలక పురోగతి సాధించాం. సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు తీసుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఉద్రిక్తతలను తగ్గించడంతో సహా సరిహద్దుకు సంబంధించిన ఇతర అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళ్తే.. త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది. భారత్, చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయి." అని జై శంకర్ తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలి**

**ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ స్థంస్థగత పునఃనిర్మాణంపై తుది కసరత్తు**

**ఉమ్మడి మెదక్ జిల్లా నియోజకవర్గాల వారి ముఖ్య నేతల సమీక్షా సమావేశంలో పీసీసీ మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం పై గాంధీ భవన్ లో పీసీసీ జిల్లా ఇంచార్జి పొన్నం ప్రభాకర్ కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిద్దిపేట,సంగారెడ్డి ,మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ ఇంచార్జి లు ,నియోజకవర్గ ఇంచార్జీలు, జనరల్ సెక్రెటరీలు , అబ్జర్వర్లతో పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతలు ,మండల అధ్యక్షుల రేసులో ఉన్న ఆశావహులు ,జిల్లా కార్యవర్గం ఆశావహులు , అనుబంధ సంఘాల ఆశావాహులతో మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడిన వారికే పదవులు వస్తాయని తెలిపారు. ముందు నుండి పార్టీలో యాక్టివ్ గా ఉన్న వారికి మండల అధ్యక్షుల రేసులో అవకాశాలు వస్తాయని తెలిపారు. ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఈనెల 15 లోపు సంస్థాగత నిర్మాణం పూర్తి చేసేలా తుది కసరత్తు నిర్వహించారు.అందులో బాగంగా గ్రామ శాఖ అధ్యక్షుల నుండి వార్డు ,బ్లాక్ అధ్యక్షులు ,మండల శాఖ అధ్యక్షులు ,జిల్లా కార్యవర్గం,అనుబంధ సంఘాల నియామకం పూర్తి చేసేలా ముఖ్య నేతలతో దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇంచార్జీలు ఇచ్చిన షార్ట్ లిస్ట్ పై కసరత్తు పూర్తి చేసి పీసీసీ , ఎఐసిసి ఇంచార్జి లకు పంపించనున్నారు. మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులు త్వరలోనే పూర్తి అయ్యేలా కసరత్తు జరుగుతుందని పార్టీ కోసం పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయని వెల్లడించారు. నామినేటెడ్ పోస్టుల్లో బాగంగా చాలా మండలాల్లో మార్కెట్ కమిటీ లు ,పట్టణ అభివృద్ధి కమిటీ లు ,దేవాలయ కమిటీ లు ,తదితర పెండింగ్లో ఉన్న వాటిపై ఈ నెలాఖరు లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ప్రతి గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నేతలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చారిత్రాత్మకంగా తీసుకున్న నిర్ణయం బీసీ లకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిందని దీని ద్వారా కొత్త నాయకత్వానికి కూడా అవకాశాలు వస్తాయని వెల్లడించారు. సర్పంచ్, ఎంపీటీసీ , జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటి నుండే పని చేయాలని ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం ,అభివృద్ధి ముందుకు పోతుందని రైతులకు 2 లక్షల రైతు రుణమాఫీ ,రైతు భరోసా , సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్ల కి 500 బోనస్ , కొత్త రేషన్ కార్డులు పంపిణీ ,60 వేల ఉద్యోగాలు భర్తీ ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కి గ్యాస్,ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ 5-10 లక్షలకు పెంపు ,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పథకాలు ఇలా ఎన్నో పథకాలు తీసుకొచ్చిందని వీటికి గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. కింది స్థాయిలో నేతలు ప్రభుత్వం, పార్టీ సమన్వయం చేసుకొని పని చేస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని దిశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశం లో మూడు జిల్లా డిసిసి అధ్యక్షులు , తుంకుంట నర్సారెడ్ , ఆంజనేయులు గౌడ్,పార్లమెంట్ ఇంచార్జి ఉపాధ్యక్షులు బండి రమేష్ , నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్ ,జనరల్ సెక్రెటరీలు జగదీశ్వర్ గౌడ్ , ధరా సింగ్ , ఉప్పల్ శ్రీనివాస్ గుప్త,నందిమల్ల యాదయ్య, చనగాని దయాకర్ ,అసదుద్దీన్ , అబ్జర్వర్లు మెట్టు సాయి కుమార్ ,పవన్ మల్లాది తదితరులు పాల్గొన్నారు..

# యువకుడిపై హత్యాయత్నం

**కత్తులు, కర్రలతో దాడి**

**నిందితులను అదుపులోకి తీసుకోని రిమాండ్ తరలించిన పోలీసులు**




**రామకృష్ణాపూర్, జులై 14 (జనంసాక్షి):** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త తిమ్మాపూర్ లో ఓ యువకుడిపై హత్యాయత్నం కలవరం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు దుర్గం వెంకటేష్ అదే గ్రామానికి చెందిన కొమ్మ సంతోష్ ల మధ్య ట్రాక్టర్ల విషయంలో గతంలో గొడవలు జరిగాయని తెలిపారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఆదివారం స్థానిక పోచమ్మ ఆలయం వద్ద తిరిగి గొడవ పడి సంతోష్ ను ఎలాగైనా చంపుతానని వెంకటేష్ బెదిరించారని, పథకం ప్రకారమే సంతోష్ ను వెంకటేష్ ఇంటికి పిలిపించి వెంకటేష్ తండ్రి రాయపోషం, అతని తల్లి శారద తో కలిసి కర్రలతో , కత్తులతో దాడి చేయగా సంతోష్ కు కడుపు, వీపు, చేతులకు తీవ్ర గాయాలు కాగా సంతోష్ ను ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్ తో పాటు అతని తండ్రి, తల్లిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

# మేమెంతో మాకంత వాటా కావాలి?

**మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్**



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు సామాజిక రిజర్వేషన్లు అయిన బీసీ డీ నుండి బీసీ ఏలోకి వెంటనే మార్చాలని ముదిరాజ్ అధ్యయన వేదిక అధ్యక్షులు మరియు మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం పదిగంటలకు వెంగ్యాపేట్ గ్రామంలో నిర్వహించిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. తదనంతరం జరిగిన ముదిరాజ్ ల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగిస్తూ, ముదిరాజులు తెలంగాణ రాష్ట్ర జనాభాలో సుమారు 60 లక్షల మంది ఉన్నారని, వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, కావున ముదిరాజులందరూ సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ముదిరాజులకు ప్రత్యేకమైన రిజర్వేషన్లను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం మరియు ఈ మధ్య కాలంలోనే హైకోర్టు సూచించిన విధంగా తెలంగాణ గ్రామాలలోని ప్రతి చెరువులో 18 సంవత్సరాలు నిండిన ముదిరాజు వ్యవసాయదారులకు సభ్యత్వాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. మత్స్యకారు సభ్యత్వాల విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి సూచించారు. అదేవిధంగా త్వరలో రాబోయే పంచాయితీ మరియు జిల్లా పరిషత్ ఎన్నికలలో ముదిరాజులు పోటీ చేసి ,రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని ముదిరాజు రాజకీయ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ముదిరాజులకు విద్య మరియు ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి వారిని సామాజికంగా మరియు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు తోడ్పాటు అందించాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజులకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ ముదిరాజ్, సలేందర్ శివయ్య ముదిరాజ్, బోండ్ల గంగాధర్ ముదిరాజ్, బర్మ రాజనర్సయ్య ముదిరాజ్, అనిల్ ముదిరాజ్, కిష్టయ్య ముదిరాజ్, దర్శనం దేవేందర్ ముదిరాజ్, దినేష్ ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, ఉమామహేశ్వర్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, గంగాధర్ ముదిరాజ్, రాజేశ్వర్ ముదిరాజ్ , శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ ,బొజ్జ గంగన్న ముదిరాజ్, పోశెట్టి ముదిరాజ్, కృష్ణా ముదిరాజ్ మొదలగువారు పాల్గొన్నారు.

# మల్లన్నపై హత్యాయత్నం హేయమైన చర్య

**దాడిని కండించిన కరీంనగర్ జిల్లా మల్లన్న టీం సభ్యులు**

**కరీంనగర్లో కవిత దిష్టిబొమ్మ దహనం**

**కవితను అరెస్ట్ చేయాలని జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా డిమాండ్**



కరీంనగర్ (జనంసాక్షి) : హైదరాబాద్ ఘట్కేసర్ లో ఉన్న క్యూ న్యూస్ కార్యాలయం పై దాడి చేసి తీన్మార్ మల్లన్న ను చంపేయాలనే ఉద్దేశం తో కల్వకుంట్ల కవిత వారి అనుచరులను క్యూ న్యూస్ కార్యాలయానికి పంపివ్వడం హేయమైన చర్య. మల్లన్న పైన జరిగిన హత్య కుట్రను కడిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో గితభవన్ చౌరస్తాలో తీన్మార్ మల్లన్న టీం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా తన టీం సభ్యులతో కలిసి తెలంగాణ జాగృతి పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం అఖిల్ పాషా మీడియాతో మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను ఉద్దేశపూర్వకంగానే హత్య చేయించాలనే కుట్ర పన్నిన కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి కండువాలతో తన అనుచర వర్గాన్ని రౌడీల, గుండాల రూపంలో క్యూ న్యూస్ కార్యాలయానికి పన్నారని అన్నారు. గతంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు కవిత తండ్రి కేసిఆర్ తీన్మార్ మల్లన్న పై క్యూన్యూస్ కార్యాలయం పై ఎన్ని దాడులు చేసి, కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా కూడా ప్రజల పక్షాన్నే ప్రశ్నిస్తూ తెలంగాణ సమాజం గుండెల్లో చెదరని ముద్ర వేసుకున్న మల్లన్నని అంతం చేయడం అంటే యావత్ తెలంగాణ ప్రజల గొంతుకపై కాలు మోపినట్టే అని స్పష్టం చేశారు. ఇప్పటికే యావత్ తెలంగాణ సమాజాన్ని మోసం చేసిన మీ కల్వకుంట్ల కుటుంబం బ్రతుకు ఫాంహౌస్ కే పరిమితం అయిందనే విషయాన్ని మరిచిపోయారా అని నిలదీశారు. ఢిల్లీలో లిక్కర్ దందా చేసి అడ్డంగా పోలీసులకు దొరికి జైలు జీవిత జీవితాన్ని గడిపి తెలంగాణ రాష్ట్ర అడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బదీసిన నువ్వు తెలంగాణ రాష్టంలో బిసిలకు న్యాయం చేస్తానంటే ఎవరైనా నమ్ముతారా అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రమే కాకుండా యావత్ దేశంలో ఉన్న బీసీ ల గుండెల్లో చెదరని ముద్రవేసుకుని బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం గా పని చేస్తున్న మల్లన్నగారిని అంతమొందించేందుకే మల్లన్న మీద దాడికి ప్రేరేపించి, హత్యాయత్నానికి ఉసిగొల్పడం సిగ్గుచేటని అన్నారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన కవిత, వారి అనుచర వర్గంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల సమాధులపై రాజ్యమేలిన మీరు కుటుంబ పాలనకే తప్ప బడుగు బలహీన వర్గాలకు ఏనాడు న్యాయం చేసిన పాపాన పోలేదని అన్నారు. రానున్న రోజుల్లో తీన్మార్ మల్లన్న పార్టీ పెట్టి, బీసీ లందరినీ ఏకం చేస్తే, ఎక్కడ వాళ్ళ రాజకీయ భవిష్యత్తుకి చరమ గీతం పాడతాడేమో అనే భయంతో ఈరోజు మల్లన్న గారిని చంపేందుకు కుట్ర పన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని దాడులు చేసినా, ఎంతమంది అడ్డుకున్న మల్లన్న బీసీల పార్టీ పెట్టి తీరుతారని, రానున్నరోజుల్లో వచ్చేది బీసీ ల రాజ్యమే అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ లేనివిధంగా ఇప్పుడు కొత్తగా బీసీల కోసం గొంతు ఎత్తాలని ప్రయత్నిస్తున్న కవితకి అసలు బీసీలతో ఉన్న సంబంధం ఏంటో తెలపాలని ప్రశ్నించారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా, అగ్రవర్ణాల ఆధిపత్యం నుండి బీసీలను కాపాడేందుకు, బహుజనుల రాజ్యాధికారం సాధించేందుకు తీన్మార్ మల్లన్న కు తోడుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మీ రాజకీయాలను పాతరపెట్టేందుకు తీన్మార్ మల్లన్న టీం పనిచేస్తుందని స్పష్టం చేశారు. మల్లన్న పైన జరిగిన దాడిని పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి కవితను మరియు తన అనుచర వర్గాన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు బూత్కూరి మధు, ఓర్సు రాజు, దురుశెట్టి చందు, విజయ్, సమ్మయ్య, రవి, గణేష్, కార్తీక్, మురళి, వసీంఖాన్, ఖమర్, మైబుబ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెనొప్పితో విద్యార్థి మృతి

**హనమకొండ, జులై14 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల కళాశాలలో విషాదం చోటు చేసుకుంది. గుండె నొప్పితో ఇంటర్ సెకండియర్ విద్యార్థి మృతి చెందాడు. ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బత్తిని మనితేజ (17) గుండె నొప్పితో మృత్యుఒడికి చేరుకున్నాడు. మణితేజ స్వగ్రామం శాయంపేట మండలం ప్రగతి సింగారంగా తెలిసింది.

## మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం: బిజెపి



**నల్లగొండ, జులై14 (జనంసాక్షి) :** మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలనుచేర్చడాన్ని అంగీకరించ బోమన్నారు. భారత్‌లోనే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కుటుంబ పాలన నడుస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. కుటుంబ పాలనను పారదోలి మోదీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. మొదట యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వెళ్లారు. అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పర్యటించారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లకు తను వ్యతిరేకం కాదని, మత పరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని రామచందర్ రావు అన్నారు.

# ఎన్ఏయస్ ఫలితాల్లో జనగామ జిల్లాకు చోటు

**కలెక్టర్ దిశానిర్దేశంతో అభ్యసన ఫలితాల సాధనలో విద్యార్థుల అత్యుత్తమ ప్రతి**

**జిల్లా విద్యాశాఖ ను బలోపేతం చేసిన కలెక్టర్ ని సన్మానించిన విద్యాశాఖ అధికారులు**



**జనగామ ప్రతినిధి, జూలై 14 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ..... ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందిస్తున్న క్రమంలో.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. ఎన్ఏయస్ ఫలితాల్లో... దేశవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 50 జిల్లాలో జనగాంకి చోటు దక్కిన నేపథ్యంలో.... నిత్యం సమీక్షలు, సందర్శనలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దిశా నిర్దేశం వేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ని సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. నిరంతరం సమీక్షలు, పరిశీలనలతో.. జిల్లా విద్యాశాఖ కు దేశ వ్యాప్తంగా వివిధ అంశాల్లో మంచి ర్యాంకులు వచ్చేలా చేసిన కలెక్టర్ కి డీఈవో భోజన్న,జిల్లా విద్య శాఖ సిబ్బంది ధన్యవాదములు తెలిపారు. అనంతరం కలెక్టర్,అదనపు కలెక్టర్లతో కేక్ ని కట్ చేపించి..వారిని శాలువలతో ఘనంగా సత్కరించారు. ఎన్ఏయస్ ఫలితాల్లో జనగాం... 50 ఉత్తమ జిల్లాల్లో చోటు రావడానికి గల కారణాలు కలెక్టర్ మాటల్లోనే. ఎన్ఏయస్ పరీక్ష కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాము. వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు సాధికారత కల్పించి.. ప్రశ్నల నిధి ని తయారీ చేసి.. సబ్జెక్ట్ ఫోరమ్‌ల ద్వారా ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా ఆన్‌లైన్ సెషన్‌లను ఏర్పాటు చేశాము. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఎన్ఏయస్-సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహించి... నిరంతర మూల్యాంకనం కోసం వారాంతపు లఘు పరీక్షలు నిర్వహించి తరగతి స్థాయిలో ప్రతిరోజూ నమూనా ప్రశ్నలు చర్చించడం, ఉపాధ్యాయులచే విద్యార్థుల దత్తత, మార్గదర్శకత్వం, ఎన్ఏయస్ పై ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ప్రతి నెలా పాఠశాల సముదాయ స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించి..ఈ సమావేశాలలో ఎన్ఏయస్ మోడల్ ప్రశ్నపత్రాల తయారీ అలాగే చర్చ, ముఖ్యమైన అధ్యాయాలపై విద్యార్థులు దృష్టి సారించేలా చేశాము. ప్రతి నెలలో మండల స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించి..జిల్లా స్థాయిలో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించాము. ఎన్ఏయస్ సర్వే కోసం నిర్దేశించిన మూల్యాంకన పద్ధతులను అనుసరించి.... ఎన్ఏయస్ రాష్ట్ర స్థాయి మాక్ టెస్ట్‌ల నిర్వహణ జరిగింది. డి పి ఆర్ లు రూపొందించిన ప్రత్యేక సాధన సామగ్రి చాలా ఉపయోగ పడింది. సీనియర్ ప్రధానోపాధ్యాయులు, డ్రస్ తో కూడిన ప్యానెల్ పర్యవేక్షణ బృందాల తో ఎప్పటికప్పుడు తనకీలు నిర్వహించి ,వారితో ఎన్ఏయస్ పరీక్షలపై సంపూర్ణ అవగాహన పర్చాం. ప్యానెల్ తనిఖీ సభ్యుల ద్వారా (ఆన్-ది-స్పాట్) లో ఎన్ఏయస్ ప్రశ్నల సరళి పై చర్చించి వారి ద్వారా విద్యార్థుల్లో సామర్థ్య నిర్మాణం చేశాం. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఓపెన్ ఎడ్యుకేషన్ రిసోర్సెస్, టి సాట్ లైవ్ ఎక్స్‌పర్ట్ మార్గదర్శకత్వంతో ఎన్ఏయస్ సంసిద్ధత కోసం ఐసీఐటీ పరిజ్ఞానాన్ని వినియోగాన్నీ పెంచాం. క్రమం తప్పకుండా పర్యవేక్షణ కోసం విద్యార్థులతో వాట్సాప్ గ్రూపులను సృష్టించి... ఎన్ఏయస్ పరీక్ష పట్ల భయాన్ని తగ్గించడానికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాము. జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా (మాక్) నమూనా పరీక్షలు నిర్వహించి....విద్యార్థులతో నేరుగా సంభాషించడానికి వర్చువల్ సమావేశాలు నిర్వహించాము. ఈ సందర్భంగా ఈ మంచి పలితాలు రావడానికి క్షేత్ర స్థాయిలో కృషి చేసిన ఉపాధ్యాయులను, ప్రధానోపద్యయులను,ఎం ఈ ఓ లను అభినందించారు. అలాగే డీఈఓ బోజన్న, జిల్లా విద్య శాఖ ధికారులను కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# స్పెషల్ ఆఫీసర్ మాకొద్దు..
# భోజనం సరిగ్గా పెట్టడం లేదు





**కేజీబీవీ లో ఏం జరుగుతుంది?**


**విద్యార్థినిల తల్లిదండ్రులు ఆందోళన**

**మర్పల్లి జూలై 14 (జనంసాక్షి) :** మర్పల్లి మండల కేంద్రంలో కస్తూరి గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలు స్పెషల్ ఆఫీసర్ సునీత మాకు వద్దు అని సరిగ్గా భోజనం పెట్టడం లేదని సోమవారం గేటు ముందు కూర్చుని నినాదాలు చేశారు. శనివారం కస్తూరిబా విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదు అని గేటు ముందు కూర్చుని ధర్నా చేసిన విద్యార్థులు. ఈ విషయంపై పలు పత్రికల్లో రావడంతో కస్తూరిబా జె సి డి శ్రీదేవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ చైర్మన్ పాండు, ఏ ఎం ఓ రామనాథ, మండల ప్రత్యేక అధికారి మోహన్ కృష్ణ, మండల విద్యాధికారి అంజిలయ్య, ఎంపీడీవో రాజ మల్లయ్య, తహసిల్దార్ పురుషోత్తం సోమవారం మధ్యాహ్నం పాఠశాలలో జరిగిన సంఘటన విచారణ నిమిత్తం కేజీబీవీ లో విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న విద్యార్థులకు ఉన్న సమస్యలు ఏమిటని వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అన్నంలో పురుగులు వచ్చాయని, ప్రతిరోజు టిఫిన్స్ ఉప్మానే పెడుతున్నారని నాసిరకం బియ్యంతో వండి అన్నం పెడుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మెనూ ప్రకారం స్నాక్స్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని రాత్రి వేళలో ఇక్కడ ఉన్న స్టాక్ ను తరలిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు మీరు ఎవరు అధైర్య పడవద్దని ఇకనుంచి ఇలాంటి పొరపాట్లు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని, మీరు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వారు విద్యార్థులకు సూచించారు. పాఠశాల సిబ్బందికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇక ముందు నుంచి ఇలాంటి ఫిర్యాదులు ఉండవద్దని విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి పొరపాటు లేకుండా చూడవలసిన బాధ్యత స్పెషల్ ఆఫీసర్ లేదే అని మళ్లీ ఇలా జరిగితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విచారణ జరిపి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. అధికారులు వెళ్లాక వెంటనే ఒక్కసారిగా విద్యార్థినులు బయటికి వచ్చి గేటు ముందు బైఠాయించి ఎస్ ఓ మాకొద్దు ఆమె వెళ్తేనే మేము లోపలికి వెళ్తామని ఏడుస్తూ గేటు ముందు బైఠాయించారు. విద్యార్థులు గేటు ముందు కూర్చున్న సంగతిని అధికారులు తెలుసుకొని మళ్లీ పాఠశాలకు వచ్చారు. అధికారులు వచ్చి ఎంత నచ్చజెప్పినా వెళ్ళమని భీష్మించి కూర్చున్నారు. మా కోసం వచ్చిన వంట సామాన్లు రాత్రి వేళలో అమ్ముకుంటుందని విద్యార్థులు తెలిపారు. ఇకనుంచి ఇలాంటి సంఘటనలు జరగకుండా మాది పూచి అని నచ్చ చెప్పడంతో విద్యార్థినులు పాఠశాలలోనికి వెళ్లారు. ఈ సంఘటనకు కారణం టీచర్ల అంతర్గత విషయమే దేనికి కారణమని పలువురు మాట్లాడుకుంటున్నారు.

**పాఠశాలలో అసలు ఏం జరుగుతుంది ? ఈ గొడవలకు కారణం సిబ్బందినా?**

కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న సంఘటనకు అక్కడి సిబ్బంది కారణమా అని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. కొన్ని సంవత్సరాల నుండి అక్కడే పాతుకపోయినా వారి మధ్య సమన్వయ లోపంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి మర్పల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలను తనిఖీ చేసి విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

# అడుగు పడింది.. గొడుగు పట్టండి



టీ(బీ)ఆర్ఎస్ కేసీఆర్ సార్ తెలంగాణ తెచ్చింది ఎంత నిజమో, కాంగ్రెస్ సోనియమ్మ ఇచ్చిందీ, బీజేపీ సుష్మమ్మ మద్దతు తెలిపిందీ అంతే నిజం. బీసీలకు 42 శాతం కోటా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదనకు బీఆర్ఎస్, బీజేపీలూ మద్దతు ఇచ్చాయి. కాంగ్రెస్ పాలనలో బీసీ కోటా పెరిగి, అమలైతే ఆ పార్టీకే గంపగుత్తగా పేరు వస్తుందని ఏ పార్టీ అయినా ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ బెంగ పడాల్సిన అవసరం ఉన్నదా? అలాగైతే తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్ పాలనను మూడోసారి రాష్ట్రం వదులుకోలేదా? అలానే భవిష్యత్తులో కాంగ్రెస్ ను వద్దనుకోదన్న గ్యారంటీ ఉండదు కదా. కాబట్టి ఆర్డినెన్సుపై దీర్ఘాలు మానుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఆ పార్టీకంటే గొప్పగా తక్కిన పార్టీలూ పాటుపడాలి. మరీ ముఖ్యంగా ఆయా పార్టీల నాయకత్వాలు ఏవైనా, ఓనర్షిప్ ఎవరిదైనా వాటిల్లో బీసీలే అధిక మనే సూక్ష్మాన్ని ఎరుకలో ఉంచుకోవాలి. బీసీకి కేటాయించబడిన ఒక స్థానంలో ఒక పదవికి బీసీలు ఎందరు, ఏ పార్టీ వారు పోటీపడినా అంతిమంగా విజేత అయ్యేది బీసీనే. ఆ విధంగా 42 శాతం రిజర్వేషన్ల వల్ల బలహీన వర్గాల బలగం లోకల్ బాడీస్ లో కనీసం 23,973 మందితో వ్యవస్థలు బలోపేతం అవుతాయి. ఆ బలం సమసమాజం దిశగా నవశకమై పురోగమించగలదు.


**టైం ఎట్లా నిర్దేశిస్తే అట్లా**

ప్రస్తుతం ఆర్డినెన్సు, తర్వాత చట్టబద్ధత..మొత్తంగా 42 పర్సెంట్ బీసీ రిజర్వేషన్లతో రేపటి ఎన్నికలు సజావుగా జరిగేలా, ఆపై ఆ ఫలితాలు ఎలాంటి చిక్కులు లేకుండా నిలబడేలా నిబద్ధతే అందరి కర్తవ్యం కావాలి. లేదంటే రేపో మాపో ఢిల్లీ బాటలో అన్ని పార్టీల రాష్ట్ర ప్రతినిధులు కేంద్రం, రాష్ట్రపతి వద్ద ఆమోదానికి తమిళనాడు తరహా ఐక్యతా స్ఫూర్తితో కంప్లీట్ చేపిస్తే ఏ రందీ ఉండదు. బలహీన వర్గాల ప్రాతినిధ్యం బలోపేతానికి అడుగులు పడ్డాయనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఆ అడుగులు సుసంపన్నమనే సాఫల్య గమ్యానికి సురక్షితంగా చేరే దాకా తలా ఓ చేయితో గొడుగులు పట్టాలి. ఎటొచ్చీ క్రెడిట్ ఎదుటి రాజకీయ పార్టీకి పోతుందేమోననే బెంగతో కూడిన ఈర్ష్య. ఇంకోటి పార్టీలకు అతీతంగా అగ్ర కులాల ఆధిపత్యం సన్నగిల్లుతుందన్న నస. ఈ రెండూ ఓపెన్ గా మాట్లాడరు, అంగీకరించరు. పార్టీలైనా, వాటి నాయకత్వాలైనా, వ్యక్తులుగా లీడర్లయినా ఎంత వాస్తవంలో జీవిస్తే అంత మనఃశ్శాంతి సొంతం. సింపుల్ గా చూద్దాం. ఏ ఊరు, మండల కేంద్రం, పట్టణం, నగరంలోనైనా సింహభాగం జనాభా ఉండేది బీసీలదే. ఇదొక్కటి చాలు వారి వాటా వారికి ఉన్నంతలో దక్కడానికి మనస్కరించేందుకు. 1980 దశకానికి ముందు, 1980ల తర్వాత అన్నట్టుగా దివంగత ఎన్టీఆర్ విధాన నిర్ణయంతో మొదలైన బీసీల ప్రాధాన్యం దశాబ్దాల మీదట ఈ దశకు చేరింది. సామాజిక వివక్ష స్థానే సామాజిక న్యాయం విరాజిల్లేందుకు 42 శాతం రిజర్వేషన్ల ద్రాక్ష అందేటంత చేరువలో తచ్చాడుతోంది. ఇది బలహీన వర్గాల లోకానికి సరికొత్త ఆశగా మనసు ఊరిస్తోంది. ఇప్పటికిప్పుడు రాష్ట్రపతి ఆమోదముద్ర మాటెలా ఉన్నప్పటికీ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి 42 స్థానాలకు బీసీల్లోని సమస్త కులాలు ప్రాతినిధ్యం వహించే కొంగొత్త అధ్యాయం తెలంగాణ చరిత్రలో నమోదు కావాలి.

న్యాయ సమీక్షకు నిలబడుతుందా, లేదా? అనే శంక, సంశయం, వ్యతిరేక విశ్లేషణలు పోటెత్తడం వల్ల లేలేత కిరణాలు మసకబారొద్దు. తనకు తానుగా ఎన్నికల మేనిఫెస్టో క్రమంలో కాంగ్రెస్ పార్టీ 2023 నవంబర్ 10 నాటి కామారెడ్డి డిక్లరేషన్ ను ప్రభుత్వంగా ఎట్టకేలకు ముందర వేసుకొంది. అదేంటోకానీ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడైనా సకాలంలో లోకల్ బాడీ ఎన్నికలు తలపెట్టిన పుణ్యాన పోలేదు. కోర్టు తలుపు తడితే కానీ మోక్షం రాలేదు. ఇప్పుడూ అంతే. ఇప్పటికే రెండు వార్షిక క్యాలెండర్లు మారాయి. ఎప్పటిలా హైకోర్టు గట్టిగా నిర్దేశిస్తూ సెప్టెంబరు వ్యవధిగా పేర్కొంది. అపుడు ప్రభుత్వం కూడా తీక్షణంగా మనసు పెట్టింది. డెడికేటెడ్ కమిషన్ రిపోర్టు ప్రకారం విద్య, ఉపాధి, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ ఈ ఏడాది మార్చి 7న కేబినెట్ ఆమోదం తెలిపింది. అదే నెల 17న విద్య, ఉద్యోగ(బిల్లు నంబర్ 3), లోకల్ బాడీల్లో (బిల్లు నంబర్ 4) 42 పర్సెంట్ చేస్తూ గవర్నరుకు ప్రభుత్వం పంపించింది. అవి గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నాయి. తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చాలనే తపన అందరికీ, అన్ని పక్షాలకూ ఉండి తీరాలి. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్, రాంచందర్ రావు వంటి నేతలను కలవాలి. అందరినీ సమన్వయం చేయాలి.

మన దక్షిణ భారతదేశంలో మరో తెలుగు రాష్ట్రానికి పొరుగునే ఉన్న తమిళనాడు ఆదర్శం, ప్రేరణ కావాలి. ఎన్నో ఆటుపోట్లు, ప్రతిబంధకాలు దాటుకుని 1994లో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ నేతృత్వంలోని పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో పార్లమెంటు ఆమోదం లభించింది. తద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతున్న రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. తదుపరి రాష్ట్రం తెలంగాణ కావాలి.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**హైదరాబాద్, 9440850384**



# గ్రంథాలయ శాస్త్రంలో దత్తాంశ విశ్లేషణ యొక్క ప్రధాన అంశాలు

గ్రంథాలయ శాస్త్ర పరిశోధనలో దత్తాంశ సేకరణ మరియు విశ్లేషణ కీలకమైన అంశాలు, ఇవి గ్రంథాలయ సేవలు, వినియోగదారుల అవసరాలు, సమాచార వనరుల వినియోగం మరియు సంస్థాగత పనితీరును అర్థం చేసుకోవడంలో సహాయపడతాయి. దత్తాంశ విశ్లేషణ అనేది సేకరించిన సమాచారాన్ని క్రమబద్ధంగా పరిశీలించి, అర్థవంతమైన ఫలితాలను రూపొందించే ప్రక్రియ. దీని లక్షణాలలో నిర్దిష్టత, క్రమబద్ధత, అర్థవంతత, వస్తునిష్ఠత మరియు సమగ్రత ఉన్నాయి. నిర్దిష్టత పరిశోధన లక్ష్యాలకు అనుగుణంగా విశ్లేషణ జరుగుతుంది, ఉదాహరణకు, వినియోగదారుల పఠన అలవాట్లు లేదా సమాచార శోధన పద్ధతులు. క్రమబద్ధత ద్వారా ఖచ్చితమైన ఫలితాలు, అర్థవంతత ద్వారా సేవల మెరుగుదలకు ఉపయోగపడే ఫలితాలు, వస్తునిష్ఠత ద్వారా నిష్పక్షపాత ఫలితాలు, సమగ్రత ద్వారా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషణ జరుగుతుంది.

దత్తాంశ విశ్లేషణలో ప్రధాన అంశాలు పరిశోధన లక్ష్యం, దత్తాంశ రకాలు, విశ్వసనీయత మరియు సాంకేతికత. పరిశోధన లక్ష్యం స్పష్టంగా నిర్వచించబడాలి, ఉదాహరణకు, డిజిటల్ వనరుల వినియోగం లేదా వినియోగదారుల సంతృప్తి స్థాయి. దత్తాంశం క్వాంటిటేటివ్ (పుస్తకాల సంఖ్య, వినియోగదారుల సంఖ్య) మరియు క్వాలిటేటివ్ (అభిప్రాయాలు, సూచనలు) రకాలుగా ఉంటుంది. విశ్వసనీయత కోసం సరైన సేకరణ పద్ధతులు, సాంకేతికత కోసం ఆధునిక సాఫ్ట్‌వేర్‌లు ఉపయోగించ బడతాయి. దత్తాంశ వర్గీకరణ సమాచారాన్ని నిర్దిష్ట వర్గాలుగా విభజిస్తుంది, ఉదాహరణకు, వినియోగదారులను వయస్సు, వృత్తి, లింగం లేదా సభ్యత్వం ఆధారంగా, వనరులను డిజిటల్, ముద్రిత పుస్తకాలు, లైబ్రరీ సైన్స్ పరిశోధనలో డేటా సేకరణ మరియు విశ్లేషణ ఒక క్రమబద్ధమైన, సమగ్రమైన ప్రక్రియ, ఇది గ్రంథాలయ సేవలు, వినియోగదారుల అవసరాలు, సమాచార వనరుల వినియోగం మరియు సంస్థాగత పనితీరును అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఈ ప్రక్రియలో డేటా విశ్లేషణ లక్షణాలు, ప్రధాన అంశాలు, డేటా వర్గీకరణ, నిర్ధారణ, కోడిఫైంగ్, ట్యాబులేషన్, స్టాటిస్టికల్ విశ్లేషణ, డేటా వివరణ మరియు డయాగ్రమాటిక్ ప్రజెంటేషన్ వంటి దశలు ఉన్నాయి.

డేటా విశ్లేషణ అనేది సేకరించిన సమాచారాన్ని క్రమబద్ధంగా పరిశీలించి, అర్థవంతమైన ఫలితాలను రూపొందించే ప్రక్రియ. దీని లక్షణాలలో నిర్దిష్టత (పరిశోధన లక్ష్యాలకు అనుగుణంగా విశ్లేషణ, ఉదా., వినియోగదారుల పఠన అలవాట్లు), క్రమబద్ధత (ఖచ్చితమైన ఫలితాల కోసం క్రమబద్ధ సేకరణ), అర్థవంతత (సేవల మెరుగుదలకు ఉపయోగపడే ఫలితాలు), వస్తునిష్ఠత (నిష్పక్షపాత ఫలితాలు) మరియు సమగ్రత (అన్ని అంశాల పరిగణన) ఉన్నాయి.

ప్రధాన అంశాలలో పరిశోధన లక్ష్యం (ఉదా., డిజిటల్ వనరుల వినియోగం లేదా సంతృప్తి స్థాయి), డేటా రకాలు (క్వాంటిటేటివ్: పుస్తకాల సంఖ్య, క్వాలిటేటివ్: అభిప్రాయాలు), విశ్వసనీయత (ఖచ్చితమైన సేకరణ పద్ధతులు) మరియు సాంకేతికత (ఆధునిక సాఫ్ట్‌వేర్‌లు) ఉన్నాయి. డేటా వర్గీకరణ సమాచారాన్ని వర్గాలుగా విభజిస్తుంది, ఉదా., వినియోగదారులను వయస్సు, వృత్తి, లింగం ఆధారంగా లేదా వనరులను డిజిటల్, ముద్రిత పుస్తకాలు, జర్నల్స్‌గా విభజించడం. డేటా నిర్ధారణలో తప్పుల తనిఖీ, సమగ్రత నిర్ధారణ మరియు లక్ష్యాలతో సరిపోలిక జరుగుతుంది. కోడిఫైంగ్ డేటాను సంకేతాలు లేదా సంఖ్యల రూపంలోకి మారుస్తుంది, ఉదా., అభిప్రాయాలను “సానుకూలం” (1), “ప్రతికూలం” (2)గా కోడ్ చేయడం. ట్యాబులేషన్ డేటాను పట్టికల రూపంలో క్రమబద్ధం చేస్తుంది, ఉదా., వారంవారీ సందర్శకుల సంఖ్య లేదా పుస్తకాల వినియోగ శాతం.

స్టాటిస్టికల్ విశ్లేషణలో డిస్క్రిప్టివ్ (మీన్, మీడియన్) మరియు ఇన్ఫరెన్షియల్ (కోరిలేషన్, రిగ్రెషన్) పద్ధతుల ద్వారా ట్రెండ్స్, సంబంధాలు గుర్తించబడతాయి. డేటా వివరణ ఫలితాలను సేవల మెరుగుదలకు అనుగుణంగా వివరిస్తుంది, ఉదా., డిజిటల్ వనరుల వినియోగం ఎక్కువైతే సౌకర్యాలను మెరుగుపరచడం. ప్రజెంటేషన్‌లో టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఉపయోగించి డేటా దృశ్యమానంగా స్పష్టంగా చూపబడుతుంది, ఉదా., బార్ చార్ట్‌తో సందర్శనల పోలిక లేదా పై చార్ట్‌తో వనరుల వినియోగ శాతం. స్టాటిస్టికల్ టేబుల్స్ సంఖ్యాత్మక ఖచ్చితత్వాన్ని, డయాగ్రమాటిక్ ప్రజెంటేషన్ దృశ్య అవగాహనను అందిస్తాయి. ఈ దశలు గ్రంథాలయ సేవలను మెరుగుపరచడానికి, వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకోవడానికి మరియు సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడతాయి.



**డాక్టర్. రాధికారాణి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్.ఓ.డీ.,
లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.
8074317172.

# తెలంగాణ ఉద్యమాన్ని కాదనే ప్రయత్నం సరికాదు!

## కె. రోశయ్య జయంతి అధికారిక నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కేవలం రాజకీయ పరిణామం కాదు, అది దశాబ్దాల పోరాటాలు, త్యాగాలు, ఉద్యమ నాయకుల నిబద్ధత, విద్యార్థి యువత ఆకాంక్షల ఫలితం. తెలంగాణ అనేది ప్రజాస్వామ్య విజయం, ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన స్వరాజ్య కల. అటువంటి నేపథ్యంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తర్వాత తమిళనాడు, కర్ణాటక గవర్నర్‌గా సేవలందించిన దివంగత కె. రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రజల్లో నిరాశ, ఆవేదన కలిగిస్తోంది.

రోశయ్య గారు నిస్పృహ రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందినప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఆయన వైఖరి ఉద్యమానికి వ్యతిరేకమని చరిత్ర స్పష్టం చేస్తుంది. 2009లో ఉద్యమం ఉధృతమైన సమయంలో, ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా ఉన్న రోశయ్య అసెంబ్లీలో తీర్మానానికి అవకాశం ఇవ్వకపోవడం రాష్ట్ర విభజనను ఆలస్యం చేసింది. ఉద్యమాన్ని అణచడానికి అధికారుల చర్యలకు ఆయన మద్దతు ఉందన్న విమర్శలు కూడా అప్పట్లో వెల్లువెత్తాయి. ఈ సందర్భంలో రోశయ్య జయంతిని అధికారికంగా జరపాలన్న నిర్ణయం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది భావాలను క్షోభించేలా ఉంది. ఇది కేవలం ఒక నాయకుడిని గౌరవించడం కాదు, ఉద్యమ ఆదర్శాలను తక్కువ చేసే చర్యగా అనిపిస్తోంది. ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచిన వారిని గౌరవించడం ప్రజల చరిత్రను తొలగించే ప్రయత్నంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో రోశయ్యకు గౌరవం ఉండవచ్చు, కానీ తెలంగాణ ప్రజలు చరిత్రను ఉద్యమ దృక్కోణంలో చూస్తారు, ఉద్యమాను కూల నాయకులను మాత్రమే గౌరవిస్తారు.

1969 తొలి తెలంగాణ ఉద్యమంలో కాల్పులకు ఆదేశించిన అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందో, అదే విధమైన స్పందన ఇప్పుడు రోశయ్య విషయంలో కనిపిస్తోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని ప్రకటించడం వల్ల దాని వెనుక ఉద్దేశంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రొఫెసర్ కేశవ్ రావు జాదవ్, అమరవీరులు, నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారుల జయంతులను గుర్తించకుండా, ఉద్యమ వ్యతిరేక నాయకుడి జయంతిని జరపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. తెలంగాణ ఉద్యమ చరిత్రను గౌరవించాలంటే, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. ఉద్యమాన్ని తక్కువ చేసే చర్యలు రాష్ట్ర పునాదులను బలహీనపరుస్తాయి. చరిత్రను తిరగరాయవచ్చు, కానీ ప్రజల గుండెల్లోని ఉద్యమ జ్ఞాపకాలు, గాయాలు మరువబడవు.



**సయ్యద్ రఫీ,**
చిత్ర దర్శకుడు

## ఆలోచనల్లోనే ఆనందం

మనిషి జీవితం సుఖ
దుఃఖాల నిలయం
జీవితం ఒక రంగుల
రాట్నం మనిషికి
కలిగే ఆనందం ఒక
వస్తువును
పొందినపుడో
చేసిన పనిలో
మంచి ఫలితం
వచ్చినపుడో
కలిగేది కాదు
ఆనందకర జీవితం
మన ఎంపికపై
ఆధారపడి ఉంటుంది
ఆనందంగా ఉండాలని
మనం కోరుకుంటే
అప్పుడు మాత్రమే
ఆనందగా జీవించగలం
మనిషి దగ్గర ఉన్న డబ్బు
విలాసవంతమైన
భవనాలు మనిషికి
గుర్తింపు తప్ప ఇవి
మనకు ఆనందాన్ని
కలిగించలేవు
సానుకూల ఆలోచనలు
సోషల్ లైఫ్ సామాజిక సేవ
ఆపన్నులను ఆదుకునేతత్వం
సాహానుభూత
ప్రోది చేసుకుంటూ
సాధారణ జీవితం
గడపండి
స్వర్గం ఎక్కడో లేదు
మనలోనే ఉంది
మన ఆలోచనలే
మన కర్త కర్మ క్రియ
సంతోషాన్ని వస్తువుల్లో
దేవుణ్ణి బాహ్యంలో
వెతుకుంటున్నాం

వైపుల్యాలను అనుభవాలుగ
అనుభవాలను సమస్యలను
అధిగమించే సాధనాలుగా
ఉపయోగించండి
ముందుకు వెళ్ళడానికి
మనల్ని మనం మెరుగు
పరుచుకునే ప్రక్రియగా
భావించాలి
పనియే దైవంగా
కష్టాలను ఇష్టాలుగా
మార్చుకుని సవాళ్లను
ఎదుర్కోవాలి
పనిచేయడం పై శ్రద్ధ
పెట్టాలి ఫలితాలు ఎలా
ఉన్నా స్వీకరించాలి
అప్పుడు మాత్రమే
ప్రగతి పురోగతి సాధ్యమై
వృద్ధి అభివృద్ధి
సిద్ధిస్తుంది

**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు
ఉత్తమ ఆర్థికవేత్త అవార్డ్ గ్రహీత

# అజరామర కథలు-అమరావతి కథలు

జీవితం యాంత్రికమై వేగవంతమైన తరుణంలో సగటు పాఠకులను అలరిస్తున్న సాహిత్య ప్రక్రియ కథ. చిన్నప్పటినుండే కాక సహజంగా విషయాన్ని కథనాత్మకంగా వివరిస్తే అది శ్రోతల మనసునే కాక పాఠకుల మనసును ఆకట్టుకుంటుంది. సంప్రదాయ బద్ధమైన నాటి గుణాఢ్యుని బృహత్కథ, హాలుని గాథాసప్తశతి, ఆ తరువాతి కాలంలో పాఠకులను విశేషంగా అలరించిన తెనాలి రామలింగని కథలు, కాశీ మజిలీ కథలు ముఖ్యమైనవి. ఆంగ్లేయుల పరిపాలన,విద్య కారణంగా అనేక ప్రక్రియలు పుట్టుకొచ్చాయి. ఇందులో కథానిక ఒకటి. 1910 లో గురజాడ రాసిన దిద్దుబాటు తొలి కథానికగా గుర్తింపు పొందింది. అలాగే పాలగుమ్మి పద్మరాజు రాసిన గాలివాన కథ అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందింది. తెలుగులో కథానిక స్వరూప స్వభావాలు అనే అంశంపై పరిశోధన చేసిన పోరంకి దక్షిణామూర్తి గారు డాక్టరేట్ డిగ్రీ ని అందుకున్నారు. ఆయన అగ్నిపురాణంలోనే కథానిక ప్రస్తావన ఉందని చెప్పారు. కాగా”ఒక ఆసక్తికరమైన సంఘటన ఒక విచిత్రమైన మనస్తత్వాన్ని ఒక అపురూపమైన పరిస్థితిలో ఒక మరిచిపోలేని అనుభవాన్ని దేన్నో ఒకదాన్ని పాఠకుల హృదయంలో గాఢంగా హత్తుకునేలా చేయడం కోసం అనువైన భాషలో ఆకర్షించే శైలిలో మొదటి నుంచి చివరి దాకా ఒకే శ్రుతిలో ఒకే బాణీలో సాగే వచన రచనను కథానిక”అంటారని తెలుగు కథానిక అనే గ్రంథం వివరిస్తుంది. క్లుప్తత, మౌలికత, ఏకత, శైలి రమ్యత, రూపం, వస్తువు, కల్పన, సంభావ్యత అనే వాటిని కథానిక లక్షణాలుగా పేర్కొన్నారు. 115 సంవత్సరాల ఆధునిక తెలుగు కథ సాహిత్యాన్ని సంపన్నం చేసిన కథకులు ఎందరో ఉన్నారు. గురజాడ, శ్రీపాద, మల్లాది, కొడవటిగంటి, చాసో, రావిశాస్త్రి, పురాణం, సత్యం శంకరమంచి, మధురాంతకం, కాళీపట్నం, బలివాడ, పెదభొట్ల, కేతు విశ్వనాథరెడ్డి, ఇనాక్, గూడూరు సీతారాం, అల్లం రాజయ్య, తుమ్మేటి, కాలువ మల్లయ్య, పాకాల యశోదారెడ్డి, ముదిగంటి సుజాత రెడ్డి, బి.ఎస్.రాములు పెద్దింటి అశోక్ కుమార్ మొదలైన వారందరూ కథను తీర్చిదిద్దారు. వ్యాస విస్తరణ భీతి చేత ఇందులో కొంతమందిని మాత్రమే పేర్కొన్నాను.

ఈ నేపథ్యంలో సత్యం శంకరమంచి రాసిన అమరావతి కథలు అజరామర కథలు అని చెప్పవచ్చును. నవోదయ ప్రచురణ సంస్థ నుంచి వెలువడిన ఈ సంపుటిలో నూరు కథలు ఉన్నాయి. అవన్నీ ఒకనాటి చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మికత, సామాజికతలకు అద్దం పడుతున్నాయి. అమరావతిని అక్కడి అమరేశ్వరుని ఆ పరిసరాలను అప్పటి పరిస్థితులను ఇరుసుగా చేసుకుని సత్యం శంకరమంచి రాసిన ఈ కథలు పాఠకులను అనుభూతి చెందేలా ఆలోచించేలా స్ఫూర్తిని అందిస్తాయి. అందుకే అమరావతి కథలు అవి కథలు కావు అక్షర వాస్తవాలు.

ఈ కథా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించడంతో పాటు ప్రఖ్యాత దర్శకుడు శ్యామ్ బెనగల్ ఇందులో 13 భాగాలను హిందీలో దూరదర్శన్ ద్వారా ప్రసారం చేశాడు. అలాగే తెలుగులో శంకు 8 భాగాలను ప్రసారం చేశారు. తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి వి. రాజగోపాల్ అమరావతి కథలపై ప్రామాణికమైన పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ప్రఖ్యాత చిత్రకారుడు బాపు దీనికి అందమైన, భావస్ఫోరకమైన ముఖచిత్రాన్ని గీయగా, ముళ్ళపూడి వెంకటరమణ ముచ్చటైన ముందుమాట రాశారు. ఇందులో మొదటి కథ వరద. సత్యం శంకరమంచి తన కథాక్షేత్రాన్ని గురించి రాస్తూ”తూర్పున వైకుంఠపురం కొండ, దక్షిణాన పాడుబడ్డ బౌద్ధ స్తూపాలు, పడమట ఈనాడు దిబ్బగా మారిన అప్పటి శాతవాహనుల రాజధాని ధాన్యకటకం, ఉత్తరాన ఆ స్థూపాల్ని ఆ దిబ్బల్ని వాటి మధ్య ఉండే ప్రజల్ని, ఆ ఊరిని వడ్డాణంలా చుట్టి గల గల పారుతున్న కృష్ణానది! అద్గది అమరావతి” అంటూ వర్ణిస్తాడు. ఒకరోజు ఉన్నట్టుండి కృష్ణానది పొంగెత్తి ఊరంతా జలమయం కావడం వల్ల కులము ,మతము, ధనిక బీద, ఆడ, మగ చెట్టు నీడన చేరి వంట చేసుకుని భోజనానికి సిద్ధపడతారు. ఈ లోగా నెయ్యి వడ్డనకు వచ్చిన మాల సంగడు బంతిలో శాస్త్రి గారిని చూసి వెనక్కి వెళుతుంటే శాస్త్రి గారు ఒరే సంగా! నీకు ఆకలేస్తుంది నాకూ ఆకలేస్తుంది. ఇంకొకళ్ళు వేస్తే నెయ్యి నువ్వు వేస్తే నెయ్యి కాకపోదు రా... వెయ్యరా అనడం ఆపదలో ఆకలి అందర్నీ ఐక్యం చేస్తుందనడానికి నిదర్శనం. ఆకలికి అంతరాలు లేవు కదా. అయితే వరదలు వచ్చి మనుషుల మనసులు కడిగేసిందనుకుందామా? అంటే స్నానం చేసిన వంటికి తెల్లారేటప్పటికీ మళ్లీ మురికి పట్టినట్లు మనసుల్లో మళ్లీ మలినం పెరుగుతుంది. అందుకే ఎన్ని వరదలు వచ్చినా మనిషి మనసును కడగలేకపోతుంది అన్న చారిత్రక వాస్తవాన్ని చాటారు. ఈ రకంగా అంతరాల దొంతరులు లేని సమాజాన్ని రచయిత ఆశించాడు. సుడిగుండంలో ముక్కుపుడక అనే కథలో సింగి, బాచిగాడు భార్యాభర్తలు. వారు శ్రమజీవులు. ప్రవాహం లేని సమయంలో అక్కడి గుండం లో రాళ్లు ఏరుకుందామని ఉదయం నుంచి సాయంత్రం దాకా నీరు తోడుతూనే ఉంటారు. ఈలోగా భార్య సలహాతో భూషయ్య ఆ దంపతులను దబాయిస్తూ మా ఇంటోల్ల ముక్కుపుడక అందులోనే పడింది. వెతకండి అనగానే వారిద్దరూ తెల్లారే సమయాన దొరికిన ముక్కుపుడకను తెచ్చి భూమయ్యకి ఇస్తారు అలా భూమయ్య శ్రమదోపిడిని, వారి అమాయకత్వాన్ని, శ్రమ జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు ఈ కథలో మనకు తెలియపరుస్తారు. అలాగే పిచ్చయ్య గారు ఒక సాదాసీదా మనిషి. సగటు జీవి. ఉదయం నుంచి రాత్రి వరకు తనదైన శైలిలో దైనందిన జీవితాన్ని గడిపేవాడు.




చుట్టుపక్కల వాళ్లు అనేక ఉబుసుపోక కబుర్లు ఆడుతున్న నిమ్మకు నీరెత్తినట్లు ఉండేవాడు. ఒకరోజు నిద్రలోకి జారుకున్న అతడు అలాగే నిశ్చింతగా శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోతాడు. భార్య కూడా ఇంతకాలం నా ఎదురుగానే ఉండేవాడు. ఇప్పుడు నాలోనే ఉన్నాడు అనుకుంటుంది. అనాయాసేన మరణం - వినాదైన్యన జీవనం కదా!, కాలానికి తెలియకుండా కాలంలో కలిసిపోయి బతికాడు. అది చాలదా? చాలటం లేదు చాలా మందికి అనడం సత్యం శంకరమంచి సామాజిక పరిశీలనకు ఒక చక్కని ఉదాహరణ. సూరయ్య కొడుకు పని పాట లేక తిరగడం పైగా ముగ్గురు సంతానం కావడం భూమి కాస్తా కోర్టు కేసులో పోవడంతో ఇల్లు గడవడమే కష్టం అవుతుంది. దాంతో దిక్కు తోచక సంసారాన్ని ఈదలేక సన్యాసం తీసుకున్నాడు. అతడు కాషాయం కట్టి కమండలం ధరించగానే ఊరు ఊరంతా వచ్చి ప్రాణాచారం పడ్డారు అనడం, స్వామీజీ ముసుగులో ఈనాడు కొంతమంది చేస్తున్న మోసాలతో పాటు అతని దైన్యస్థితిని కూడా ఇందులో రచయిత ప్రస్తావించాడు. ఒకరోజు బిక్ష దొరకక ఆకలితో నకనకలాడుతూ ఇంటికి వస్తే భార్యా పిల్లలు ఎవరు అతనిని ఆదరించలేదు. దాంతో చిరాకు చెంది కాశీకి వెళ్లి సన్యాసం తీసుకోవడం ఇందులో కొస మెరుపు. రత్నాకరుడు వాల్మీకిగా మారిన వైనం ఇందులో మనకు స్ఫురిస్తుంది. తిరునాళ్లకు వచ్చిన కనకాంగి సౌందర్యానికి ముగ్ధుడైన రాయుడు ఆమెను ఉంపుడుగత్తెగా చేసుకుని భోగాలను అనుభవిస్తున్నా స్వేచ్ఛా జీవితాన్ని కోరుకున్న ఆమెకు కొంత కాలానికి నగలన్నా, పట్టుచీరలు అన్న, మల్లెపూలు అన్న ఇష్టం తప్పుతుంది. దాంతో సహజంగా ఉండే సంగని పట్ల ఆసక్తిని, అనురక్తిని పెంచుకుంది. ఒకరినొకరు చూసుకున్నారు. అంతే ఇద్దరి కళ్ళల్లో నీళ్లు అంటూ ముగిస్తాడు.”ముద్దేలనయ్య బిమనసు నీదైయుండా”అనే శీర్షికనే కథ శీర్షిక కావడం అది కథాంశాన్ని వ్యక్తీకరించడం రచయిత శిల్పచాతుర్యానికి మచ్చుతునక అని చెప్పవచ్చు. లౌక్యం కలిగిన సుబ్బాయి పుణుగుల వ్యాపారంతో కోట్లకు పడగలెత్తడం, అది చూచి మనుమడు సుబ్బాయి, సుబ్బయ్యగా, సుబ్బారావు గా మారిన వైనాన్ని అర్థం చేసుకొని పుణుగుల బుట్టలో లచ్చి తల్లి (లక్ష్మీదేవి) దాగుందని గ్రహించి అతడు వాడిన ఆ మసిగుడ్డల్ని పూజిస్తున్నాడని చమత్కరిస్తారు. మనుషుల జూదం, మద్యం మొదలైన వ్యసనాలను ఆసరాగా చేసుకుని ఎదిగే మనుషుల స్వభావాన్ని రచయిత కళ్ళకు కట్టినట్లు ఇందులో చిత్రించాడు. ఇవన్నీ మన జీవితంలో రోజు తారసపడే పరిసరాలే, పరిస్థితులే కావడం విశేషం. అందుకే ఇందులోని ప్రతీ కథ మన చుట్టుప్రక్కల జరిగినట్టే అనిపిస్తుంది.

ఇలా ప్రతి కథను ఆరంభించింది మొదలు చివరి వరకు ఆసక్తిగా చదివిస్తుంది. అద్భుతమైన వర్ణనలు, పాత్రల సృష్టి, భావ సాంద్రత, వస్తువు, శిల్పం ,శైలి అన్నవి సమపాళ్లలో ఒకదానితో ఒకటి పోటీపడి సాగినట్లు అనిపిస్తుంది. న్యాయ శాస్త్రంలో పట్టభద్రులైన శంకరమంచి ఆకాశవాణిలో పనిచేశారు. అలాగే జయపురం లాంటి ఇతర ప్రదేశాలలోనూ విధులు నిర్వహించారు. శంకరమంచి వంశం పండిత వంశం. ఈ పేరు వినగానే కథా సామ్రాట్ సత్యం గారు గుర్తుకొస్తారు. అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహీతయైన శంకరమంచి జానకి (షావుకారు జానకి), నాటక రచయిత ప్రయోక్తలైన శంకరమంచి పార్థసారథి, పంచాంగ కర్త శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, వైదిక పండితులు, రంగస్థల కళాకారులైన శంకరమంచి రామయ్య గారు (మునిగల వీడు), పరమ సాత్వికులు, తాత్వికులైన శంకరమంచి పెద్ద అనంత రామయ్య గారు గుర్తుంచుకోదగిన మహనీయులు. ఆర్. కె. నారాయణ్ మాల్గుడి కథలు లాగా సత్యం శంకరమంచి అమరావతి కథలు చిరస్మరణీయమైనవి. కృష్ణానది ప్రవహించినంత కాలం శంకర”మంచి” కథా స్రవంతి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
**99 891 48 305**

## ఎలుగెత్తిన సార్వత్రిక సమ్మె స్వరం!

ఎక్కడ చూసినా
నయవంచన
పాలిత ప్రజల పాలిటి
విద్రోహ పాలనే..
హక్కుల్లేవు
రాజ్యాంగ రక్షణల్లేవు
ప్రాణాలను ఫణంగా పెట్టి
తరాల త్యాగాలతో
సాధించుకుని
చేజిక్కించుకున్న
ఆ కాసిన్ని
జీవిత సౌలభ్యాలెల్లా
కొల్లగొట్టుకు పోయే కుట్రలే..
ఇప్పుడు
అవునిప్పుడు
అన్యాయమూ
బహిరంగ హింసా
బాహాట దోపిడీ
పాషాణ శాసనమై
కోరలు పదునెక్కించుకుంటున్న
వికటాట్ట హాసాలే..
సకల సంపదలుండీ
స్వేద సంద్రాల
శ్రమ సంస్కృతులు
విరాజిల్లిన నేలన
ఆకలి దప్పుల వేదనల్లో
డొక్కలుతేలిన
జన విలాపాలు
ఇంకెంతకాలమనీ..
పిడికిళ్లు బిగిసి
సహన సంద్రాలు
బద్దలైన కెరటాలై
అదిగో..అదిగదిగో..
ఎగిసిన తుఫానుల
ఆ హోరు చూడు..
రాబందులెల్లా ఏకమై
శ్రామిక అంతానికి
విఫల కుట్రలు జేసే
రాకాసి మూకయ్యి
అందలమెక్కిన
రాజ్యం మీదికి
అదిగో చూడు
జంగు సైరన్..
అందరమొకటై
గుప్పున లేద్దాం
దోపిడి పాలన
అంతం చూద్దాం!!

**- డా.ఇక్బాల్ పాషా**
**9440775732**

## జాతీయ రహదారిపై విద్యార్థుల రాస్తారోకో..

- సమయానికి బస్సులు ఏర్పాటు చేయాలని ధర్నా



**గుమ్మడిదల, జూలై 14 (జనంసాక్షి) :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లిలో మెదక్–బాలనగర్ రహదారిపై సోమవారం ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపాలిటీ తో పాటు మండలంలోని ఆయా గ్రామాలలోని విద్యార్థులు అధిక సంఖ్యలో హైదరాబాద్, నర్సాపూర్, మెదక్, రెండువైపులా పట్టణాలకి విద్యాభ్యాసానికి వెళ్తూ వస్తుంటారు. ఉదయకాల సమయం 7 నుండి 10 గంటల వరకు బస్సులు సరిగా లేకపోవడం విద్యార్థులు ఎక్కువ ఉండడం తో రాకపోకలకు చాలా ఇబ్బంది గురవుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాంతంలో కార్మికులు రోజువారి కూలీలు, ఉద్యోగులు ఉండడంతో సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు. మెదక్ డిపో నుండి లేదా జీడిమెట్ల డిపో నుండి మరికొన్ని బస్సులను ఇదే సమయంలో కేటాయించి రోజు వారి సమస్యను ఉపశమనం కల్పించాలని కోరారు. మందకొండ బస్సులు ఉండడం విద్యార్థులకు సరిపడా బస్సు లేకపోవడం రోజు తీవ్ర ఇబ్బంది గురవుతున్నామని తక్షణమే రవాణా శాఖ అధికారులు స్పందించి తగిన సమయంలో బస్సులను కేటాయించాలని కోరారు.

## ప్రజావాణి వినతులపై సత్వర చర్యలు చేపడతాం

- జోనల్ కమీషనర్ హేమంత్




**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతూ ఆయా సమస్యలపై వినతులను సమర్పిస్తుంటారని, ఇందుకోసం సంబంధిత ప్రతి అధికారి ప్రథమ ప్రాధాన్యతను కేటాయిస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం పరిధి అయ్యా సర్కిలలో విస్తృతంగా కొనసాగిందన్నారు. శేరిలింగంపల్లి చందానగర్ యూసఫ్ గూడా పటాన్చెరు సర్కిల్ ల పరిధిలో అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని, అంతే బాధ్యతతో సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సూచించారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఎలక్టికల్, యూబిడి, వెటర్నరీ, సానిటేషన్ విభాగాల అధికారులంతా ప్రజావాణిలో నమోదయ్య ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిగణించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి వినతులను స్వీకరించడం జరిగిందన్నారు. జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 4 వినతులు రాగా, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం పరిధిలో 07, యూసఫ్ గూడ సర్కిల్ కార్యాలయంలో 3, చందానగర్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 5 కలిపి జోన్ వ్యాప్తంగా పలు విభాగాలకు సంబంధించి మొత్తం 19 వినతులు అందాయన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలకమైన వేదికన్నారు. ప్రజావాణి సందర్భంగా అర్జీదారులనుండి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణను నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి వినతిని విధిగా ఆయా సర్కిళ్లలోని రికార్డులలో నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో పరిష్కరించి ప్రజలకు సమాచారం అందించాలని జోనల్ కమీషనర్ సూచించారు. ప్రతి సోమవారం సర్కిళ్లలో ప్రజావాణి కొనసాగుతున్న సమయంలో సర్కిల్ ఉప కమిషనర్లు సహా వివిధ విభాగాల అధికారులు విధిగా ప్రజావాణిలో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల జోనల్ స్థాయి, సర్కిల్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల భూములను లాక్కొనే అధికారం ఎవరికీ లేదు

- మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్
- ఎన్కేపల్లి భూ బాదితులకు సంఘీభావం



**మొయినాబాద్, జూలై 14 (జనం సాక్షి) :** పన్నెండేళ్ల పాటు ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగించే పేదలకు పట్టాలు ఇవ్వాలనేది రెవెన్యూ చట్టంలో ఉందని కానీ ఇక్కడ ఎన్నేపల్లి రైతులు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను లాక్కొవడం రెవెన్యూ చట్టానికి విరుద్ధంగా ఉందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు, బీజేపీ నేత ఈటల రాజేందర్ పేర్కొన్నారు హైదరాబాద్ శివారులో మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్వేపల్లి సర్వే నంబర్ 180లో గోశాల స్థలంలో ఎక్కేపల్లి భూ బాదితులు 8 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. వీరికి చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎన్. రత్నం అధ్వర్యంలో బీజేపీ నాయకులు పూర్తి సంపూర్ణ మద్దతు నలుకుతున్నారు ఇందులో బాగంగా ఈటల రాజేందర్ సోమవారం పాల్గొని వారి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల నుంచి భూములను తీసుకొని పెద్దలకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. వేదల భూములు ఎవడి అబ్బా సొత్తు కాదని, వారి జోలికొస్తే ఖబద్వార్ అని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరికీ తెలియకుండా ప్రభుత్వ ఆసెన్డ్ భూములను అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని ఆరోపించారు. ఫార్మసీల పేరిట భూములు తీసుకొని ఇప్పటి వరకు రైతులకు పరిహారం ఇవ్వలేదని తుక్కుగూడలో ఇదే జరిగిందని తెలిపారు. పైగా అదే కంపనీల్లో రైతులు కూలీలుగా పనిచేస్తున్నారని కోట్ల విలువైన భూములను ఇచ్చి అదే కంపనీలో నౌకర్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో అనేక భూ పోరాటలు చేశానని బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేనప్పుడు వేదలకు అన్నాయం చేస్తున్నందుకు అప్పట్లోనే వ్యతిరేకించానని గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ళ నుంచి సాగు చేసుకుంటున్న సాగు భూముల్లో గోశాల ఏర్పాటు చేయడం సరైనది కాదని సాగుకు పనికి రాని భూముల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. గోశాలకు తాము వ్యతిరేకం కాదని వేదల నుంచి భూములను తీసుకుంటుందన్నందుకే తాము వ్యతిరేకమన్నారు. గోళాల మీద అంత ప్రేమ ఉంటే ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ ఏర్పాటు చేయాలని సూచించాడు. ఎన్కెపల్లి పేదలకు న్యాయం చేసేంత వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు ప్రజలు కూడా ఆలోచన చేయాల్సిన అవసరముందని ఎవరూ ప్రజల పక్షాన ఉన్నారో. ధర్మం వైపు పనిచేస్తున్నారో. గుర్తుచేసుకొని ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. అంతేకాకుండా ఉన్యాయం జరిగితే ఏ పార్టీ ప్రజల వైపు ఉద్యమం చేస్తుందో కూడా గుర్తుచేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడి పచ్చిన వారికి భోజనాలు తీసుకువస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తతత నెలకొంది. వెంటనే మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు. అక్కడికి వచ్చిన వారికి రత్నం స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, అందెల బాబయ్య, ఎల్లని వెంకటేష్ గౌడ్ గున్నాల గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ గౌడ్ ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, డప్పు రమేష్ ఈశ్వర్, ఎనికేపల్లి రైతులు పాల్గొన్నారు.

## బసవతారక నగర్ వాసులకు సొంతిలను మంజూరు చేయండి



**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** బసవతారక నగర్ వాసులకు బేషరతుగా సొంతిళ్లను మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి పి. యాదయ్య, శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి చల్లా శోభన్ తదితరులు మాట్లాడుతూ బసవతారక నగర్ ప్రాంతంలో 8 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, గత మూడు దశాబ్దాలకుపైగా అక్కడ నిరుపేదలు ఆవాసం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తరఫున బసవతారక నగర్ వాసులకు మంచినీటి సౌకర్యం, విద్యుత్తు, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, స్మశాన వాటిక తదితర కీలక మౌలిక వసతులన్నీ గతంలోనే కల్పించడం జరిగిందని, ఇప్పుడు అక్కడి ప్రాంతం స్థలం విలువ భారీగా పెరగడంతో కొంతమంది దళారులు నిరుపేదల పొట్ట కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామ పరిధి సర్వే నెంబర్ 37 లో నిరుపేద బడుగులు బసవతారక నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకొని దశాబ్దాలుగా ఆవాసం ఏర్పాటు చేసుకున్నందున ఎట్టి పరిస్థితులలోనూ న్యాయం వారి పక్షాన నిలబడి సదరు ఎనిమిది ఎకరాల స్థలం వారికే దక్కుతుందన్నారు. బసవతారక నగర్ వాసులకు పూర్తి న్యాయం జరిగే వరకూ తాము ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేయబమని, వారికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ద్వారా ఇళ్లను వారికి కేటాయించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని ధీమాను వ్యక్తం చేశారు. బసవతారకనగర్లో గత 40 సంవత్సరాలుగా నిరుపేద ప్రజలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, కనీస మౌలిక వసతులు లేని కాలం నుండి బ్రతుకును వెల్లదీస్తూ నేడు బసవతారక నగర్గా రూపాంతరం చెంది జీవనం కొనసాగిస్తుంటే ఓర్వలేని కొన్ని దుష్టశక్తులు సదరు విలువైన స్థలాలపై కన్నేసి అమాయకులైన నిరుపేదలను అక్కడి నుండి ఖాళీ చేయించి వాటిని కబ్జా చేసేందుకు కుటిలయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది దళారులు వచ్చి బసవతారక నగర్ వాసులను బెదిరించినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) బసవతారక నగర్ వాసులకు సంపూర్ణ అందిస్తుందన్నారు. తప్పకుండా బసవతారక నగర్ వాసులకు న్యాయం జరిగి తీరుతుందని, అది జరిగేవరకు తాము విశ్రమించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి జగదీష్, నాయకులు అగిరప్ప, అనిల్, శివన్న, జంగయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**జిన్నారం, జూలై 14 (జనం సాక్షి) :** జిన్నారం మండలం ఐడిఏ బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ప్రణాళిక లో భాగంగా 43వ రోజున ఆర్డీఎంఏ శ్రీనివాస్ రావు మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్ , వైకుంఠ దామం, క్రీడా ప్రాంగణం పరిశీలించడం జరిగింది. వివిధ వార్డుల్లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన సోమవారం నాడు క్షుణ్ణంగా పర్యవేక్షించడం జరిగింది. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ బి కిషన్, డి.ఈ.సత్యనారాయణ, ఏఈ, మేనేజర్,వార్డ్ అధికారులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీని బర్తరఫ్ చేయండి

- ప్రజావాణిలో డిమాండ్



**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి) ఆగడాలు రోజురోజుకి శృతి మించి పోతున్నాయని, బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తూ అక్రమాలను పెంచి పోషిస్తున్నాడని కొండాపూర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు చందు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శేరిలింగంపల్లి సర్కిల్ అక్రమాలు, ఏసిపి దుర్మార్గం పై జిహెచ్ఎంసి కమిషనర్ కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మధ్యకాలంలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్ డివిజన్ పరిధి సర్వే నెంబర్ 35, 36 లో గల సిద్ధిక్ నగర్, అంజయ్య నగర్, కొండాపూర్ డివిజన్ పరిధితోపాటు అనేక ప్రాంతాలలో విచ్చలవిడి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, గత సంవత్సర కాలంలో ఏకంగా 400 కు పైగా అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా సాగుతున్నాయి అంటే అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలుతుందో ఉన్నతాధికారులు గమనించాలని చందు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి ఏసిపి వెంకటరమణ దారుణాలపై మీడియా పూర్తి సాక్షాదారాలతో విశ్లేషణాత్మక కథనాలు కోకొల్లలుగా ప్రచురించినా అతడిపై కనీస చర్యలు లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందని, శేరిలింగంపల్లి ప్రాంతంలో ఏ అక్రమ అధికారి అయినా రెండు మూడు ఫిర్యాదులతోనే మూట ముల్లె సర్దుకుని వెళ్లిపోయేవాడని, మరి ప్రస్తుత శేరిలింగంపల్లి ఏసిపి విషయంలో ఎందుకు ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని చందు దుయ్యబట్టారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకుంటున్నారా, లేక శేరిలింగంపల్లి ని ఏసిపి వెంకటరమణ కు గుత్తాధిపత్యంగా కేటాయించారా వివరణ ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వ పెద్దలకు ఉందని ఆయన దుమ్మెత్తి పోశారు. ఏసిపి వెంకటరమణ వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు తావిస్తుందని, అనుమానాస్పదంగా ఉందని, శేరిలింగంపల్లి ని ఏం చేద్దామని అతనిని ఇంకా కొనసాగిస్తున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కు ఉందని చందు స్పష్టం చేశారు. 2024 నవంబర్ 19న అక్రమ సెల్లార్ నిర్మాణానికి సహకరించి ఆరంతస్తుల భవనం ఓవైపు పూర్తిగా వంగి ఎంతోమందిని తీవ్ర ఆందోళనకు గురిచేసిన సంఘటన మొదలుకొని సంవత్సర కాలంగా ఏసిపి వెంకటరమణ ప్రతి అక్రమాన్ని తాము ఎండగడుతున్నప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు ఉన్నతాధికారులు చోద్యం చూస్తుండడం దిక్కుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. తక్షణమే శేర్లింగంపల్లి సర్కిల్ ఏసిపి ని శేర్లింగంపల్లి నుండి పంపించకుంటే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని, శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం కావడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# ఆయిల్‌పామ్ పంటకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రభుత్వ చీఫ్ వీప్ పట్నం మహేందర్ రెడ్డి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యదయ్య
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**షాబాద్, జూలై 14 (జనం సాక్షి) :** ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేదు గ్రామంలో పీసరి సురేందర్ రెడ్డి 20 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే కాలే యదయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలోని రైతులు తోటలు, పంటలు పెట్టుకొని ఉంటే భూములు అమ్మే పని ఉండదని సూచించారు. ఆయిల్ పామ్ పంట నలభై ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కు ఎటువంటి నీటి సదుపాయం అందే విధంగా లేదు కాబట్టి, రైతులందరూ తోటలు పెంచితే వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఆయిల్ పామ్ పంట వేసిన తర్వాత మీరు సహజంగా పండించే ఏ పంటలైన అందులో వేసుకోవచ్చని సూచించారు. రంగారెడ్డి జిల్లా పచ్చబడితే తెలంగాణ మొత్తం పచ్చబడుతుందని తెలిపారు. పంటలు పండిస్తే వచ్చే ఆనందం భూములు అమ్మితే రాదని తెలిపారు. ఈ పంటను ఎక్కడ అమ్మాలి అని ఏ రైతు కూడా చింతించవద్దని తెలిపారు. మీ పంట దగ్గరికే వచ్చి కంపెనీవారు మీ పంటను కొనుగోలు చేసుకుని మీ ఖాతాలలో డబ్బులు వేస్తారని తెలిపారు. ఇంతకుముందు ఉన్న పది ఉమ్మడి జిల్లాలలో రెండు సంవత్సరాలలో ముందుగా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులందరూ సరైన వ్యవసాయం చేయాలని, ఆదాయం వచ్చే పంటలు పండించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రైతులు ఏ పంట పండించిన వారికి డ్రిప్పులు అందజేయాలని అధికారులకు తెలియజేశారు. భారతదేశానికి కావలసిన సీడ్ గార్డెన్ తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పామాయిల్ పంట వేసే రైతుకు ప్రతి సంవత్సరం 51 వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు. రైతులు పంటను పండించిన తర్వాత దానిని తీసుకువెళ్లి అమ్మే బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. పంటకు కావలసిన ఫర్టిలైజర్, ఎరువులు, డ్రిప్పులు అందజేస్తామని తెలిపారు. సర్దార్ నగర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కాలె యదయ్య గుడిమల్కాపూర్ పూల మార్కెట్ ను అజీజ్ నగర్ కు తరలించాలని కోరగా మార్కెట్ కి కావాల్సిన భూమి ఇరిగేషన్ వివరాలు కంప్లీట్ అయిన తర్వాత ముఖ్యమంత్రి తో మాట్లాడి మంజూరు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో దాదాపు 4000 ఎకరాలలో పామాయిల్ పంటను సాగు చేయడానికి రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే కాల యాదయ్య మాట్లాడుతూ... పామాయిల్ పంటకు ఎటువంటి పంట నాశనం చేసే జంతువుల బెడద ఉండదని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు ఏదైనా అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకు వెళ్తే క్షణం ఆలోచించకుండా దానికి సంబంధించిన అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా ఐఏఎస్, జాయింట్ డైరెక్టర్ సంగీత లక్ష్మి, వాల్యూ ఆయిల్ ఎండి రామకృష్ణ, చెవెళ్ల ఆర్డిఓ చంద్రకళ, షాబాద్ ఎంపీడీవో అపర్ణ,సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, సరదా నగర్ మార్కెట్ డైరెక్టర్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా శ్రీపాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి కొండ సురేఖ



**పరిగి, జూలై 14 (జనం సాక్షి) :** కుల్కచర్ల మండలం పరిధిలోని బండవెల్కి చర్ల గ్రామం శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ని రాష్ట్ర అటవీ – పర్యావరణ %ఁ% దేవాదాయ శాఖ మంత్రి కొండా.సురేఖ మరియు పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడి ఆవరణలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 80 కోట్లతో కూడిన సమగ్ర ప్రణాళికను మంత్రివర్యులకు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...“ శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కొరకు సమర్పించిన ప్రణాళికను 100% శాతం దశలవారీగా అమలు చేస్తూ ఆలయాల పునర్నిర్మాణం,అభివృద్ధి పనులను అత్యున్నత ప్రమాణాలతో పూర్తిచేస్తాం ” అని తెలిపారు. పరిగి నియోజకవర్గ పరిధిలో అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని మంత్రి శ్రీమతి కొండా.సురేఖ పేర్కొన్నారు. చింతపండు ఈ కార్యక్రమంలో పరిగి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ పట్టాలను రద్దు చేయాలి

- అర్హులైన వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంక గోపాల్

**వీపనగండ్ల, జూలై 15 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గల సర్వే సంఖ్య 618 భూమిలో ముగ్గురు రైతుల అక్రమ పట్టాలను రద్దు చేయాలని సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ పట్టాలను రద్దు చేయాలని, గ్రామ కంఠం భూమిగా ప్రకటించాలని, ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొల్లారం రెవెన్యూ సదస్సులో ఇచ్చిన భూ ఫిర్యాదులను పరిష్కరించాలని తహసిల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్, మండల కార్యదర్శి ఎం. కురుమయ్య మాట్లాడుతూ బొల్లారం భూ సర్వే సంఖ్య 618లో 15 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. 30 ఏళ్ల క్రితం ఆ భూమి పట్టాదారులు గ్రామస్తులకు ఇళ్ల స్థలాల కోసం భూమి అమ్మినట్లు గుర్తు చేశారు. అప్పటినుంచి ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని గ్రామకంఠం భూమిగా నమోదు చేసి నివాసం ఉంటున్న వారి



ఇండ్లకు అనుమతి ఇచ్చి పట్టాలు ఇవ్వాలని మండల తహసీల్దార్, జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ శాఖ మంత్రి కృష్ణారావుకు దరఖాస్తులు సమర్పించడం జరిగిందన్నారు. విచారణ జరపకుండా రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా గతంలో భూమిని ఇండ్ల స్థలాలకు అమ్మిన వారి వారసులు కావలి సాయిబాబా, కావలి సుదర్శన్, కావలి రాముడు లకు పట్టాలి ఇచ్చి రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లు నమోదు చేశారన్నారు. ఆ భూములకు రైతుబంధుకు ఇవ్వటమే గాక బ్యాంకులో రుణాలు ఇస్తున్నారని అన్నారు. పట్టాదారులు అభ్యంతరం తెలపడంతో రైతు భరోసా ఇవ్వటం లేదన్నారు. అక్రమ పట్టా పొందిన ముగ్గురిలో కావలి సాయిబాబ ఇటీవల ఎర్ర మఠం కు చెందిన సుజాతకు స.నెం. 618లో ఎకరా 10 గుంటల భూమిని అక్రమంగా పట్టాచేశారని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. కావలి సుదర్శన్ కావలి రాముడు ల పేర పట్టాలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 106లో సాగులో ఉన్న పట్టాదారుల పేర్లు ధరణి వచ్చినప్పుడు మాయం చేసి, ఇతరుల పేర్లు ఎక్కించారన్నారు. విచారణ జరిపి సాగులో ఉన్న పట్టాదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించాలన్నారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో స.నెం. 618, స.నెం. 106 భూ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసిన ఇంతవరకు విచారణ జరిపి సమస్య పరిష్కరించలేదన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని తాసిల్దార్ వరలక్ష్మీ హామీ ఇచ్చారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొల్లారం గ్రామ శాఖ కార్యదర్శి చలమారెడ్డి, నాయకులు వేమన్న కృష్ణయ్య, తడకల వెంకటస్వామి, శివయ్య, దగడపల్లి, కురుమయ్య, దేవరపాగా కురుమయ్య, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 14 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదు లకుప్రాధాన్యతనిస్తూ వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 52 ఫిర్యాదు లు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి న ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమ స్యలను పరిష్కరించా లని కలెక్టర్ అధికారులను ఆదే శించారు. ఫిర్యాదులపై చేప ట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- జిల్లా కలెక్టర్, ఏఎస్పిలకు డిబిఎఫ్ విన్నపం



**శివ్వంపేట, జూలై 14 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం బిజిలిపూర్ గ్రామ దళితుల పై దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు బాధితులు విన్నవించారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పి మహెందర్ ను కలిసి నిందితులను అరెస్టు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, జిల్లా నాయకులు చంద్రం, హ్యూమనిస్టు లక్ష్మణ్ లు మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ రోజున దళిత యువకులు రాంచరణ్, సాయి వర్ధన్ లు స్థానిక కిరాణా షాపులు వస్తువులు తీసుకొని తిరిగి వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన తుమ్మల మధు అనవసరంగా వారిని దూషించి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకొని అక్కడికి వెళ్ళిన అన్నదమ్ములైన పెద్దళ్ళ నవిన్, ప్రవిణ్, ప్రభులు మధును నిలదిసి ప్రశ్నించగా మిగతా మరో 20 మందికి దళితేతరులు వాళ్ళ పై కూడా దాడి చెశారన్నారు. అడ్డం పొయిన దళిత మహిళ శ్యామల ఆమె భర్త ఆశయ్య లను సైతం కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారన్నారు. అదె రోజు బాధితులు శివ్వంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తుమ్మల మధు మరో అయిదుగురి పై పోలీసులు ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినందున నిందితులను అరెస్టు చెసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు నవిన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోండి

- మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా సమస్యలు పరిష్కారం
- జిల్లా ఎస్పీ ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 14 (జనం సాక్షి) :** జిల్లా పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓపిగకగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత యస్.హెచ్.ఓ. లకు ఫోన్ ద్వారా మాట్లాడి, వారి సమస్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడం ఎలాంటి అలసత్వం చూపరాదని, చట్టప్రకారం కేసులను పరిష్కరించాల్సిందిగా యస్.హెచ్.ఓ. లకు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు తమ సమస్యకు పరిష్కారం దొరకని సందర్భంలో నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛంధంగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించేందుకు, సత్వర న్యాయం చేసేందుకే పోలీసుశాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలసిందిగా ఎస్పీ సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 14 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కొత్త ఆవిష్కరణలకు అటల్ ల్యాబ్‌లు దోహదం

- జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

**శివ్వంపేట, జూలై 14 (జనంసాక్షి) :** కొత్త కొత్త ఆవిష్కరణలకు అటల్ టింకరింగ్ ల్యాబ్ లు ఎంతగానో దోహదపడతాయని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ల ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణకు రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే శాస్త్ర సాంకేతిక రంగాలవైపు మళ్లించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్ లు కీలకంగా మారుతాయనీ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే జిల్లాలో 25 పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేసిందని, ప్రతి పాఠశాలకు 10 లక్షల రూపాయల విలువైన రోబోటిక్స్ తో పాటు అధునాతన ప్రయోగ పరికరాలను అందజేశారనీ రాజారెడ్డి గుర్తు చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ల ద్వారా సైన్స్, టెక్నాలజీ, గణితం, అలాగే ఇంజనీరింగ్ సంబంధించిన అనేక అంశాలపై విద్యార్థులకు



అవగాహన కల్పించవచ్చునన్నారు. ఆ తర్వాత మండల విద్యాధికారి బుచ్చ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో రెండు సెంటర్లను ఏర్పాటు చేయగా ఈ కేంద్రంలో 12 పాఠశాలల సంబంధించిన 36 మంది ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు టింకరింగులపై శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో విద్యార్థులచే ప్రయోగాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కోర్స్ కోఆర్డినేటర్ బాలచంద్రం, రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్య క్రమంలో వచ్చిన ఫిర్యాదుల ను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య ఆదేశించారు. సోమవారం రోజు డీఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వ హించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 మంది ఫిర్యాదులను డీఎస్పీ నల్లపు లింగయ్య స్వీకరించి పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్య క్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యా దులను తక్షణమే పరిష్కరిం చాలని తగిన సలహాలు సూచనలు ఇచ్చారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లా డుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫైర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగదాలకు సంబంధిం చిన ఫిర్యాదులను సంబం ధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించా రు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా రసీదు, ఎఫ్ ఐ అర్ కాఫీ ఇవ్వాలని పోలీసు అధికారులకు తెలిపారు. జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా భద్రత కల్పించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## చిలప్‌చేడ్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు పరిశీలన



**చిలప్‌చేడ్, జూలై 14 (జనంసాక్షి) :** భూభారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులు పరిష్కార ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా సేకరించిన దరఖాస్తులను పరిష్కరిస్తున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. రెవిన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కార దిశగా కృషి చేయాలి అన్నారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ సహదేవ్, డిప్యూటీ తాసిల్దార్ సింధుజ, ఆర్ ఐ వెంకటేశం సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

**పటాన్‌చెరు, జూలై 14 (జనం సాక్షి) :** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మండలం అందూర్ గ్రామానికి చెందిన మన్నే ఆంజనేయులు వైద్య చికిత్స కోసం 3 లక్షల 50 వేల రూపాయలు, రామచంద్రపురం ఎస్ఎన్ కాలనీకి చెందిన బచ్చు మయాంక్ దత్త వైద్య చికిత్స కోసం 4 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరయ్యాయి. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు సోమవారం సాయంత్రం క్యాంపు



కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా ఎల్ ఓ సి అనుమతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, గోపాల్, నర్రా బిక్షపతి, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంతో పేదోడి సొంతింటి కల సాకారం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ రాజ్యంతో పేదోడి సొంతింటి కల నెరవరుతు న్నదని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి మాజీ డిసిసి అధ్యక్షులు కుం భం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట మండలం లోని నెమళ్ళపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలకు అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తరఫున 20 లక్షల ఇండ్లు నిరుపేదలకు అందిస్తామని తెలిపారు. ప్రతి సోమవారం నాడు ఇందిరమ్మ ఇండ్ల నిధులు విడుదల చేస్తామని తెలిపారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితా విడుదల చేసి అందరికి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, రాజు, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (జనం సాక్షి) :** చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటానని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజకుమార్ రెడ్డి హామీనిచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సికిల్ గేరి లో పని చేస్తున్న చేనేత కార్మికులను ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి సోమవారం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు చాలీచాలని జీతాలు వస్తున్నాయని, దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని రాజ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తమకు పింఛన్లు రావడం లేదని, తమ పిల్లలు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని వారు కోరారు.

### చేనేత కార్మికులకు అండగా ఉంటాం

చేనేత కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలను



దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

నారాయణపేటలో చేనేత కార్మికులు ఎంతో దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నారని, పూట గడవడం కూడా కష్టంగా ఉందని అన్నారు. నారాయణపేటలో చేనేత వృత్తిపై ఆధారపడి పని చేస్తున్న కొందరు మహిళా కార్మికులకు ఇప్పటికీ ప్రభుత్వం నుండి పింఛన్లు అందడం లేదని తన ముందు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి పిల్లల చదువుల కోసం తమ ఫౌండేషన్ ఎల్లవేళల కృషి చేస్తుందని భరోసా కల్పించారు. అనంతరం చేనేత కార్మికులు వారు తయారుచేసిన దండ, శాలువాతో రాజ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులతో పాటు ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, వెంకటరావు, హన్మంతు ముదిరాజ్, వై.సంతోష్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నందుకుమార్, మన్నె గోపాల్, నర్సింహా, కృష్ణ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో స్పష్టమైన ప్రగతి చూపాలి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి**

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు ప్రతినిధి, జులై 14(జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయి గ్రౌండింగ్ కాక మిగిలిన ఉన్న ఇండ్లు వారంలోగా నిర్మాణ పనులను గ్రౌండింగ్ చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రోత్సహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో జిల్లాను ముందు వరుసలో ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను కోరారు. మండలాల వారీగా కేటాయించిన లక్ష్యం, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరీలు తెలిపిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రౌండింగ్ విషయంలో వెనుకంజలో ఉన్న మండలాలను గుర్తించి, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముగ్గు పోసి, ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లా లో ఇసుక అందుబాటులో ఉందని, లబ్ధిదారులకు కేటాయించిన దగ్గరి నుండి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పనులను దశలవారీగా పూర్తి చేస్తూ సంబంధిత ఫోటోలు, వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నలారా.. అక్కలారా..
# జనస్రవంతిలోకి రండి

**గుత్తికోయ గుడాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు**

**మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజా ఫ్రంట్ పిలుపు**




**ములుగు/వెంకటాపూర్, జులై 14 (జనంసాక్షి):** సిద్ధాంతం కోసం అడవి పాలైన అన్నలారా, అక్కలారా జన స్రవంతిలోకి రండి అని గొత్తి కోయ గుడాల్లో ఆదివారం అర్ధరాత్రి మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజా ఫ్రంట్ మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు అంటించారు. వివరాలలోకి వెళితే వెంకటాపూర్ మండలంలోని బండ్లపహాడ్, ఊట్లు, తోరిచింతలపాడు, సకలిరేవు తదితర గొత్తి కోయ గూడేల్లలో వాల్‌పోస్టర్లు అంటించారు. వాల్ పోస్టర్లలో ఉన్న వివరాలు మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజాఫ్రంట్ పిలుపు సిద్ధాంతం కోసం అడవి పాలైన అన్నల్లారా, అక్కల్లారా! మీరు నమ్మిన సిద్ధాంతం సామాన్యునికి ఆశాకిరణం ఎన్నడైందని, మీకు ఎదురైన సవాళ్లు, తద్వారా వచ్చే పరిణామాలు విశ్లేషిస్తే మీకు ఆత్మసంతృప్తిని మిగిల్చిందేదని, ఆత్మసంతృప్తి లేని ఆత్మగౌరవంతో ముందుకు పోతున్న మీ 40 ఏండ్లనాటి ఉద్యమ బాట ప్రజాధరణ లేక మోడువారిన జిడ్డు భూమిలాగా అయ్యిందని, మావోయిస్టు అగ్ర నాయకుల్లారా ఇకనైనా మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి కాలానుగుణంగా మారిన ప్రజల జీవన విధానంలో పాత్రులు కండి అడవిని వీడి ప్రజల్లోకి రండి- ప్రజాస్వామ్య గొంతుక కండి. ఆయుధాలు మనకొద్దు - ప్రజామోద మార్గమే మనకు ముద్దు. ఆయుధాలు వీడండి- జనజీవన స్రవంతిలోకి రావాలని, మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించండి అని పిలుపునిచ్చారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టండి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ బ్యూరో, జూలై 14 (జనంసాక్షి) :** ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూభారతి చట్ట అమలును తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను ఈ నెలాకరులోగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే 55 శాతం పూర్తైనట్టు తెలిపారు. మిగిలిన భాగాన్ని తక్షణమే పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెండో దశ జ్వర సర్వే 34 శాతం పూర్తైనట్టు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్ష కిట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, ఎంపీడీవోలు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు.రాష్ట్రంలోనే మొట్టమొదటగా నిర్మల్ జిల్లా సంరక్షణ గృహాల్లో ఉండే అనాధ పిల్లలకు ప్రత్యేక ఆరోగ్యశ్రీ కార్డులు అందించామని, వీటి ద్వారా వారికి రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం తాండ్రా.జి గ్రామానికి చెందిన రైతు సందుపట్ల రాజేశ్వర్‌కు, మల్బరీ ఆకుల సాగుకు షెడ్ నిర్మాణానికి సిల్క్ సమగ్ర-2 పథకం కింద రూ.4.50 లక్షల వ్యయంతో, తొలి విడతగా రూ.93,775 సబ్సిడీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు వినూత్నంగా ఆలోచించి కొత్త పంటల సాగు చేసి, అధిక లాభాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రిమ్స్‌లో లిఫ్టు లేక రోగుల అవస్థలు

**ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు**

**మెట్ల పైనుంచే వస్తూ పోతున్న రోగులు**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ ఆసుపత్రి లో లిఫ్ట్ పనిచేయక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజూ వందల సంఖ్యలో జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ కు రోగులు చికిత్స నిమిత్తం వస్తూ పోతుంటారు. అందులో ఎక్కువ సంఖ్యలో దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వయోవృద్ధులు చికిత్స కోసం వస్తుంటారు. చికిత్స కోసం పై అంతస్తులో ఉన్న డాక్టర్ ల వద్దకు వెళ్లాల్సి వస్తే రోగుల కోసం రిమ్స్ లో లిఫ్ట్ లను ఏర్పాటు చేశారు. కానీ అవి ఉండి లేనట్టుగా మారాయి. రోజుల తరబడి లిఫ్ట్ లు పనిచేయక దిష్టి బొమ్మల్లా మిగిలి పోతున్నాయి. వైద్యం కోసం వచ్చిన వయోవృద్ధులు, లిఫ్ట్ లు పనిచేయక పోవడంతో పై అంతస్తు కోసం ఏర్పాటు చేసిన మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి లిఫ్ట్‌లు పనిచేయక పోవడం కారణంగా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు లిఫ్ట్ అవస్థలు తప్పడం లేదు. రోజుల తరబడి రిమ్స్ లో పనిచేయక ఉన్న లిఫ్ట్ లను బాగు చేయించే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా దూర ప్రాంతాలనుంచి వైద్యం కోసం వస్తున్న రోగులకు ఈ లిఫ్ట్ ప్రధాన సమస్యగా మారిపోయింది.

## రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజల
# కష్టాలు దూరం చేస్తా!

**ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జులై 14 (జనం సాక్షి) :** కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోని రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి, ప్రజల కష్టాలను దూరం చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని కాగజ్ నగర్ దహగం మండలాల మధ్యగల బట్పల్లిఅందవెల్లి గ్రామాల మధ్య అసంపూర్తిగా ఆర్ అండ్ బి అధికారులు వదిలివేసిన రోడ్డుకు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొంతకాలంగా కోర్టులో నలుగుతున్న సమస్యకు పరిష్కారం దొరికిందని తెలిపారు. 2016 సంవత్సరంలో ఆర్ అండ్ బి అధికారులు ఈ మార్గంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ ఇక్కడ ముగ్గురు రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో గత ఎనిమిది సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఈ మధ్యకాలంలోనే హైకోర్టు నుంచి తీర్పు వచ్చిందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్ బాబు వెంట పంచాయతీరాజ్ శాఖ ఈ.ఈ కృష్ణ, ఏ.ఈ మణిరాజ్ మాజీ ఎంపిటిసి సభ్యులు చంక గణపతి, పిరిసింగుల తిరుపతి, గ్రామ బిజెపి నాయకులు మొండి, రామన్న, సత్యనారాయణ, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**మాదక ద్రవ్యాలపై అవగాహన**

**ఎస్పి కాంతిలాల్ పాటిల్**



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జులై 14 (జనం సాక్షి) :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలని ,తద్వారా వారు జీవితంలో వృద్ధి పథంలో రాణిస్తారని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెర మేరి మండలంలోని మోడీ గ్రామంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ క్రాంతి లాల్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ( డ్రగ్స్) దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులకు పోలీసులు ఎప్పుడు అండగా ఉంటారని, వారికి సలహాలు, సూచనలు చేస్తూ వారిని ఎల్లవేళలా ఆదుకుంటారని తెలిపారు. పాఠశాల లు, కళాశాలలో విద్యార్థులు ఇవ్ టీజింగ్, వేధింపులకు, ఫైబర్ నేరాలకు గురైతే వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు కు లేదా 87126 70551 కాల్ చేసి తెలపాలని అన్నారు. అంతకుముందు పాఠశాలలకు చేరుకున్న ఎస్పీకి గ్రామస్తులు, విద్యార్థులు డోలు వాయిద్యాలతో పలికారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రకాష్, వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కేర మేరి ఎస్ సై మధుకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్ దాస్, గ్రామ పెద్దలు పటేల్ ఆత్రం లక్ష్మణ్,, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం కావాలి

**క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి కాగానే సమాచారాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయండి**

**ఒకే సమస్య పైన పలు మార్లు గ్రీవెన్స్ కి రాకుండా చూడాలిసిన బాధ్యత అధికారులదే**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ ప్రతినిధి, జూలై 14(జనంసాక్షి) :** ప్రజావాణి లో వచ్చే దరఖాస్తు లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే సమస్య పైన పలు మార్లు వినతిని సమర్పించకుండా ఎప్పటికప్పుడు గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తు లకు సంబందించి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి కాగానే...తీసుకున్న నిర్ణయన్ని సదరు వ్యక్తి కి సమాచారాన్ని చేరవేయాలన్నారు. లేనిచో మళ్ళీ అదే సమస్య పైన వినతి సమర్పించేందుకు గ్రీవెన్స్ కి ప్రజలు రావలిసిన అవసరం ఏర్పడుతుందన్నారు. పదే పదే గ్రీవెన్స్ కి వచ్చి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని... వారి సమస్య పరిష్కారం జరిగే తీరును వివరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈనాటి గ్రీవెన్స్ లో వచ్చిన కొన్ని వినతుల వివరాలు. దేవరప్పుల మండలం బంజర గ్రామానికి చెందిన ఆలేటి సోమయ్య అనే వ్యక్తి తన వ్యవసాయ భూమిని అతని కుమారులు మోసపూరితంగా వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఈ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయమని వినతి సమర్పించాడు. లింగాల గణపురం మండలం చెందిన గండి వెంకటయ్య తనకు గృహ జ్యోతి పథకం అమలు పరచాలని కోరాడు. జనగామ కు చెందిన సత్యనారాయణ అనే దివ్యాంగుడు తనకు డబల్ బెడ్ రూమ్ ఇప్పించమని దరఖాస్తు సమర్పించాడు. జనగాం మండలం పెంబర్తికి చెందిన కేశవరెడ్డి అనే వ్యక్తి తనకు చెందిన 36 గుంటల మిగులు భూమికి సంబంధించి పాస్ బుక్ ని మంజూరు చేయాలని కోరాడు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల రజిత అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు ఇప్పించమని కోరింది. బచ్చన్నపేట మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనే వ్యక్తి తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. రఘునాథపల్లి మండలం అశ్వరావు పల్లి గ్రామానికి చెందిన స్వామి అనే వ్యక్తి.. తన భూమికి సంబంధించిన ఫిజికల్ రిపోర్టును పునః పరిశీలించాలని వినతి సమర్పించాడు. పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన సుజాత మహిళ ఇందిరమ్మ ఇల్లు ఇప్పించమని కోరింది. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ లు, ఆర్డివో లు, కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



## పట్టణంలో స్కూల్ కాలేజ్ ఆలయాల వద్ద బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలి

**జనగామ ప్రతినిధి, జూలై 14(జనంసాక్షి):** జనగామలో గ్రీవెన్స్ సెల్ లో జనగామ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ మాట్లాడుతూ జనగామ పట్టణంలో రాత్రి సమయాలలో ఉదయం తెల్లవారుజామున కూడా బెల్ట్ షాపులు స్కూలు కాలేజీలు ఆలయాల వద్ద తాగడానికి వచ్చిన మందుబాబులు పక్కా ఇంటి వారికి డిస్ట్రబ్ చేస్తున్నారు ఇప్పుడున్న యువత కూడా అడ్డు అదుపు లేకుండా రాత్రింబగళ్లు తాగుతూ రోడ్లమీద తిరుగుతున్నారు అన్ని వార్డులలో మద్యం బెల్ట్ షాపులు 24 గంటలు బెల్ట్ షాప్ లో పై గౌరవ ఎక్స్చేంజ్ అధికారులు గౌరవ జిల్లా కలెక్టర్ విషయంపై దృష్టి కేంద్రీకరించి బెల్టు షాపులు నియంత్రించాలని కోరారు ఈ కార్యక్రమంలో గండి నాగరాజు దుబ్బాక వీరస్వామి, వంగ భీమ్ రాజ్ ,పండుగ నరేష్ ,మద్దెల కార్తీక్, తదితరులు పాల్గొని వినతి పత్రం ఇచ్చి సమస్యను విన్నవించారు.

# మిర్చి పౌడర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి



**మహదేవపూర్, జూలై 14 (జనం సాక్షి) :** మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించి, మిర్చి పౌడర్ పరిశ్రమ మిర్చి రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరిశ్రమను నిర్వహించడం ఒక్కటే మార్గం అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి రైతులతో మాట్లాడుతూ. పరిశ్రమకు తగినంత పంటను ఉత్పత్తి చేసే విధంగా సంఘం ప్రయత్నిస్తే తాను శాశ్వత పరిశ్రమ ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ఒప్పించే పనిచేస్తానన్నారు. రైతులందరూ గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే తాను పరిశ్రమల మంత్రిగా బాధ్యతలో ఉన్నానని, రైతుల సంక్షేమం పట్ల శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. అనంతరం మిర్చి రైతులు మంత్రి శ్రీధర్ బాబు ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిల్లీ ఫార్మర్స్ వెల్పర్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులు మేసినేని కృష్ణారావు. అధ్యక్షత వహించారు. రైతులకు తగినంత యూరియాను సరఫరా అయ్యేలా చూడాలని అదేవిధంగా సంక్షేమ సంఘ ప్రతి స్థలం ఉండగా భవనానికి నిధులు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తడకల జగదీశ్వర్, తాటికొండ శ్రీనివాస్, మేడవరపు వెంకటేశ్వరరావు, ఎర్రవెల్లి లింగారావు, ఒలిశెట్టి సంజీవ్, కవ్వాల శేఖర్, జాడీ గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌కు విచ్చేసిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి

**కలెక్టరెట్ లో ఉన్న వివిధ శాఖలకు చెందిన విభాగాలను వివరించిన కలెక్టర్**



**జనగామ ప్రతినిధి, జూలై 14(జనంసాక్షి) :** ఇటీవల వెల్లడించిన ఎన్ ఏ ఎస్ ఫలితాల్లో దేశంలోనే ఎంపిక అయిన 50 జిల్లాలో జనగాం కి చోటు దక్కిన నేపథ్యంలో...ఎన్ ఏ ఎస్ పరీక్ష కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ను పిపిటి ద్వారా వివరించిన విద్యాశాఖ. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి విచ్చేసారు. ముందుగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి కి ఘన స్వాగతం పలికారు. అనంతరం... ఇటీవల ఎన్ ఏ ఎస్ ఫలితాల్లో దేశంలో ఎంపిక అయిన 50 జిల్లాలో జనగాం కి చోటు దక్కిన నేపథ్యంలో...ఎన్ ఏ ఎస్ పరీక్ష కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ను, క్షేత్ర స్థాయిలో.. వివిధ పాఠశాల లలో ఎలా అమలు చేసారో.. పిపిటి ద్వారా విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ కి తెలియజేసారు. అనంతరం కలెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కి స్వయం గా కలెక్టరెట్ లోని వివిధ విభాగాల అధికారులను, ఎక్కడెక్కడ ఏ శాఖ కి ఛాంబర్ లు కేటాయించారో తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య పోరాటంలో మైనారిటీల పాత్ర మరువలేనిది

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్




హైదరాబాద్, జూలై 14 (జనంసాక్షి) : దేశ స్వాతంత్ర పోరాటంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మైనార్టీలు నిర్వహించిన పాత్ర మరువలేనివని, వారి త్యాగాలు వెలకట్టలేనివని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. ఆవాస్ రాష్ట్ర మూడవ మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో "భారత స్వాతంత్ర ఉద్యమం మైనారిటీల పాత్ర" అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో సరిహద్దు గాంధీగా పేరుపొందిన అబ్దుల్ గఫార్ ఖాన్, టిప్పు సుల్తాన్ తో పాటు హాబాది బానో బేగం హాజరా బేగం వంటి మహిళలు సైతం నాటి స్వాతంత్ర సమరయోధుల పిలుపునందుకుని తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి తమ ఆస్తులను సమాజానికి దానం చేసి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. మైనారిటీలు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దేశంలోని ప్రజలపై విధించిన అధిక పన్నులు దోపిడీ పీడనకు వ్యతిరేకంగా కులాలు మతాలు ప్రాంతాకు అతీతంగా ప్రజలను సంఘటిత పరిచారని అన్నారు. ఆంగ్లేయులను భరతభూమి నుంచి పూర్తిగా తరిమి కొడితే గాని స్వదేశీయులను వారి దోపిడీ పీడన నుండి విముక్తి కల్పించలేమని భావించి రాజ్య క్షేమం ప్రజల సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ సామ్రాజ్యవాదం పై సమర శంఖం పూరించి చివరి వరకు నిలబడిన పోరాట యోధులని కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను కార్మికులను దోపిడీచేస్తున్న పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా, సహజ వనరుల రక్షణ కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతూ సామ్రాజ వాళ్ళ వ్యతిరేక పోరాటాలలో భాగస్వామ్యం అవుతామని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబు వ్యతిరేకంగా షోయబుల్లాఖాన్ షేక్ బందగి వంటి వీరులు పోరాడి ప్రాణాలను కోల్పోయారు అన్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొనని బిజెపి ఆర్ఎస్ఎస్,చారిత్రక పోరాటాలకు మతం రంగు పులిమితే దేశ ప్రజలు ఒప్పుకోరని వీరికి అసలు మైనార్టీలను గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.సావర్కర్ గోవల్కర్ వంటి నాయకులు బ్రిటీష్ వారి అడుగుజాడల్లో నడిచినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒకానొక దశలో జాతీయ పతాకాన్ని ఒప్పుకొని మీరు మైనారిటీల దేశభక్తి గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు.మహాసభల సందర్బంగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమర యోధుల ఎగ్జిబిషన్ ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ జలీల్ ప్రారంభించి పరిశీలించారు. దేశ స్వాతంత్రం కోసం జరిగిన మహెూన్నత పోరాటంలో కులాలు మతాలు ప్రాంతాలు జాతులకు అతీతంగా ఉద్యమించి త్యాగాలు చేసి సర్వం కోల్పోయిన నాయకులను మత ప్రాతిపదికన వేరు చేయడం సరైనది కాదని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులు యువకులలో దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. ఆవాజ్ మూడవ రాష్ట్ర మహాసభలను జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని మహాసభలలో మైనార్టీ హక్కుల పరిరక్షణ కోసం తీర్మానాలు చేయాలని సూచించారు. అంతకుముందు మహాసభల సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికూర్ రెహమాన్ జెండాను ఎగరవేశారు.

# వరద ముప్పు ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి



మణుగూరు, జూలై 14 (జనం సాక్షి) : గోదావరి వరదలకు ప్రభావిత ప్రాంతాలు ముంపు కు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేల్లూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత సంవత్సరం గోదావరి వరద ఉధృతికి అనేక గ్రామాలు నీట మునిగాయని అలాగే కట్టువాగు పొంగి కొన్ని కాలనీలు నీట మునిగాయని అలాంటి సమస్యలు ఈ ఏడాది పునరావృతం కాకుండా సంబంధిత అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. వరదలకు ఇండ్లన్నీ నీట మునిగితే అక్కడే కొంతమంది ఉంటున్నారు. వాళ్ళందర్నీ పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఏ ఒక్కరికి ప్రాణహాని జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పునరావాస కేంద్రాలలో ఎవరికైనా అనారోగ్య పరిస్థితి ఏర్పడితే వారికి సరైన వైద్యం అందించాలన్నారు. భోజన విషయంలో శుభ్రత పాటిస్తూ ఎంతమంది ఉన్నారో వారికి తగిన విధంగా భోజనాలు ఏర్పాటు చేసి ఎవరికి అసౌకర్యం కలిగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వరదలు వచ్చే సమయంలో ప్రభావిత ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే ముందుగానే సహాయ చర్యలకు సిద్ధం కావాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో ఉన్న వృద్ధులకు, చిన్నారులకు గర్భిణీలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. మట్టి గోడలతో నిర్మించిన ఇండ్లుజ్ తాటి ఆకులతో వేసిన పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో నివాసముంటున్న వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. వర్షాలు రాకముందే మున్సిపాలిటీ గ్రామపంచాయతీ అధికారులు మురికి కాలువలలో చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలి.కాలువలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రాణహాని ఆర్థిక నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. తహసిల్దార్ అద్దంకి నరేష్ , సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎం పి ఓ వెంకటేశ్వర్లు, సిడిపిఓ జయలక్ష్మి, డాక్టర్ నిశాంత్, ఏఈ రాహుల్ రెడ్డి, వెటర్నరీ వైద్యులు సరస్వతి, ఇరిగేషన్ అధికారులు, రెవిన్యూ పంచాయతీ పోలిష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీర్ల కొట్టం పేరుతో అక్రమ కబ్జాలు

- ఆ తర్వాత వేరే వ్యక్తులకు విక్రయిస్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



చండూరు, జూలై 14 (జనంసాక్షి) : చండూరు మండల పరిధిలోని నెర్మట గ్రామంలో కొంత మంది అక్రమార్కులు పీర్ల కొట్టం పేరుతో అక్రమ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆ తర్వాత వీరు సంబంధిత స్థలాలను కొంత మంది ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా అక్రమ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం చండూరు తహసీల్దార్ నిర్మలకు గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే... చండూరు మండల పరిధిలోని నెర్మట గ్రామంలో కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలాలను పీర్ల కొట్టాల పేరుతో అక్రమ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆ తర్వాత వీరు సంబంధిత స్థలాలను కొంత మంది ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠా గతంలో గ్రామంలోని పాత పాఠశాల భవన స్థలం, పాత గ్రామ పంచాయతీ స్థలం తో పాటు ఇటీవల అంగన్వాడీ సెంటర్ ఆట స్థలాన్ని సైతం కబ్జా చేశారు. కాగా వీరి అక్రమ దందాను ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారు. అయితే ఈ ముఠా ఇదిలా వుండగా ఇదే విషయంపై సోమవారం గ్రామస్తులు కొందరు చండూరు తహసీల్దార్ నిర్మలకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ భవిష్యత్తులో తమ గ్రామాభివృద్ధికి అవసరమైన ఖాళీ స్థలాలను పీర్ల కొట్టాల పేరుతో కబ్జాలు చేసి, అనంతరం ఆ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూ, వీరి అక్రమాలను ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్న ముఠా పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నారపాక దశరథ, మాజీ ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు, కొంపెల్లి అనిల్ గౌడ్, కట్ట శివానంద్, దాసరి రవీందర్, రవితేజ, వేణుగోపాల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల చేయాలి

- రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా




నేరేడుచర్ల, జూలై 14 (జనంసాక్షి) : సాగర్ ఎడమ కాలవ ఆయకట్టు రైతా%శీ%గానికి నీటి విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు .సోమవారం నేరేడుచర్ల లో తాసిల్దార్ కార్యాలయం ముందు నీటి విడుదలను డిమాండ్ చేస్తూ రైతు సంఘం మరియు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగరు నీటి మట్టం 550 అడుగులకు పైగా ఉన్నదని గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా జూలై నెలలోనే ఐదువందల యాభై అడుగులు నీరు చేరడం పట్ల ఆయన హర్ష వ్యక్తం చేస్తూ ఆయకట్టు పరిధిలో రైతాంగం వరి నారు మళ్ళు సిద్ధం చేసుకున్నారని అయితే గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో నారుమళ్లు ఎండిపోతున్నాయని వాటి రక్షణ కోసం నీటి విడుదల ఎంతో అవసరంగా భావించి ప్రభుత్వం తక్షణమే నీటి విడుదల చేయాలని కేవలం 1500 క్యూసెక్కులు కాకుండా ఎక్కువ పరిమాణంలో నీళ్లు విడుదల చేయాలన్నారు.చివరి భూములు కూడా నీరు అందాలంటే కనీసం 5000 తీసుకొని విడుదల చేయాలని ఈ సీజన్లో యూరియా కొరత ఉన్నట్లుగా రైతాంగం ఆందోళన చెందుతున్న విషయాన్ని వ్యవసాయ అధికారులు గమనించి యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని బ్లాక్ మార్కెట్కు తరలకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉన్నదని అధిక రేట్లకు యూరియా విక్రయిస్తున్న డీలర్లపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తి శ్రీనివాసరెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్ల బోయిన సింహాద్రి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల మేకల వెంకన్న పంగా నరసింహారావు మాలోతు మంగత జక్కుల అంజయ్య మాతంగి రామకృష్ణ పులిగిల్ల మునెయ్య పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల పేరు మీద రెండు మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి



నారాయణఖేడ్, జూలై 14 (జనం సాక్షి) : ప్రతి ఒక్కరు రెండు మొక్కలు చొప్పున నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని, తల్లిదండ్రుల పేరు మీద రెండు మొక్కలు నాటాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటాపూర్ గ్రామ సమీపం వన మహెూత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలన్నారు. ప్రధానంగా తల్లులు మొక్కలు నాటితే తమ పిల్లలు చూసుకున్నట్లే జాగ్రత్త చూసుకుంటారని తెలిపారు. పిల్లలకు కూడా తమ తల్లుల పేరు మీద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి తల్లి ఇంట్లో రెండు మొక్కలు నాటాలనారు. నేటి మొక్కలు రేపటి చెట్లుగా భావించే తరుణంలో చెట్లు ఉంటేనే జీవనాధారానికి ఎంతో ముఖ్యమన్నారు. చెట్లున్న ప్రదేశాలను వర్షాలు పడే ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరు చెట్టు నాటి తన బాధ్యత తీసుకోవాలని అన్నారు. అటవీశాఖ కార్యాలయంలో ఒక్క లక్ష 60 వేల మొక్కలు ఉన్నాయని తెలిపారు. గతము కంటే ఈ సంవత్సరము తల్లిదండ్రి పేరు మీద రెండు మొక్కలు నాటాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల పేరు మీద మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప షెట్కర్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్ సెట్, డి ఎఫ్ ఓ శ్రీధర్ ,నారాయణఖేడ్ రేంజ్ ఆఫీసర్ అనురాధ, సెక్షన్ ఆఫీసర్లు, దన్ సింగ్, రాములు, బీట్ ఆఫీసర్లు వరప్రసాద్, కృష్ణ గౌడ్,అమర్య నాయక్, జాదవరాజు, ఫారెస్ట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

# విద్యుద్ఘాతంతో మహిళ మృతి

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?
- ఖమ్మం రూరల్ కాస్నాతండాలో ఘటన



ఖమ్మం రూరల్, జూలై 14 (జనం సాక్షి) : ఖమ్మం రూరల్ మండలం కాస్నాతండాలో మారుతి ముత్తమ్మ(45) అనే వివాహిత ఇవాళ ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. స్థానికుల కథనంప్రకారం.. కాస్నా తండాకు చెందిన మారుతీ ముత్తమ్మ, సైదయ్య భార్యభర్తలు. ముత్తమ్మ ఇవాళ ఇంట్లో బట్టలు ఉతికి ఇంటిపైన ఆరబెడు తుండగా 11కేవీ విద్యుత్ లైన్ తీగలకు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ముత్తమ్మ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు కన్నీరు తెప్పించాయి. కాగా, 11 కేవీ లైన్ మార్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిధులు మంజూరు చేసి ఆదేశించినా కాంట్రాక్టర్ మార్చకపోవడంతోనే నిండుప్రాణం బలైందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసు కొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా**

విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందగా, కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు అఖిలపక్షం నాయకులు మృతదేహంతో వి ద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపిస్తూ పల్లెగూడెం సబస్టేషన్ ముందు బంధువులు, వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. ఏఈ, డీఈలపై చర్యలు తీసుకోవాలని, రూ. కోటి పరిహారం ఇవ్వాల ని డిమాండ్ చేశారు. సబ్ స్టేషన్లోకి చొరబడి తలు పులను ధ్వంసం చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రి క్తత నెలకొనగా పోలీసులు అదుపు చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్

- డిఎస్పీ ప్రసన్నకుమార్



అల్లాదుర్గం, జూలై 14 (జనంసాక్షి) : శాంతిభద్రతల పరిరక్షణకొరకే కార్డెన్స్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ తెలిపారు. మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో సోమవారం వేకువ జామున 5 గంటల నుండి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని ఆధార్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తున్న, నివసిస్తున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల కర్తవ్యం అని ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం పాటుపడతారని పేర్కొన్నారు. అనంతరం సీఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ, సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల, డ్రగ్స్ గంజాయి నిర్మూలన ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మంచి కోసమే ఫోన్లను ఉపయోగించాలని అనవసర యాప్లను డౌన్లోడ్ చేయరాదని సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సరైన పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు 4 ఆటోలు రెండు బులోరా వాహనాలు స్వాధీనం చేసుకున్నారు, సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్, వివిధ మండలాల పదిమంది ఎస్సైలు, 110 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాంగణ నియామకాల్లో 41మంది యస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక



ఖమ్మం, జూలై 14 (జనంసాక్షి) : భారతదేశం ప్రపంచ దేశాలకు మేధావులను అందించే కర్మాగారం అని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ప్రముఖ సంస్థ టెక్ స్కై సోమవారం తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో తమ విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరచి 41మంది ఐ.టి. రిక్రూటర్స్, బెంచ్ సేల్స్ రిక్రూటర్స్ గా ఎంపికవ్వడం తమకు గర్వకారణమని కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అమెరికా వంటి దేశాలకు నిపుణులను ఎగుమతి చేయటంలో తమవంతుగా కృషిచేస్తున్న టెక్ స్కై సంస్థలో తమ విద్యార్థులు వారధిగా నిలవటం తమపై మరింత బాధ్యతను పెంచిందని అభిప్రాయపడ్డారు. వివిధ దశలలో నిర్వహించిన ఎంపికల పరీక్షల్లో మొదట కమ్యూనికేషన్ టెస్ట్లో 64 మంది ఎంపిక అవ్వగా, చివరి హెచ్ఆర్ రౌండ్లో 41 మంది అర్హత సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 3 నెలల పాటు శిక్షణలో భాగంగా 2.20 లక్షల రూపాయలు అందుకుంటారని, తదనంతరం 3లక్షల పైచిలుకు వార్షిక ఆదాయం పొందుతారని వారు తెలిపారు. ఎంపికైన వారిలో ఎంబిఏకు చెందిన 9మంది విద్యార్థులు కాగా మిగిలిన 32 మంది వివిధ విభాగాలకు చెందిన బిటెక్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఖమ్మం ఐటి. హబ్లో గత కొన్ని సంవత్సరాలుగా నడపబడుతున్న టెక్ స్కై సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఎంపిక అవ్వడం, హైదరాబాద్ కు పోటీగా ఎదుగుతున్న ఖమ్మంలో తమ కళాశాల విద్యార్థులు తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు. అమెరికా కేంద్రంగా కలిగి హైదరాబాద్, ఖమ్మం, రాష్ట్రంలో శాఖలు కలిగి ఐటి, నాన్ ఐటీ సేవలు అందిస్తున్న టెక్ స్కై తమ కళాశాలను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులు యమ్.యన్.సి. సంస్థలకు దీటుగా సేవలను అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టెక్ స్కై సీనియర్ హెచ్.ఆర్. యస్.రవితేజ, హెచ్ఆర్. యన్. దుర్గా ప్రసాద్, ఇమిగ్రేషన్ స్పెషలిస్ట్ టి.నరేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎవివి శివప్రసాద్, డాక్టర్ జె. రవీంద్రబాబు, టిపిఒ యన్.సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ ఫుడ్ పాయిజన్..

- విద్యార్థినులకు అస్వస్థత
- నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించిన కలెక్టర్
- బాధ్యులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాలు
- నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం




దేవరకొండ, జూలై 14 (జనం సాక్షి) : దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఫుట్ పాయిజన్‌తో విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న దాదాపు 35 మందికి పైగా విద్యార్థినిలు ఫుడ్ పాయిజన్ తో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి కొందరిని దేవరకొండ ఏరియా ఆసుపత్రికి మరికొందరు విద్యార్థినులను పడమటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 310 మందికిపైగా విద్యార్థినిలు ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం చికెన్, బగారాతో తిన్న విద్యార్థులు కొంతమంది విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు అయ్యాయని, సోమవారం ఉదయం పులిహోర తిన్న తర్వాత పాఠశాలలోని దాదాపు 35 మంది విద్యార్థినిలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు కావడంతో.. తీవ్ర అస్వస్తతకు వారు గురయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి, సీఐ నరసింహులు ఆసుపత్రిని, ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఫుడ్ పాయిజన్ కావడం వల్లే ఇలా జరిగి ఉంటుందని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని వార్డెన్ కు ఆర్డిఓ సూచించారు. ఫుడ్ పాయిజన్ కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ జరిపి వారు తప్పు చేసినట్లు తేలితే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, విచారణ జరిపి తనకు నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.




# మరో 2400 మంది ఉద్యోగాలు కట్!

**జనంసాక్షి:**గత వారమే ఒరెగాన్‌లో 500 మందికి పైగా ఉద్యోగులను తొలగించిన చిప్ మేకర్ ఇంటెల్ మళ్లీ భారీగా ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోంది. ది ఒరెగాన్ తెలిపిన వివరాల ప్రకారం..ఇంటెల్ ఒరెగాన్ స్టేట్‌లో దాదాపు 2,400 ఉద్యోగాలను తొలగించాలని యోచిస్తోంది. దీంతో ఈ నెలలో మొత్తం తొలగింపుల సంఖ్య 2,892కు చేరుకుంటుంది. యునైటెడ్ స్టేట్స్ అంతటా రాబోయే రోజుల్లో దాదాపు 4,000 మంది ఇంటెల్ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోతారని భావిస్తున్నారు. కొత్త సీఈఓ లిప్-బు టాన్ నేతృత్వంలో కంపెనీ వ్యయ తగ్గింపు చర్యల్లో భాగంగా ఈ తొలగింపులు జరుగుతున్నాయి.ఇంటెల్ కార్యకలాపాలను సరళతరం చేయాలని, వ్యయాన్ని తగ్గించాలని యోచిస్తోంది. ఒకప్పుడు సెమీకండక్టర్ పరిశ్రమలో ఆధిపత్యం చెలాయించి ఇటీవల ప్రత్యర్థుల కంటే వెనుకబడి పోవడంతో సీఈఓపై ఒత్తిడి ఎక్కువైందని కొందరు అభిప్రాయపడుతున్నారు. దాంతో లేఆఫ్స్‌పై దృష్టి సారిస్తున్నారని చెబుతున్నారు. ఒరెగాన్ రాష్ట్రంలో ఇంటెల్ కార్యాలయంలో సుమారు 20,000 మంది కార్మికులు పని చేస్తున్నారు. తాజా తొలగింపులు స్థానిక ఉద్యోగుల్లో 12 శాతం మందిపై ప్రభావం చూపనున్నాయి.ప్రభావిత ఉద్యోగుల్లో చిప్ ప్రొడక్ట్ డిజైనర్లు, క్లౌడ్ సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఫిజికల్ డిజైన్ ఇంజినీర్లు ఉన్నారు. కొందరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను కూడా ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఉద్యోగాల కోతతో చిప్ తయారీలో కీలకంగా వ్యవహరించే ఇంటెల్ అంతర్గత ఫౌండ్రీ విభాగం తీవ్రంగా దెబ్బతింటుందని భావిస్తున్నారు. ఇటీవల ఇంటెల్ కాలిఫోర్నియా, అరిజోనా, టెక్సాస్‌లోని ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులు జారీ చేసింది. సాఫ్ట్‌వేర్ నిర్వచించిన ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించిన కంపెనీ ఇటీవల జర్మనీలోని మ్యూనిచ్‌లోని తన ఆటోమోటివ్ చిప్ యూనిట్‌ను మూసివేసింది. ఆ డివిజన్‌లో చాలా మంది ఉద్యోగులను కూడా తొలగించే అవకాశం ఉంది. ఉద్యోగ కోతలకు ముందస్తు పదవీ విరమణ ప్యాకేజీలు(ఎల్ఆర్ఎస్) అందించడం లేదు. దీనికి బదులుగా ఇంటెల్ తొమ్మిది వారాల వేతనం, ఇతర ప్రయోజనాలతో పాటు 60 రోజులు లేదా నాలుగు వారాల నోటీసును అందిస్తోంది.




# నాలుగోరోజూ నష్టాల్లోనే

## ఐటీ షేర్లలో అమ్మకాలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ట్రేడ్ వార్ భయాలు సూచీలను పడేశాయి. యూరోపియన్ యూనియన్, మెక్సికోపై ఆగస్టు 1 నుంచి 30 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించడం ఇందుకు నేపథ్యం. దీనికి తోడు త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడం మరో కారణం. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఈ క్రమంలోనే నిఫ్టీ 25,100 దిగువకు చేరింది. స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు రాణించడం విశేషం. సెన్సెక్స్



ఉదయం 82,537.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,500.47) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.38 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.55 పాయింట్ల నష్టంతో 25,082.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటర్నల్, టైటాన్, సన్‌ఫార్మా, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,385 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# మెర్సిడెస్ బెంజ్ ధరల పెంపు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా వాహన ధరలను పెంచనుంది. సెప్టెంబర్ నుంచి వివిధ మోడల్ కార్ల ధరలను 1-1.5 శాతం స్థాయిలో పెంచేందుకు చూస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ వెల్లడించారు.ప్రధానంగా యూరోతో మారకంలో రూపాయి బలహీనపడటంతో ధరల పెంపు యోచనకు తెరతీసినట్లు పేర్కొన్నారు.అయితే ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు వాహన ధరలను పెంచడం గమనార్హం! 2025 జనవరి, జులైలో కార్ల ధరలను హెచ్చించింది. కాగా.. యూరో ప్రభావాన్ని తట్టుకునే బాటలో మరోసారి సెప్టెంబర్ నుంచి ధరల పెంపు చేపట్టనున్నట్లు అయ్యర్ తెలియజేశారు. గత నెల రోజులుగా యూరోతో మారకంలో రూపాయి 100 మార్క్ వద్దే కదులుతున్నట్లు తెలియజేశారు. ఫలితంగా సెప్టెంబర్‌లో 1 నుంచి 1.5 శాతంవరకూ ధరల పెంపును చేపట్టనున్నట్లు తెలియజేశారు. ధరల పెంపు వల్ల ప్రభావం పడబోదని, మరోపక్క వడ్డీ రేట్లు దిగివస్తుండటంతో కొనుగోలుదారులకు ఈఎంఐ చెల్లింపులు బ్యాలన్స్ అవుతాయన్నారు.



# ఎవరు చెప్పినా వినండి.. కానీ..

డబ్బు ఖర్చులు, పెట్టుబడులపై ఒక్కొక్కరి నిర్ణయాలు ఒక్కోలా ఉంటాయి. మనకు బాగా తెలిసినవారు డబ్బుకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో దాదాపు వాటినే మనలో చాలా మంది అనుసరిస్తుంటారు.కానీ ఒక్కొక్కరి భవిష్యత్తు అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. అందుకు అనుగుణంగా ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాలుండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈఓ రాధికా గుప్తా ఇందుకు సంబంధించిన కొన్ని అంశాలను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.'డబ్బు విషయానికి వస్తే




ప్రతి ఒక్కరికీ ఒక అభిప్రాయం ఉంటుంది. మీ అంకుల్ స్మాల్ క్యాప్ షేర్లపై పెట్టుబడి పెట్టొచ్చు. క్రిప్టోనే భవిష్యత్తు అని మీ స్నేహితుడు ఎంచుకోవచ్చు. మీ పక్కింటివారు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మాత్రమే తమ పెట్టుబడిని కొనసాగించవచ్చు. అయినంత మాత్రాన వారి నిర్ణయాలను కాపీ కొట్టాలా? కాదు కదా.. మీ పోర్ట్‌ఫోలియో మీ పరిస్థితులకు అనుగుణంగా, అవసరాలను తీర్చేలా ఉండాలి. పొరుగువారిని అనుసరించి పెట్టుబడులు పెట్టకూడదు. మీ సొంత ప్రణాళికలు రూపొందించుకోండి. చాలా ఉచిత సలహాలు మిమ్మల్ని గందరగోళానికి గురిచేస్తాయి. మీ అవసరాలకు సరిపోని వాటిని ఎంచుకోకూడదు. మీ ఆత్మీయులు చెప్పింది వినండి. కానీ మీకు నిజంగా ఏది అవసరమో అదే చేయండి' అని రాసుకొచ్చారు.ప్రతి ఒక్కరికీ వారి సొంత పెట్టుబడి మార్గం ఉండాలి. కానీ చాలా మంది పక్కవారి అవసరాలను పరిగణించుకోకుండా గుడ్డిగా వారి నిర్ణయాలను అనుసరిస్తారు. మెరుగైన ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను నిర్మించడం చాలాముఖ్యం. పిల్లల చదువు కోసం మీరు పొదుపు చేయవచ్చు.. హాలిడే కోసం ప్లాన్ చేయవచ్చు.. లేదా ఎమర్జెన్సీ నిధిని ఏర్పాటు చేయవచ్చు. అందుకు వేరొకరిని అనుసరించకూడదని నిపుణులు చెబుతున్నారు.

# ఈసారి రిఫండ్ త్వరగా రాకపోవచ్చు..

ఈసారి రిటర్నులు ఫైల్ చేస్తున్నారు. ఇంచుమించు కోటి దాకా రిటర్నులు వేసినట్లు అంచనా. అందులో చాలా మంది వెరిఫై కూడా చేశారు. గతంలో రిటర్ను వేసిన ఒకటి, రెండు రోజుల్లో రిఫండ్ వచ్చేసిన కేసులున్నాయి. సాధారణంగా 20 నుంచి 45 రోజుల్లోపల మీ బ్యాంకు ఖాతాకి రిఫండ్ మొత్తం జమ అవుతుంది. కానీ కొన్ని సందర్భాల్లో జాప్యం జరగొచ్చు.ఏ కారణం వల్ల రిఫండ్ త్వరగా రాదంటే.. చాలా మంది వెరిఫై చేయడం లేదు. ఇలా వెరిఫై చేయనంతవరకు రిటర్నులను ముట్టుకోరు. ప్రాసెస్ చెయ్యరు. అందుకని రిటర్నులను వేసిన వెంటనే వెరిఫై చేయడం మరిచిపోవద్దు.బ్యాంకు అకౌంట్ వివరాలు పూర్తిగా ఇవ్వకపోతే రిఫండు రాదు. బ్యాంకుల విలీనం వల్లో, అడ్రెస్సులు పోవడం వల్లో, కోడ్‌లలో వచ్చిన మార్పులను తెలియచేయకపోవడం వల్లో కూడా ఇలా జరగొచ్చు. బ్యాంకు అకౌంటు నంబరు ఇప్పుడు పొడుగ్గా ఉంటోంది. ఏ ఒక్క అంకె తప్పొచ్చినా, సమాచారం లోపం వల్ల జమ ఆగిపోతుంది.పెద్ద సమస్య ఎక్కడ వస్తుందంటే .. మిస్‌మ్యాచింగ్. రిటర్నుల్లో దాఖలు చేసిన అంశాలు, అన్నీ పూర్తిగా 26 ఏఎస్, ఏ19తో సరిపోయి



ఉండాలి. 26ఏఎస్, ఏఐఎస్, ఈ రెండూ ఆదాయపు పన్ను వెబ్‌సైట్లో దొరుకుతాయి. ఇవి చాలా స్పష్టంగా మీకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా క్రోడీకరించి చూపిస్తాయి. సర్వసాధారణంగా తప్పులు ఉండవు. చాలా మంది ఏం చేస్తుంటారంటే, వీటిలో సమాచారం బేస్‌గా రిటర్నులు వేసేస్తుంటారు. అ ప్పుడు మిస్‌మ్యాచ్ ఉండదు. ఇదొక సేఫ్ గేమ్. అలా అని మీరు 26ఏఎస్, ఏఐఎస్ అంశాలతో పూర్తిగా ఏకీభవించాలని లేదు. అందులోని అంశాలు తప్పని అనిపించినా, రెండు సార్లు కనిపించినా, మీవి కాకపోయినా, మీరు విభేదించవచ్చు. అప్పుడు, మిస్‌మ్యాచ్ తథ్యం. ఇలాంటప్పుడు రిఫండు ఆలస్యం అవుతుంది.కొంత మంది ఫారం ఎంచుకోవడంలో పొరపా టు చేస్తారు. అలాంటి పొరపాటు జరిగినా, రి ఫండు ఆలస్యం కావచ్చు. జాగ్రత్త వహించాలి.సాంకేతికపరమైన సమస్యలు ఉత్పన్నమవ్వొచ్చు. ఇవి తాత్కాలికం కావొచ్చు. తాత్కాలికం అయితే, గంటలోనో లేదా రోజులోపలో దానంతట అదే సాల్వ్ అయిపోతుంది.. సిస్టమ్ అధికార్లకు కూడా వెనువెంటనే తెలియదు. ఈ మేరకు ప్రాసెసింగ్ లేటు అవుతుంది.పన్నులు చెల్లింపుల మూడు రకాలు. టీడీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్, సెల్ఫ్ అసెస్‌మెంట్. ఈ చలాన్లలోని అంశాలు రాసేటప్పుడు ఏ పొరపాటు జరిగినా .. చెల్లింపులకు సంబంధించిన పద్దు, గవర్నమెంటు ఖాతాలో మీ పేరున జమ అవ్వదు. సస్పెన్స్‌లో పెడతారు.




# ఇద్దరికీ చెడిందా?

## ట్రంప్-పుతిన్ ముగిసిన బ్రొమాన్స్

డొనాల్డ్ ట్రంప్.. రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తన ఆధిపత్యాన్ని ప్రతీ చోట చూపించాలనే అనుకుంటున్నారు. ప్రపంచ దేశాల ముందు తాము అగ్రరాజ్యాధినేతలమనే 'కటింగ్' కాస్త ఎక్కువగానే ఉంది. తమది అగ్రరాజ్యం.. తాను అగ్రజున్ని అనే ఫీలింగ్ ఆయనలో ఎక్కువగా ఉంది.తాను ఏది చెబితే అది శాసనం అన్న చందంగా తయారైంది ట్రంప్ పరిస్థితి. ఈ క్రమంలోనే తనకు ఆప్తులు, అత్యంత సన్నిహితులు అనే వారిని కూడా వదులుకుంటున్నారు. ఇటీవల తనకు అత్యంత సన్నిహితంగా ఉండే ఎలాన్ మస్క్‌తో వైరం తెచ్చుకున్నారు. 'బిగ్ బ్యూటీఫుల్' బిల్ విషయంలో మస్క్ నో చెప్పారని ట్రంప్ విరుచుకుపడ్డారు. మస్క్‌ను బహిరంగంగానే చెడామడా తిట్టిపోశారు. మస్క్ దక్షిణాఫ్రికా( మస్క్ జన్మస్థలం) వెళ్లిపోవాలనుకుంటున్నారా? అనే వార్నింగ్ కూడా ఇచ్చేశారు. దానిలో భాగంగానే మస్క్ నుంచి 'కొత్త పార్టీ' అంటూ ఓ ప్రకటన కూడా వెలువడింది. ఫలితంగా మస్క్‌తో ట్రంప్ సంబంధాలు దాదాపు తెగిపోయాయనే చెప్పొచ్చు.ఆ తర్వాత పుతిన్‌తో కూడా ట్రంప్‌కు మంచి సాన్నిహిత్యమే ఉంది. దీనిలో భాగంగానే ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధాన్ని క్షణాల్లో ఆపేస్తానని ప్రకటించేశారు ట్రంప్. తాను ఆఫీస్‌లో కూర్చొనే 24 గంటల్లో ఇరుదేశాల యుద్ధాన్ని ముగిస్తానని చెప్పిన ట్రంప్.. ఆపై ఉక్రెయిన్ అధ్యక్షుడి జెలెన్ స్కీతో చర్చలు కూడా జరిపారు.స్వయంగా జెలెన్ స్కీని వైట్‌హౌస్‌కు పిలిపించి మరీ చర్చించారు ట్రంప్. ఇక్కడ ట్రంప్ వ్యవహారాలి శైలిపై వైట్‌హౌస్ వేదికగానే మీడియా ముందే జెలెన్ స్కీ రెచ్చిపోయి మాట్లాడారు. ఇక్కడే ట్రంప్ పరువు సగం పోయింది. 'యుద్ధం ఆపాలనుకుంటే రష్యాకు ముందు చెప్పండి.. వార్ ప్రారంభించిది పుతిన్'



అంటూ జెలెన్ స్కీ ఘాటుగా స్పందించారు. ఇలా అమెరికా అధ్యక్షుడి ముందు మరొక దేశాధినేత ఇంత ఘాటుగా మాట్లాడటంతో జెలెన్ స్కీ హీరో అయిపోయాడు. ఇక్కడ ట్రంప్ పాత్రకు అసలు అర్థం లేకుండా పోయింది.

**పుతిన్‌తో కటీఫ్..?**

ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాన్ని పుతిన్ సీరియస్‌గా పట్టించుకోవడం లేదు. ట్రంప్ ఫోన్ చేసి చెప్పినప్పుడు ఓకే అంటున్న పుతిన్.. అపై గంటల వ్యవధిలోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నాడు. ట్రంప్ మధ్యవర్తిత్వం తర్వాత ఉక్రెయిన్-రష్యాల యుద్ధం మరింత ఉగ్రరూపం దాల్చిందనే చెప్పాలి. దాంతో పుతిన్‌తో ట్రంప్ బ్రొమాన్స్ ముగిసిపోయినట్లే కనబడుతోంది.వందల కొద్దీ డ్రోన్స్, మిసెల్స్‌తో ఉక్రెయిన్‌పై దాడికి దిగుతున్నారు పుతిన్. దాంతో ట్రంప్‌లో అసహనం ఎక్కువైపోతోంది. 'పుతిన్ అంతే.. మారడు.. చంపుతూనే ఉంటాడు' అనే వ్యాఖ్య కూడా చేశారు ట్రంప్. ఈ క్రమంలోనే పుతిన్‌పై నోరు పారేసుకున్నారు. వాషింగ్టన్ మీడియా వేదికగా పుతిన్‌పై రెచ్చిపోయి మాట్లాడారు. పుతిన్ మంచి వ్యక్తి అనుకున్నా.. కానీ ఇప్పుడు అర్థం పర్థం లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ ట్రంప్ ధ్వజమెత్తారు.

**ఉక్రెయిన్‌కు 'యుద్ధ సాయం' హామీ**

రష్యాతో సాగిస్తున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు అండగా ఉంటామని కొన్ని రోజుల క్రితం ట్రంప్ పేర్కొన్నారు. తమ రక్షణ వ్యవస్థలోని ప్రధాన వనరులను అవసరమైతే కీవ్‌కు పంపిస్తామనే హామీ కూడా ఇచ్చారు. ఇదంతా పుతిన్‌పై తీవ్ర కోపం లోలోన రగిలిపోతున్న ట్రంప్ చెప్పిన మాటలు. అంటే పరోక్షంగా రష్యాపై తాము యుద్ధానికి దిగుతామనే హెచ్చరికలు జారీ చేశారు ట్రంప్. ఇది పుతిన్‌తో ట్రంప్‌కు చెడిపోయిందనడానికి మరింత బలం చేకూర్చింది.

**ట్రంప్ యూ టర్న్..**

ఉక్రెయిన్‌కు యుద్ధం విషయంలో అండగా ఉంటామని ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు. ఉక్రెయిన్‌కు నూతన ఆయుధాలు సమకూర్చేందుకు అమెరికా 'జీరో డాలర్లు' ఖర్చు చేస్తుందని, అందుకు అయ్యే ఆర్థిక భారాన్ని యూరోపియన్ యూనియన్(ఈయూ) మోయాల్సి ఉంటుందన్నారు. ఉక్రెయిన్‌కు రాబోయే కాలంలో పంపించే ఆయుధాల బిల్లును అమెరికా భరించబోదని, ఆ ఆర్థిక బాధ్యత ఇప్పుడు యూరోపియన్ యూనియన్‌పైనే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇది ఉక్రెయిన్‌కు పిడుగులాంటి భారం. రష్యాతో యుద్ధంలో అమెరికాపైనే ఎక్కువ ఆధారపడుతున్న ఉక్రెయిన్.. ట్రంప్ యూ టర్న్‌తో ఒక్కసారిగా కంగుతింది. ఇక్కడ ఆయుధాల్ని అమ్ముకోవడమే తమ పని అనే విషయం ట్రంప్ వైఖరితో మరోసారి వెల్లడైంది. ఇక్కడ ఉక్రెయిన్‌కు యుద్ధం విషయంలో ట్రంప్ యూ టర్న్ తీసుకోకుండా ఆర్థిక భారాన్ని యూరోపియన్ యూనియన్ దేశాలపైకి నెట్టారు. అంటే యూరోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్ యుద్ధానికి అవసరమయ్యే ఆర్థిక భారాన్ని మోస్తే తాను ఆయుధాల్ని అమ్మడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రంప్ వైఖరిపై ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటనా చేయని పుతిన్.. ఏం జరుగుతుందో చూద్దాం అనే ధోరణితోనే ఉన్నారు.



# వామ్మో మళ్లీ రూ. లక్ష!

## మళ్లీ రికార్డ్ రేటుకు బంగారం

*దేశంలో బంగారం ధరల పెరుగుదల కొనసాగుతోంది. ఈరోజైనా పుత్తడి ధరలు కిందకి చూస్తాయా అని ఆశించినా కొనుగోలుదారులకు నిరాశే ఎదురైంది. తులం (10 గ్రాములు) మేలిమి బంగారం ధర ఏకంగా రూ.లక్ష మార్కును దాటింది.ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.*

# చిక్కుల్లో షేక్ హసీనా కూతురు!



**జనంసాక్షి** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కూతురు డాక్టర్ సైమా వాజెద్ చిక్కుల్లో పడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌత్-ఈస్ట్ ఏషియా ప్రాంతానిక ఆమె రీజియనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న సంగతి తెతలిసిందే. అయితే సొంత దేశంలో అవినీతి ఆరోపణలు వెల్లవెత్తడంతో.. డబ్ల్యూహెచ్‌వో ఆమెను నిరవధిక సెలవులపై పంపింది.ఇప్పటికే భారత్‌లో ఆశ్రయం పొందిన షేక్ హసీనాపై బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పలు అభియోగాలను నమోదు చేసింది. అయితే తాజాగా ఆమె తనయ సైమా వాజెద్‌పైనా అవినీతి కేసులు నమోదు చేసింది. దీంతో ఆమెను సెలవులపై పంపించిన డబ్ల్యూహెచ్‌వో.. సైమా స్థానంలో డాక్టర్ కాథరినా బూమీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతారని వెల్లడించింది. అయితే ఆమె సెలవుల వ్యవహారంపై ప్రశ్న ఎదురుకాగా.. అదనంగా స్పందించేందుకు డబ్ల్యూహెచ్‌వో నిరాకరించిం ది.డబ్ల్యూహెచ్‌వో నిర్ణయంపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిసిన ఓ అధికారి.. ఆమెను శాశ్వతంగా తప్పించాలని ఐక్యరాజ్య సమితి విభాగానికి విజ్ఞప్తి చేశారు.ఇదిలా ఉంటే.. డబ్ల్యూహెచ్‌వో రీజీయనల్ ఆఫీస్ న్యూఢిల్లీలోనే ఉంది. కాథరినా జులై 15వ బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. సైమా వాజెద్‌పై అధికార దుర్వినియోగం, ఫోర్జరీ, ఫ్రాడ్ కేసులను బంగ్లాదేశ్ యాంటీ కరప్షన్ కమిషన్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.1972 డిసెంబర్ 9న డా. ఎం.ఎ. వాజేద్ మియా (న్యూక్లియర్ సైంటిస్ట్), షేక్ హసీనా దంపతులకు సైమా వాజెద్ జన్మించారు. ఫ్లోరిడా(అమెరికా) బ్యారీ యూనివర్సిటీలో ఆమె సైకాలజీలో డిగ్రీ, పీజీ చేశారు. ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్‌లో డాక్టరల్ చేశారు. స్కూల్ సైకాలజీలో స్పెషలిస్ట్ అయిన ఆమె.. ఆటిజం, మానసిక ఆరోగ్యంపై ఆమె చేసిన ప్రచారాలు అంతర్జాతీయ స్థాయిలో మార్పులకు దారితీశాయి. డబ్ల్యూహెచ్‌వో ఆమె నేతృత్వంలో మూడు తీర్మానాలకు ఆమోదం తెలిపింది. ఆమె భర్త ఖండకర్ మస్రూర్ హుస్సేన్ మితు. ఈయనది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. ఈ జంటకు నలుగురు పిల్లలు. అయితే వీళ్లు విడిపోయారంటూ ఆ మధ్య ప్రచారం జరిగినా.. అధికారికంగా ఇద్దరిలో ఎవరూ ఖండించకపోవడం గమనార్హం.

# భూమిపై విమానంలా..

## చైనా సరికొత్త బుల్లెట్ రైలు..

### విమానంతో పోటీపడే రీతిలో గంటకు 600 కిలోమీటర్ల వేగం

చైనా విజయవంతంగా మాగ్నెటిక్ లెవిటేషన్ (మాగ్లెవ్) టెక్నాలజీతో సరికొత్త హైస్పీడ్ రైలును ఆవిష్కరించింది. విమానంతో పోటీ పడే రైలును ప్రపంచానికి పరిచయం చేసింది. 17వ మోడ్రన్ రైల్వే ఎగ్జిబిషన్‌లో మాగ్లెవ్ రైలును చైనా ప్రదర్శించింది. ఇది కేవలం 7 సెకన్లలోనే 600 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని అధికారులు తెలిపారు. ఇక, ఇది అందుబాటులోకి వస్తే.. బీజింగ్ నుంచి షాంఘై మధ్య ఉన్న 1200 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 150 నిమిషాల్లో చేరుకుంటుందని అంచనా. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 5.30 గంటల సమయం పడుతోంది.కాగా, డోంఘు లాబొరేటరీలోని ఇంజనీర్లు 2025 చివరి నాటికి తమ హై-స్పీడ్ ట్రాక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు. దీనికి ఏఐ గైడెడ్ సస్పెన్షన్ వ్యవస్థలు.. ఖచ్చితమైన విద్యుదయస్కాంత నియంత్రణకు తోడ్పడనున్నట్టు అధికారులు తెలిపారు. హైస్పీడ్ సమయంలో ఇవి ప్రయాణికులకు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతం చేస్తాయన్నారు.ఇదిలా ఉండగా.. మ్యాగ్నెటిక్ లెవిటేషన్ (మాగ్లెవ్) టెక్నాలజీతో ఈ రైలు అధిక వేగంతో దూసుకెళ్లగలదు. ఈ టెక్నాలజీ అయస్కాంత వ్యతిరేక క్షేత్రాలను ఉపయోగించుకొని.. ట్రాక్ నుంచి రైలును పైకి లేపడానికి సాయపడుతుంది. అప్పుడు ఫ్రిక్షన్ తగ్గి రైలు నిశ్శబ్దంగా, వేగంగా వెళ్లగలుతుందని బీజింగ్ అధికారులు వెల్లడించారు. ఈ రైలు బరువు 1.1 టన్నులుగా ఉండనుంది. ఇక, ఇది వినియోగంలోకి వస్తే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా చరిత్ర సృష్టించనుంది. ఈ ఏడాది జూన్‌లో చైనా ఇంజినీర్లు దీన్ని పరీక్షించారు. తాజాగా ప్రదర్శించారు.

# నా మార్ఫింగ్ ఫొటోల్ని సృష్టించింది మా పార్టీవాళ్లే!

మమతా బెనర్జీ అధినాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో ఇవాళ తీవ్ర కలకలం రేగింది. స్టూడెంట్ వింగ్ లీడర్ రాజన్యా హల్దార్ సంచలన ఆరోపణలకు దిగిన సంగతి తెలిసిందే.తన మార్ఫింగ్ ఫొటోల వ్యవహారం వెనుక టీంఎంసీవాళ్లే ఉన్నారని రాజన్య ఆరోపించగా.. టీఎంసీ ఆ ఆరోపణలకు స్పందించింది.టీఎంసీ స్టూడెంట్ వింగ్ లీడం అయిన రాజన్య హల్దార్.. గతంలో జాదవ్‌పూర్ వర్సిటీకి ప్రెసిడెంట్‌గా పని చేశారు. కిందటి ఏడాది ఓ షార్ట్ ఫిల్మ్ కారణంగా తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. దీంతో టీఎంసీ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. తాజాగా కోల్‌కతా లా కాలేజీ అత్యాచార ఉదంతంపైనా ఆమె ఓ టీవీ షోలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఘటనను ఖండించిన ఆమె.. విద్యార్థి నాయకుల్లోని దురుద్దేశాలను, నేరస్వభావాన్ని ఈ కేసు బయటపెట్టిందంటూ ప్రధాన నిందితుడు, టీఎంసీ స్టూడెంట్ మాజీ లీడర్ మోనోజిత్ మిశ్రాను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారామె. ఆ స్టేట్‌మెంట్ ఇచ్చిన రోజు నుంచే ఆమె పేరిట అశ్లీల చిత్రాలు నెట్టింట చక్కర్లు కొట్టడం మొదలైంది. దీంతో కోల్‌కతా సైబర్ పోలీసులను ఆశ్రయించారామె.తన డీప్‌ఫేక్ న్యూడ్ ఫొటోలను వైరల్ చేస్తోంది టీఎంసీ వాళ్లేనని ఆరోపి స్తున్నారామె. "ఉద్దేశపూర్వకంగానే పార్టీలో ఉన్న జూనియర్ లీడర్లు కొందరు ఏఐ సాయంతో నా డీప్ ఫేక్ ఫొటోలను వైరల్ చేస్తున్నారు. పార్టీ అధిష్టానం గనుక తన వివరణ తీసుకుని దర్యాప్తు జరిపిస్తుందని మాటిస్తే.. వాళ్ల పేర్లను వెల్లడించేందుకు తాను సిద్ధమని ప్రకటించింది.అదే సమయంలో ఫేస్‌బు క్‌లోనూ ఆమె ఓ పోస్ట్ చేశారు. "ఇది నా ప్రతిష్టను దెబ్బ తీయడానికే విద్యార్థి విభాగంలో కొందరు చేసిన పని. నా పాపాలను కప్పిపుచ్చుకునేందుకు నేను ఈ నాటకాలు ఆడుతున్నానని ప్రచారం చేస్తున్నారు. ఏది సత్యమో నిర్ణయించాల్సింది ఇక చట్టమే" అని అన్నారామె.కోల్‌కతాలోని వివిధ లొకేషన్ల నుంచి ఆ ఫొటోలు షేర్ అయ్యాయి. ఈ ఫేక్ ఫొటోలతో తనను బద్నాం చేయడం మాత్రమే కాదు.. టీఎంసీ విద్యార్థి విభాగంలోని యువతుల్లో కొందరిని పదవుల ఆశ చూపించి లొంగదీసుకునే ప్రయత్నం కూడా అని ఆరోపించారామె. అయితే ఈ వ్యవహారంపై టీఎంసీ స్పందించింది. ఈ విషయాన్ని రాజన్య



తమకు దృష్టికి తేలేదని.. ఒకవేళ తగిన ఆధారాలతో సంప్రదిస్తే ? విచారించి కచ్చితంగా చర్యలు తీసుకుంటామని సీనియర్ నేత, మంత్రి ఫిర్హద్ హకీమ్ చెబుతున్నారు.రాజన్య హల్దార్ టీఎంసీ విద్యార్థి విభాగం సహచరుడు, ఫిల్మ్ మేకర్ అయిన ప్రాంతీక్? చక్రవర్తిని కిందటి ఏడాది వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ ఇద్దరూ పొలిటికల్ థీమ్‌తో కూడిన షార్ట్ ఫిల్మ్‌లు తీస్తున్నారు. ఈ క్రమంలోనే ఆర్జీకర్ దారుణ ఘటన ఉదంతాన్ని పోలిన షార్ట్ ఫిలింలో ఆమె నటించారు. ఇది దుమారం రేపడంతో ఆమెను పార్టీ సస్పెండ్ చేసింది. ఇదిలా ఉంటే.. రాజన్య భర్త ప్రాంతీక్ పార్టీలోకి తీసుకొచ్చిన కొందరిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అంతెందుకు లా స్టూడెంట్ అత్యాచార ఉదంతంలో అరెస్ట్ అయిన మోనోజిత్ మిశ్రాకు ప్రాంతీక్‌కు అత్యంత సన్నిహితుడు ఈ ఎపిసోడ్‌లో మరో కోసమెరుపు.


వృద్ధురాలిని తీసుకెళ్తున్న మహిళా పోలీసులు


నిర్మాణాలు కూల్చి వేస్తున్న దృశ్యం

# ఉద్రిక్తతల నడుమ ఇండ్ల కూల్చివేతలు

- భారీగా మోహరించిన పోలీసులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 14 (జనంసాక్షి) :**
వేములవాడ మూలవాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణం కోసం భూ సేకరణ పనులను అధికారులు వేగవంతం చేస్తున్నారు. తిప్పాపురం బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇండ్లు, దుకాణాల నిర్మాణాలను ఖాళీ చేయాలని గత 15 రోజుల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయాగ ఆదివారం నోటీసుల గడువు ముగియడంతో సోమవారం కూల్చివేతలను అధికారులు ప్రారంభం చేశారు. ఇంటి యజమానులు మాట్లాడుతూ.. తమకు ఎలాంటి నష్టపరి హారం ఇవ్వకుండానే ఇళ్లను కూల్చుతున్నారని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల పరిహారంను కూల్చివేతలకు ముందే పరిహారం కోర్టులో జమ చేసినట్లు అధికారుల చెబుతున్నారు. కూల్చివేతను అడ్డుకున్న వృద్ధురాలుని మహిళా పోలీసులు అదుపులోకి తీసుకొని కొద్ది దూరం తీసుకువెళ్లడంతో ఆ వృద్ధురాలు స్పృహ తప్పి పడిపోయింది. అధికారులు 2 జెసిబిలతో నిర్మాణాలు కూల్చి వేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంబేద్కర్ విగ్రహం వెనకాల గల ఒక బిల్డింగును కూల్చేసేందుకు అధికారులు ప్రయత్నించగా ఆ ఇంటి యజమానులు ఇంటిపై ఉన్న హోర్డింగ్ ఎక్కి ఇల్లు కూల్చివేస్తే పైనుండి దూకి చస్తామని బెదిరించడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఇండ్ల కూల్చివేతను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇండ్ల యజమానులతో మాట్లాడుతూ వేములవాడ లో రెండో బ్రిడ్జి నిర్మాణంలో ఇల్లు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లింపులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండానే ఇళ్లను కూల్చుతు న్నారని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతలకు ముందే పరిహారం కోర్టులో జమ చేశామని, ఎలాంటి అభ్యంతరాలు ఉన్న కలెక్టరేట్కు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల కూల్చివేత ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్బి అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ పరిశీలన




# మహిళా సాధికారత సాధనే ప్రభుత్వ లక్ష్యం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 14 (జనం సాక్షి) :**
మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. బోర్గం(పి) శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, లోన్ బీమా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో వ్యాపార లావాదేవీల నిర్వహణ ద్వారా సాధించిన ఆర్థిక ప్రగతి గురించి ఆయా సంఘాల మహిళా సభ్యులు వివరిస్తూ, తోటి సభ్యులలో స్ఫూర్తిని పెంపొందించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ చేపట్టిన వెనువెంటనే ఉచిత ప్రయాణాన్ని అమలులోకి తెచ్చిందని గుర్తు చేశారు. కేవలం ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా రాజకీయ రంగంలో కూడా సరైన ప్రాతినిధ్యం కల్పించేలా చట్టసభలలో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాలకు సూచించారు. కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలను పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తోందని అన్నారు. జిల్లాలోని 20,547 మహిళా సంఘాలకు రూ. 21.69 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లోని 5781 మహిళా సంఘాలకు రూ. 5.91 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రమాద బీమా, బీమా లోన్, బ్యాంకు లింకేజీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ వివరించారు. ప్రమాద బీమా అమలు వల్ల బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం వర్తించడంతో పాటు మహిళా సంఘం యధావిధిగా కొనసాగేందుకు బీమా దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ వేడుకలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, సొసైటీల చైర్మన్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



“ సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని చెప్పారు. ”

# నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్-2025 పోస్టర్ ఆవిష్కరణ




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 14 (జనం సాక్షి) :**
జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ ఎన్.ఎస్.పి.సి 2025 పోస్టర్ ను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్లు విక్టర్ మరియు చందర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణ కోసం విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అత్యంత అవసరమని, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాల వేరుచేయడం వంటి పద్ధతులు ప్రతి విద్యార్థికి అలవాటవ్వాలిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి ఎస్ఏ ఇంగ్లీష్ వ్రాసిన వీడియో సాంగ్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ పోటీని, హరిత్, ద వే ఆఫ్ లైఫ్ అనే నినాదం తో పర్యావరణ సంరక్షణ అనే ఉద్దేశంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయనీ, కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ పోటీని నిర్వహిస్తున్నారనీ చెప్పారు. ఫలితాలు ఆగస్టు 30న విడుదల చేస్తామన్నారు. పోటీలు ఐదు విభాగాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి,6వ తరగతి నుండి 8వ తరగతి 9వ తరగతి నుండి 12వ తరగతి,డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు ఇతరులు సాధారణ పౌరులు పోటీలో పాల్గొనడానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు అవసరం లేదన్నారు. ఈకో మిత్ర https://ecomitram.app/nspc/ అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయవచ్చన్నారు. హిందీ, ఇంగ్లీష్ సహా అనేక భాషలలో క్విజ్ అందుబాటులో ఉంటుందనీ, మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న మీ సెల్ఫీని అప్లోడ్ చేయడం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికి పాల్గొన్నందుకు ఈ సర్టిఫికెట్ ఇవ్వబడుతుందనీ, ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు ఈ పోటీలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్దరాం రెడ్డి పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 14 (జనం సాక్షి)**
ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసిలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్లతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి 95 అర్జీలు వచ్చినాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారంలోగా దరఖాస్తులను పరిష్కరించి ఆర్జి దారులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హాస్టళ్ళు, స్కూళ్లలో ఆకస్మిక పోచారం తనిఖీలు





**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జులై 14 (జనం సాక్షి):**
నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రూర్ మరియు వర్ని మండలాల్లోని విద్యా సంస్థలు, హాస్టళ్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ కూడా ఆయనతో కలిసి పాల్గొన్నారు. రుద్రూర్ మండలం అంబెం గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్, బాలికల హాస్టల్తో పాటు, వర్ని మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కోటయ్య క్యాంప్ గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను పోచారం తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా వంటగది, సరుకుల నిల్వ గదులను ఆయన పరిశీలించి, సరుకులు మరియు కూరగాయల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మేనూ ప్రకారం రోజువారీ ఆహారం అందించబడుతోందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అల్పాహారాన్ని పోచారం స్వయంగా రుచి చూసి దాని నాణ్యతను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో వర్ని మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేష్ బాబా, వర్ని, రుద్రూర్ మండలాల ప్రజాప్రతినిధు లు, నాయకులు, అధికారులు పోచారంతో కలిసి పాల్గొన్నారు. ఈ తనిఖీలు విద్యా సంస్థలలో విద్యార్థులకు అందించే సౌకర్యాలు, ఆహార నాణ్యతను మెరుగుపరచడంలో భాగంగా నిర్వహించబడ్డాయి.

# మహిళా స్వశక్తి సంఘాలు ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి

### ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** మహిళా శ్వశక్తి సంఘాలు క్రియాశీలకంగా పనిచేసి ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం మంథని నియోజకవర్గ పరిదిలోని కాటారం, మహాదేవ పూర్, మహా ముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు, బాంక్ లింకేజీ, ప్రమాద భీమా, రుణ భీమా, మహిళా సంఘాలు ద్వారా నడుపుతున్న ఆర్టీసీ బస్సుకు అద్దె చెల్లింపులు, ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేసేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు ఇస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ ను రెడ్ కో సంస్థ ద్వారా తిరిగి ప్రభుత్వం కోనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మహిళా సంఘాలు ద్వారా దాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యం మహిళల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. 36,34,751 లక్షల రూపాయలు ప్రమాద భీమా, రుణ భీమా 30 లక్షలు, బ్యాంకు లింకేజీ 10.30 కోట్లు, 69.03 లక్షలు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. డివిజన్ లో మొత్తం 3161 మహిళా సంఘాలలో 32070 మంది సభ్యులున్నారని తెలిపారు. మహిళలు తలచుకుంటే చేయలేనిది ఏమి ఉండదని ఇంట్లో వంట నుండి పిల్లల విద్యాభ్యాసం వరకు అన్నింటిలో మహిళలు ముందుంటారని తెలిపారు. గత 10 సంవత్సరాల కాలంలో మహిళలలకు పైసా కూడా వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని తెలిపారు. అవసరాన్ని బట్టి రుణాలు, వనరులు సమకూర్చి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసి వ్యాపార వేత్తలుగా తయారు చేయనున్నట్లు తెలిపారు. మీ శక్తి, యుక్తి కి వాణిజ్య, వ్యాపార, ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రభుత్వం గొప్ప ఆలోచనలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా కోటి రూపాయలతో సోలార్ విద్యుత్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ప్రభుత్వానికి విద్యుత్ విక్రయించి సంఘాల సభ్యులకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. వారం రోజుల్లో మండలానికి 100 మంది మహిళలకు కుట్టు మిషన్లలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని డీఆర్డీవోను ఆదేశించారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. 200 లోపు ఉచిత విద్యుత్తు, 500లకు గ్యాస్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్లు రైతు భరోసా, రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు.




# గాయత్రి విద్యానికేతన్‌లో గ్రీన్ డే వేడుకలు

### - విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణకు చైతన్యం

పెద్దపల్లి,జూలై 14(జనంసాక్షి) : పరిసరాల పరిరక్షణపై అవగాహన పెంపొందించడానికి గాను పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో సోమవారం గ్రీన్ డే ని ఎంతో ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చ వస్త్రధారణలో పాల్గొని పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ “మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరికి పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ఉంది. ఇది వర్షాకాలం కాబట్టి పిల్లలంతా తమకు ఇచ్చిన మొక్కలను నాటడమే కాకుండా, వాటి పరిరక్షణ కూడా చేసినట్లయితే మొక్కలు సంరక్షించబడతాయని, వృక్షో రక్షతి రక్షితః అన్న నానుడి ని నిజం చేయాలంటే మనందరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో , వాతావరణ సమతుల్యతలో మన వంతు పోషించాల్సిన అవసరం ఉందనీ, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు గ్రీన్ డేపై పాటలు, నాటికలు, డ్రాయింగ్ ప్రదర్శనలు చేస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఉసిరి, దానిమ్మ, మునగ, బొప్పాయి, సీతాఫలం, మందార, గులాబీ, అలోవెరా, పచ్చ గన్నేరు తదితర పూల మరియు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ విధంగా పాఠశాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ఒక మంచి సందేశం సమాజానికి చేరవేస్తున్న గాయత్రి విద్యానికేతన్ యాజమాన్యాన్ని పోషకులు అభినందించారు. ఉత్సాహ భరితంగా సాగిన ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### 16 తేదీన పెద్దపల్లికి మంత్రుల రాక

**పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణ కేంద్రంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, జిల్లా ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు ము ఖ్య అతిథులుగా విచ్చేస్తున్న సందర్భంగా పెద్ద పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



### అభివృద్ధి పనుల వేగవంతానికి ఎంపీడీవోలు
# క్షేత్రస్థాయిలో సందర్శించాలి
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 14 (జనంసాక్షి) :**
జిల్లాలో పలు ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు వంటి అభివృద్ధి పనులపై ఎంపిడివోలు క్షేత్రస్థాయిలో సందర్శించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతుల కల్పన, కిచెన్ షెడ్ టాయిలెట్, ప్రహరీ గోడ వంటివి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో సందర్శించి ప్రతి పనినీ పర్యవేక్షించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న పలు ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో మరమ్మతులు చేపడుతున్నామని, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా సంక్షేమ అధికారి ఈ పనులను పర్యవేక్షిస్తూ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని అర్హులైన లబ్ధిదారులు ఉంటే తదుపరి జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు పట్ల రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ప్రైవేట్ అంబులెన్స్ లను ప్రభుత్వ ఆసుపత్రులకు అతి సమీపంలో నిలుపుతున్నారని, ఈ విధానాన్ని కట్టడి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మహేశ్వర్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

**ప్రజావాణికి 339 దరఖాస్తులు...**
ప్రజావాణి లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 339 అర్జీలు రాగా పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# సర్పంచ్ ఎన్నికలు వద్దు!

- బుగ్గారం ప్రజా క్షేత్రంలో పంచాయతీ లెక్కలు తేల్చండి
- జిల్లా కలెక్టర్‌కు “చుక్క గంగారెడ్డి” విజ్ఞప్తి



**జగిత్యాల జిల్లా బ్యూరో జులై (జనం సాక్షి):**
బుగ్గారం గ్రామ పంచాయతీ లెక్కలు తేల్చి దోషులందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకునే దాకా బుగ్గారం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించ వద్దని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ కు సీనియర్ ఉద్యమకారుడు, తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞాపన పత్రం అందుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే జిల్లా పంచాయతీ అధికారి సి.హెచ్. మదన్ మోహన్ ను పిలుచుకొని ప్రజావాణి వేదికగా తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చుక్క గంగారెడ్డి విలేఖరులతో మాట్లాడారు.. బుగ్గారం గ్రామ పంచాయతీ లో కోటికి పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు అవినీతికి పాల్పడి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి, ప్రత్యేకంగా నిధుల దుర్వినియోగం ను పరిశీలించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని 2024 డిసెంబర్ 6న లోకాయుక్త జారీ చేసిన ఆర్డర్ ను, 2025 మార్చి 10న జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను కూడా పంచాయతీ అధికారులు తుంగలో త్రొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. నియమ నిబంధనలను అనుసరించి సమగ్ర విచారణ చేసి, తగు చర్యలు తీసుకుంటూ నివేదిక సమర్పించాలని 2024 సెప్టెంబర్ 11న అప్పటి అదనపు కలెక్టర్ బి. గౌతమ్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఉత్తర్వులను కూడా భే ఖాతర్ చేశారని ఆరోపించారు. సమాచార కమీషన్ ఇచ్చిన 18 ఆర్డర్లను, జిల్లా కలెక్టర్ ఆర్టీఐ ఆదేశాలను సైతం జిల్లా పంచాయతీ అధికారులు లెక్క చేయడం లేదన్నారు. లోకాయుక్త ఆర్డర్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఉత్తర్వులను, జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలను, సమాచార కమీషన్ తీర్పులను కూడా ధిక్కరించి, చట్టాలను, వారి విధులను, వారి బాధ్యతలను కూడా ఉల్లంఘించిన జిల్లా, డివిజనల్, మండల పంచాయతీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, మా బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంలో బాధ్యులందరి మీద మా (చుక్క గంగారెడ్డి) పిర్యాదు మేరకే... పోలీస్ అధికారులతో.. “క్రిమినల్ కేసులు” నమోదు చేయించి, దుర్వినియోగమైన ప్రజా ధనం మొత్తం రికవరీ చేయాలని కోరారు. “ప్రత్యేక నిఘా విభాగం” అధికారుల ద్వారా బుగ్గారం ప్రజా క్షేత్రంలో.. బహిరంగ సభ ఏర్పాటు చేసి జి.పి. నిధుల లెక్కలు బహిర్గతం చేసి, “తగు కట్టుదిట్టమైన సమగ్ర విచారణ జరిపించి” వాస్తవాలను వెలికి తీసి, పూర్తి దుర్వినియో గాన్ని బయట పెట్టి బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్ లో మరెక్కడా కూడా జరుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కు చుక్క గంగారెడ్డి 20 అంశాలతో కూడిన విజ్ఞప్తి చేశారు. అప్పటి దాకా మా “బుగ్గారం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు” నిర్వహించ వద్దని ప్రత్యేకంగా తమరిని వేడుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కు అందజేసిన వినతి పత్రం లో చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల సమయంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హై కోర్టు ను ఆశ్రయించి “ఎన్నికలపై స్టే ఆర్డర్” తెస్తామని చుక్క గంగారెడ్డి స్పష్టం చేశారు.



## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

**మంథని, జులై 14 (జనం సాక్షి):** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం మంథని నియోజకవర్గం మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గివ్ స్వచ్ఛంద సంస్థ, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సౌజన్యంతో 650 మంది విద్యార్థులకు పాఠశాల షూస్, స్పోర్ట్స్ షూస్ పంపిణీ చేశారు.

కార్యక్రమంలో భాగంగా, అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం, ఖేల్ ఇండియా కార క్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా గ్రామీణ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయుల కొరతను నివారించేందుకు నోటిఫికేషన్ జారీ చేసి టీచర్ పోస్టులు భర్తీ చేశామని, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, పుస్తకాలు, నాణ్యమైన ఆహారం కోసం నూతన డైట్ మెనూ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో ఇప్పటికే డ్యూయల్ డెస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మహదేవ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు గొప్ప చరిత్ర ఉందని, దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సీఎస్ఆర్ నిధులతో సుమారు 15 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, త్వరలో శంకుస్థాపన జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి మెరుగైన విద్యను అందిస్తున్నారని అభినందించారు. ప్రైవేట్ పాఠశాలల నుండి 245 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చేరడం సానుకూల పరిణామమని, విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదిగి తమ గ్రామానికి, తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు చురుకుగా చదువుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. బాలికల కోసం మహదేవ్‌పూర్ పాఠశాలలో మొట్టమొదటిసారిగా సానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, విద్యాశాఖ అధికారి రాజేందర్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగి పురుగుల మందుతాగి ఆత్మహత్య

### మహిళా పోలీసు స్టేషన్ సీఐ, భార్య, అత్త మధ్యవర్తులపై కేసు నమోదు

**కరీంనగర్ జిల్లా బ్యూరో/చొప్పదండి, జూలై 14 (జనం సాక్షి) :**



కుటుంబ కలహాల కారణంగా తనపై మహిళా పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసులు పెట్టించి తన చావుకు తన భార్య, అత్తతో పాటు కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, కొంతమంది మధ్యవర్తులు కారణమంటూ పురుగుల మందు తాగి ఈ నెల 7న ఆత్మహత్యాయత్నం చేసిన రెవెన్యూ ఉద్యోగి కడారి శ్రావణ్ కుమార్ (34) చికిత్స పొందుతూ ఆదివారం రోజు (జులై13న) చనిపోయాడు. మృతుడు శ్రావణ్ కుమార్ తండ్రి నర్సింగం ఫిర్యాదు మేరకు చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి అందించిన వివరాల ప్రకారం చొప్పదండికి చెందిన కడారి శ్రవణ్ కుమార్ కరీంనగర్ రూరల్ తహసీల్ ఆఫీస్లో రికార్డు అసిస్టెంట్గా పని చేస్తున్నారని అతనికి కరీంనగర్కి చెందిన బత్తుల నీలిమతో 2021లో వివాహం జరిగింది. ఆమె కరీంనగర్ డిపో లో కండక్టర్గా పని చేస్తుంది. వీరికి 2024 నుంచి మనస్పర్ధాలు ఏర్పడి గొడవలు పెట్టుకొని నీలిమ తన పుట్టింటికి వెళ్లింది. గత నెల జూన్లో మహిళా పోలీస్ స్టేషన్లో వరకట్న వేధింపులు అంటూ శ్రావణ్ కుమార్ పై కరీంనగర్లోని మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. నీలిమ ఫిర్యాదు మేరకు శ్రావణ్ కుమార్, అతని తల్లి విజయ, సోదరి వనజపై గృహహింసం, వరకట్న వేధింపుల కేసు నమోదు అయింది. ఈ నెల 7వ తేదీన శ్రావణ్ కుమార్పై కేసు నమోదు అయిందని, బేయిల్ తీసుకోవడానికి స్టేషన్కు రావాలని స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో భయాందోళనకు గురై అదే రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. ట్రీట్మెంట్ కోసం కరీంనగర్ గవర్నమెంట్ హాస్పిటల్కు తీసుకెళ్లి మెరుగైన ట్రీట్మెంట్ కోసం ప్రైవేట్ హాస్పిటల్కు తీసుకెళ్లి ట్రీట్మెంట్ అందించగా పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం చనిపోయాడు. తన కుమారుడు శ్రావణ్ కుమార్ చావుకు కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత, భార్య బత్తుల నీలిమ, మధ్యవర్తులు ప్రవీన్ కుమార్, నవీన్ కుమార్, ఎడ్ల ప్రసన్న, బత్తుల వినోద, బత్తుల మధు కుమార్లు తన కుమారుడిని వేధింపులకు గురిచేయగా అతను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని, అతని చావుకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి నర్సింగం చొప్పదండి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు మృతుని భార్య నీలిమ, ఆమె తల్లి, ఆమె తరపున స్టేషన్కి వచ్చిన మధ్యవర్తులతో పాటు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పై కేస్ నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.



ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసి తన కూతురు వివాహానికి రావాలని ఆహ్వానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి..

### కల్లూరు అప్పయ్య, సంక్రాంతి చిత్రాలకు

## అంతర్జాతీయ అవార్డుల పంట

**ఖమ్మం (జనం సాక్షి) :**



ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు కొత్తపల్లి శేషు రచన దర్శకత్వం వహిం చిన కల్లూరు అప్పయ్య, సంక్రాంతి 2కే 25 చిత్రాలకు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. కల్లూరు అప్పయ్య, సంక్రా ంతి 2కే 25 అనే రెండు చిత్రాలకు గాను ఇంటర్నే షనల్ మలేసియా సినీ అవార్డ్స్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ రచయిత అవార్డు, ఉత్తమ దర్శకు ని అవార్డు, ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డులు కొత్తపల్లి శేషుకి, ఉత్తమ నిర్మాత అవార్డు ప్రముఖ విద్యావేత్త, మీడియా అధినేత గుజ్జారి శ్రీధర్ బాబుకి, ఉత్తమ నటుడు అవార్డు ప్రముఖ యాంకర్, నటుడు మొగిలి గుణకర్‌కి, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నల్లగట్ల కిశోర్ బాబుకి, ఉత్తమ నటి అవార్డులు మహేశ్వరీ నాయుడు, యామిని లకు ప్రకటించారు. త్వరలో సినీ ప్రముఖుల ద్వారా ఈ అవార్డులు విజేతలకు అందజేయనున్నట్లు మలేసియా ఇంటర్నేషనల్ అవార్డు కమిటీ తెలియజేసింది. ఈ సందర్భంగా రచయిత దర్శకుడు కొత్తపల్లి శేషును, నిర్మాత గుజ్జారి శ్రీధర్ బాబు ను, మొగిలి గుణకర్ ను కిషోర్ బాబును, మహేశ్వరి, యామినిలను, కో డైరెక్టర్ రవి తోప్‌ను, కెమెరా మెన్ ఉదయకుమార్, చందులను నగరానికి చెందిన పలువురు కళాకారులు, కళా సంస్థల ప్రముఖులు అభినందించారు. తమకు ఈ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి తమ టీమ్ వర్క్ కారణమని నిర్మాత శ్రీధర్ బాబు,కొత్తపల్లి శేషు మొగిలి గుణకర్, రవితోప్, కిషోర్ తదితరులు అన్నారు. ఈ అవార్డు ల కమిటీ కి ధన్యవాదములు తెలియజేస్తూ త్వరలోనే ఒక పెద్ద సినిమాకి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

## క్రికెట్ రూల్స్‌లో మార్పులు తేవాలి : అనిల్ కుంబ్లే



క్రికెట్ రూల్స్‌లో మార్పులు తీసుకురావాలని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే డిమాండ్ చేశారు. సలైవా వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని, డ్యూక్ బంతి నాణ్యతను మెరుగుపరచాలని ఐసీసీకి సిఫారసు చేరశారు. ప్రస్తుతం ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. డ్యూక్ బంతిపై వివాదం తలెత్తింది. ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌తో కుంబ్లే మాట్లాడుతూ.. 'బంతి మృదువుగా మారడం లేదంటే మార్చాల్సిర్నొ చెప్పాడు. ఎందుకంటే చాలా తరుచుగా లయను కోల్పోతుంది. ఇందు కోసం ఏదైనా చేయాలి. బంతి పది ఓవర్లు నిలబడకపోతే బంతిని తరుచుగా మార్చడం సరికాదు. క్రికెట్‌కు మాత్రమే కాదు బంతికి కూడా' అని పేర్కొన్నారు. పది ఓవర్ల మ్యాచ్ తర్వాత బంతిని మార్చడంపై టీమిండియా ప్లేయర్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లార్డ్స్‌లో జరుగుతు మూడో టెస్ట్ మ్యాచ్ రెండోరోజు ఉదయం సెషన్‌లో రెండుసార్లు బంతిని మార్చారు. కేవలం పది ఓవర్ల ఆట తర్వాత బంతిని మార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ మాట్లాడుతూ గతంలోని తయారీ ప్రమాణాల మేరకు బంతిని తీసుకు రావడం ఓ పరిష్కారం కావొచ్చని పేర్కొన్నారు. డ్యూక్ బంతి పాత వెర్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌కు మద్దతు తెలిపారు.

ఐదేళ్ల కిందట అందుబాటులో ఉన్నదా న్ని తిరిగి తీసుకురావడం న్యాయమని తాను భావిస్తున్నా నని మాజీ హెడ్‌కోచ్ తెలిపాడు. లాలాజల వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే డిమాండ్ చేశారు. బంతిని మెరుస్తూ లాలాజలం వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే ఐసీసీని కోరారు. ఇది బౌలర్లకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బంతిని మెరిసేలా చేయడం, రివర్స్ స్వింగ్ రాబట్టవచ్చని మాజీ కెప్టెన్ తెలిపాడు.

# జడేజా పోరాటం వృథా

## ఇంగ్లండ్‌పై భారత్ ఓటమి

- ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 2-1 ఆధిక్యం
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బెన్ స్టోక్స్
- భారత్ 170 ఆలౌట్.. రవీంద్ర జడేజా (61) నాటౌట్



**లార్డ్స్ మైదానంలో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో టీమిండియాపై సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక, 170 పరుగులకు ఆలౌట్ అయింది. రవీంద్ర జడేజా (61 నాటౌట్, 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా పోరాడినప్పటికీ, జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు.**

లార్డ్స్ మైదానంలో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైంది. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (61 నాటౌట్, 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా పోరాడినప్పటికీ, జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఇంగ్లండ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది, తమ మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులు (10 వికెట్లు) చేసింది. జో రూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడన్ కార్స్ (56) రాణించారు. భారత్ కూడా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులు (10 వికెట్లు) సమం చేసింది, ఇందులో కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ ముందు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. చివరి రోజు 58/4 స్కోరుతో ఆట ప్రారంభించిన గిల్ సేన 170 పరుగులకు ఆలౌటై, 22 పరుగుల తేడాతో ఓడి పోయింది. కేఎల్ రాహుల్ (39, 58 బంతులు) మరియు జడేజా పోరాడినప్పటికీ, జట్టు విజయం సాధించలేకపోయింది. ఈ ఓటమితో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. ఇంతకుముందు లీడ్స్ టెస్ట్‌లో ఇంగ్లండ్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది, అయితే ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ 336 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ లార్డ్స్ ఓటమి భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది.

ఇంగ్లండ్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్ (3 వికెట్లు), బెన్ స్టోక్స్ (3), బ్రైడన్ కార్స్ (2), క్రిస్ వోక్స్ (1), షోయబ్ బషీర్ (1) అద్భుతంగా బౌలింగ్ చేశారు. జేమ్స్ ఆండర్సన్, స్టువర్ట్ బ్రాడ్‌ల వ్యూహాత్మక బౌలింగ్ భారత బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చి ంది. కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో భారత్ ఒత్తిడిలో కూరుకుపో యింది. జడేజా (61 నాటౌట్, 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం జట్టును గెలిపించలేక పోయినప్పటికీ, ఇంగ్లండ్ బౌలర్ల ఒత్తిడి ముందు భారత ఆశలు ఆవిరయ్యాయి. బెన్ స్టోక్స్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. లార్డ్స్ టెస్ట్ నాలుగో రోజు చివరి సెషన్ అది. రాహుల్‌తో పాటు పేసర్ ఆకాశ్‌దీప్ క్రీజులో ఉన్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, యంగ్ స్పీడ్‌స్టర్ బ్రైడన్ కార్స్ భీకరంగా బౌలింగ్ చేస్తున్నారు. బంతి అనూహ్యంగా బౌన్స్ అవ డం, స్లోప్ మీద పడి దిశ మార్చుకొని వేగంగా దూసుకొస్తుండటంతో బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

## సిరాజ్‌పై ఐసీసీ రూ. 2.25 లక్షల జరిమానా

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చర్యలు తీసుకుంది. అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగం గా లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో సిరాజ్ అనుచిత ప్రవర్తన కారణంగా అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం (రూ. 2.25 లక్షలు) జరిమానాగా విధించబ డింది, అలాగే ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించబడింది. మ్యాచ్‌లో నాలుగో రోజు, ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను ఔట్ చేసిన తర్వాత సిరాజ్ ఆవేశంతో సంబరాలు చేసుకు న్నాడు. ఈ క్రమంలో డకెట్‌పై దూసుకెళ్లి "కమాన్" అంటూ గట్టిగా అరవడంతో ఇద్దరి భుజాలు ఢీకొన్నాయి. ఈ చర్యను అంపైర్లు తప్పుబట్టి, సిరాజ్‌ను అప్పటికప్పుడు మందలిం చారు. ఆట ముగిసిన తర్వాత అంపైర్ల ఫిర్యాదు మేరకు మ్యాచ్ రిఫరీ విచారణ జరిపి, ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.5 ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ నిబంధన ప్రకారం, ప్రత్యర్థి ఆటగాడిపై అనుచిత వ్యవహారం, అసభ్యకర భాష ఉపయోగించడం లేదా బ్యాటర్ ఔట్ అయినప్పుడు దూకుడుగా ప్రవర్తించడం నిషే ధితం. సిరాజ్ మ్యాచ్ రిఫరీ ముందు తన తప్పిదాన్ని అంగీకరించాడు. గత 24 నెలల్లో ఇది అతని రెండో తప్పిదం కాగా, ప్రస్తుతం అతని ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. రెండేళ్లలో నాలుగు డీమెరిట్ పాయింట్లు సమకూరితే ఆటగాడు మ్యాచ్ నిషేధం ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరో రెండు పాయింట్లు జోడితే సిరాజ్‌పై నిషేధం విధించబడవచ్చు. టెస్ట్ మ్యాచ్‌లకు భారత ఆటగాళ్లకు బీసీసీఐ రూ. 15 లక్షల మ్యాచ్ ఫీజు చెల్లిస్తుంది. దీనిలో 15 శాతం జరిమానా అంటే రూ. 2.25 లక్షలు. అయితే, నెటిజన్లు మరియు మాజీ క్రికెటర్లు ఈ జరిమానాన్ని భారత ఆటగాళ్లకు నామమాత్రమేనని అభిప్రాయపడుతున్నారు.





# ఏసీబీ చేతికి బకాసురుల చిట్టా

### జిహెచ్ఎంసి సర్కిల్-18 ఏసీపీపై డేగ కన్ను

**పది నెలల్లోనే రూ.కోట్లు అక్రమ సంపాదించిన అధికారులు**

**అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేసిన టీజేఎస్ఎస్**

**ఖైరతాబాద్, జూలై 14 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఖైరతాబాద్ జోనల్ జిహెచ్ఎంసి సర్కిల్ -18 జూబ్లీహిల్స్‌లో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి) ఇంజ శ్రీనివాస్, మాజీ సెక్షన్ ఆఫీసర్ చంచల సుధాకర్‌ల అవినీతి పర్వం ఏసీబీ చేతికి వెళ్లింది. ఈ మేరకు సోమవారం బంజారాహిల్స్‌లోని అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజేఎస్ఎస్) లిఖితపూర్వక ఫిర్యాదుచేసింది. బకాసురల అక్రమ సంపాదన, అవినీతి బాగోతాలు సహా అన్ని విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన సదరు సంఘం నాయకులు.. సంబంధిత ఆధారాలను కూడా అందజేశా రు. గత పది నెలలుగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట్‌లలో జరిగిన అన్ని అక్రమ నిర్మాణాలలో ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ కలిసి చేసిన అక్రమ వసూళ్ల దందాపై ఏసీబీ కూడా ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ప్రైవేటు వ్యక్తులను పెట్టుకుని ఏయే పద్ధతుల్లో అక్రమ వసూళ్లు చేశారనే అంశాలపైనా ఆరాతీసినట్టు సమాచారం. అక్రమ నిర్మాణాలకు నోటీసులు కూడా సరైన సమయంలో ఇవ్వకుండా కోర్టు స్టే ఆర్డర్‌లు సైతం నిర్మాణదారులను పెంచిపోషించారని ఏసీబీ దృష్టికి వెళ్లింది. దీంతో సర్కిల్ 18పై ఏసీబీ శాఖ ప్రత్యేక దృష్టిసారించినట్టు సమాచారం. బకాసురల అవినీతి ఆగడాలను కూకటి వేళ్లతో పెకిలించడానికి బాధితులు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని, ఆ ఇద్దరు అధికారుల నుంచి వేధింపులు ఎదుర్కొన్నవారు సైతం ఉన్నతాధికారులను సంప్రదించి ఫిర్యాదుచేయాలని టీజేఎస్ఎస్ నాయకులు కోరారు.

## గ్రామాలలో ప్రభుత్వ పాలన సజావుగా జరగాలి

- ఉపాధి హామీ పనుల క్రింద కనీస సరాసరి వేతనం 307 రూపాయలు ఉండేలా చర్యలు
- గ్రామాల్లో మల్టీ పర్పస్ వర్కర్లకు బీమా కల్పించాలి
- రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువుల కొనుగోలు చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జులై 14 (జనం సాక్షి):** గ్రామాల్లో ప్రభుత్వ పాలన సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం తదితర అంశాలపై మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వన మహోత్సవం కింద నిర్దేశిత లక్ష్యాల మేరకు మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ కింద గుంతల తవ్వకం పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల కింద కనీస వేతనం రూ. 307 ఉండేలా చూడాలని, అవెన్యూ ప్లాంటేషన్‌లో ఎత్తైన మొక్క లు నాటాలని సూచించారు. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, జులై చివరి నాటికి మొక్కల నాటే పనులు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో 20 ఎకరాలలో కమ్యూనిటీ ప్లాంటేషన్ చేపట్టాలని, గ్రామాల్లో 5 చోట్ల సామాజిక గుంతల తవ్వకం వారంలో ప్రారంభించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో లింక్ చేస్తున్నట్లు, 70 గ్రామాల్లో సర్వే పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని సెంట్రల్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు నీటి నిల్వలను నివారి ంచి, ఆయిల్ బాల్స్ వేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, సంక్షేమ హాస్టళ్లలో త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం పరిశీలించా లని ఆదేశించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్లకు పీఎం సురక్ష బీమా, జేజేవై బీమా కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, పీడి హౌసింగ్ రాజేశ్వర్ రావు, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆగస్టు వరకు సరిపడా ఎరువుల నిల్వలు: కలెక్టర్**

పెద్దపల్లి జిల్లాలో ఆగస్టు నెల వరకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 9400 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టులో 10,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, ఇప్పటి నిల్వలు సరిపోతాయని పేర్కొన్నారు. రైతులు అనవసరంగా యూరియా కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్ల నత్రజని ఆవిరైపోతుందని, అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాకు అవసరమైన యూరియాను రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసి తెప్పించడం జరుగుతుందని, ఆగస్టులో కూడా సరఫరా కొనసాగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**పెద్దపల్లి జిల్లాలో అర్జీల సత్వర పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఆదేశం**

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అర్జీల పరిష్కారాన్ని సత్వరమే పూర్తి చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించా రు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణు తోడుగా కలెక్టర్ శ్రీ హర్ష ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఓదెల మండలం పోత్కపల్లి గ్రామానికి చెందిన ఆర్. తిరుపతి, కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామ శిఖం భూమిని కొందరు గ్రామస్తులు కబ్జా చేసి అక్రమంగా అమ్ముకుంటున్నారని దరఖాస్తు సమర్పించగా, కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్‌కు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాలకుర్తి మండలం బామ్లా నాయక్ తండ గ్రామ మాజీ సర్పంచ్ మరియు గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హుల జాబితా విడుదల కావాలని కోరగా, సంబంధిత అధికారులకు పరిశీలనకు ఆదేశాలు జారీ చేశారు.



## ఇబ్రహీం కుంట పోచమ్మ చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టరేట్ ఎదుట పలు వివిధ సంఘాల నాయకులతో ధర్నా

**పెద్దపల్లి,జూలై 14(జనంసాక్షి) :** కమాన్ పూర్ మండలం సర్వే నెంబరు 247లో గల ఇబ్రహీం కుంట అలియాస్ పోచమ్మ చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారుల నుండి కాపాడాలని ఎస్సీలు వివిధ సంఘాల నాయకులతో కలిసి సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇనగంటి భాస్కర్ రావు కుంట భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. మంథని రెవెన్యూ, పంచాయితీ రాజ్ అధికారు లకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. ఆక్రమ ణలపై తక్షణమే విచారణ జరిపించి ఆక్రమణకు గురైన కుంట భూమిని కాపాడాలని కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు కొమురయ్య, కనకయ్య, సంపత్, ఎమ్మార్పీఎస్ కమాన్ పూర్ మండల అధ్యక్షుడు కుక్క రవి, జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్, వివిధ సంఘాల నాయకులు సీపెల్లి రవీందర్, చిప్పకుర్తి చంద్రయ్య, ఆర్ల సందీప్, కట్కూరి సందీప్, ఆర్ల శ్రీనివాస్, ఈదునూరి ఎల్లయ్య, కుక్క లింగయ్య, ఈదునూరి సంపత్, యాదగిరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పట్ల వివక్ష మానండి

## వినతిపత్రాలపై దృష్టి పెట్టండి

## బిజెపి నేతలకు వేణుగోపాలాచారి సూచన



**ఆదిలాబాద్, జూలై14 (జనంసాక్షి) :** బిజెపి నేతలు ఇక్కడి పాలనపై విమర్శలు మాని కేంద్రం నుంచి సాయం అందించే పనులు చేయాలని కేంద్రమాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాజకీయాలకు ఇది సమయం కాదని బిజెపి నేతలు గుర్తించాలని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాల గురించి వారు పోరాడితే మంచిదని అన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలో దీనిపై దృష్టి పెట్టాలని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై స్పష్టమైన హామీని ఇవ్వడం ద్వారా ప్రజల్లో పేరు సంపాదించుకోవాలని అన్నారు. అనేక పథకాలకు సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి పలుమార్లు కలసి వినతి పత్రాలు సమర్పించినా వాటిపై చర్యలు లేవన్నారు. ఖాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ,ఐటిఐఆర్ బయ్యారం ఉక్కు తదితర హామీల విషయంలో కేంద్రం మాట తప్పిందని అన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. ఇప్పటికే సిఎం, మంత్రులు పలుమార్లు ఢిల్లీలో ప్రధానిని, కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారని అన్నారు. అవన్నీ సాధించాలని సూచించారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇప్పటికైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.

# పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

## సమిష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం

## త్వరలో తెలంగాణ పోషకాహార ప్రణాళిక

## భాగస్వామ్య పక్షాల రాష్ట్రస్థాయి సమావేశంలో స్పష్టం చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క




**హైదరాబాద్ (జనంసాక్షి) :** షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మిషన్ మోడ్ లో పనిచేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషిలోనే పౌష్టిక తెలంగాణ సాధ్య పడుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్వాడీ కేంద్రాలను తీర్చి దిద్దుతామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ -2047 డాక్యుమెంట్ కు అనుగుణంగా అంగన్వాడీ సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్రస్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా సోమవారం నాడు ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సీతక్క అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పోషకారంపై పనిచేస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ , ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్టీఆర్ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్షభారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోషకాహారం అందించడంలో లైన్ డిపార్ట్ మెంట్లుగా వ్యవహరిస్తున్న పలు సంక్షేమ శాఖలు, సివిల్ సప్లైస్, విద్యా శాఖ, టీజీ ఫుడ్స్, సెర్ప్, ఐ అండ్ పీఆర్ శాఖల ఉన్నతాధికారులు పాల్గోని తమ విలువైన అభిప్రాయలు తెలియ చేశారు. వారి అభిప్రాయలను, అనుభవాలను, ఆలోచనలను ఆసక్తిగా విన్న మంత్రి సీతక్క వారి సూచనలతో "తెలంగాణ పోషకాహార ప్రణాళిక" రూపొందిస్తామని ప్రకటించారు. అంగన్వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీ లీటర్ల విజయ పాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణ ధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..పోషకాహార తెలంగాణ నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. నిపుణుల అభిప్రాయాలను, అనుభవాల ఆదారంగా పోషణ తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణ లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ప్రజా ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాల సేవల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీల్లో ఎన్నో పోషకాలున్న కోడిగుడ్డు సరఫరాను నిలపి వేయగా..తెలంగాణలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిపుణుల సలహా మేరకు అన్ని వయసుల వారికి పౌష్టికాహారం అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న తెలంగాణలో పోషకార లోపంతో పిల్లలు భాదపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహయక బృందాల సహకారాన్ని తీసుకుంటామన్నారు. అంగన్వాడీలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచేలా సేవల నాణ్యత పెంచుతున్నామని చెప్పారు. అమ్మ ఒడి నుంచి చిన్నారులు అంగన్వాడి బడి లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అంగన్వాడీల్లో ఆహారంతో పాటు అక్షరం, ఆరోగ్యం లభిస్తుందని పేరెంట్స్ కు తెలియ జెప్పాలని సూచించారు. ఇక నిర్మాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్వాడీలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. నాక్, జెన్ ఎన్ టీ యూ వంటి సంస్థలు మోడల్స్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ లో వలస కూలీల పిల్లలకు పౌష్టికాహారం అందించేలా మొబైల్ అంగన్వాడీలు నిర్వహిస్తామన్నారు. వారానికి కనీసం రెండు సార్లు అయా ప్రాంతాల్లో పోషకాహారన్ని అందిస్తామని తెలిపారు. ఇక అంగన్వాడీ కేంద్రాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిని తెలిపిన నేపథ్యంలో అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన చిన్నారులే కీలకమన్నారు. అందుకే అంగన్వాడి కేంద్రాల సేవలపై పూర్తి దృష్టి సారించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అంగన్వాడి సిబ్బంది స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయని పేర్కొన్నారు.

### పోషన్ వాటికలో భాగంగా సీడ్స్ కిట్ ఆవిష్కరణ

మంత్రి సీతక్క ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్వాడి కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో పాలకూర, తోటకూర, మెంతికూర, టమాట, వంకాయ, బెండకాయ విత్తనాలు ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో వీటిని పెంచి లబ్దిదారులకు వండి పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్ వాడీ సేవల బలోపేతం కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశంలో మంత్రి సీతక్క తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జీ. సృజన, తెలంగాణ ఫుడ్ ఎంపీ చంద్రశేఖర్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ అడిషనల్ డైరెక్టర్ డీ ఎస్ జగన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు పాల్గోన్నారు.

# రేపటి బహూజనోద్యమ గీతం 'బహూజనగణమన'

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ బీసీ జనగణన, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం, సమానహక్కుల కోసం రాసిన "బహుజనగణమన" దీర్ఘకావ్యం సోమవారం నాడు రెండు తెలుగు రాష్ట్రాలలో వందలాది కేంద్రాలలో అత్యంత ఘనంగా ఆవిష్కరణ జరిగింది. పుస్తకాలు చదవటం తగ్గిందన్న ఈ సమయంలో ఒక కవి రాసిన వచన కావ్యాన్ని ఒక పండుగలాగా రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగింది. పల్లె నుంచి పట్నందాకా నగరాల నుంచి రాజధాని నగరాలలో ఒకేరోజు జరిగిన ఆవిష్కరణ కార్యక్రమాలలో సామాజిక కార్యకర్తలు, రెండు తెలుగు రాష్ట్రాలలోని కవులు, రచయితలు, జడ్జీలు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాలనారంగంలోని వ్యక్తులు, జర్నలిస్టులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజధాని నుంచి వివిధ జిల్లా కేంద్రాలు, అమరావతి రాజధాని నుంచి తిరుపతి, విజయవాడ, గుంటూరు నుంచి నూజువీడు కంచికచర్ల దాకా అనేక కేంద్రాలలో "జనగణమన" ఆవిష్కరణలు వినూత్నరీతిలో జరిగాయి. 'బహుజనగణమన' కావ్యంలో జనగణన, బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాలకు సంబంధించిన విషయాలను తాత్త్విక దృష్టిలో వచన కవిత్వంలో రాయబడ్డాయని పలు కేంద్రాలలో జరిగిన ఆవిష్కరణల్లో వక్తలు పేర్కొన్నారు. 232 పేజీలలో వెలువడిన "బహుజనగణమన" సాహిత్య చరిత్రలోనే దీర్ఘకావ్యమని వక్తలు కొనియాడారు. ఈ ఆవిష్కరణలు మహాత్మాజ్యోతిబాఫూలే, సావిత్రి ఫూలే, అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పి.శివశంకర్, మారోజు వీరన్న, గౌతు లచ్చన్న, పోతులూరి, వేమన, మొల్ల విగ్రహాల దగ్గర్నుంచి బహుజనయోధుల విగ్రహాలవద్ద ఈ పుస్తకాలను ఆవిష్కరింపచేశారు. ముఖ్యంగా చేతి పనులు చేసుకునే కులవృత్తుల వారిచేత ఈ పుస్తకావిష్కరణలు చేయించారు.

### ఈ దేశమంటే బహుజనమేనన్నా...'బహుజనగణమన' : జూలూరు పుస్తకావిష్కరణలో బండారు దత్తాత్రేయ.

సమాజం సమతుల్యంగా ఉండాలంటే అందరికీ సమాన హక్కులు ఉండాలన్న దార్శనిక ఆలోచనలతో "బహుజనగణమన" దీర్ఘకావ్యం వెలువడిరదని హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మహాకవి గురజాడ దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అన్నారని "బహుజనగణమన"కావ్యం దేశమంటే బహుజనులదని చాటుతుందని పోల్చిచెప్పారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జూలూరు గౌరీశంకర్ రచన "బహుజనగణమన" దీర్ఘకావ్యాన్ని బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం అత్యవసరమైనదని అది అమలు జరిగేటట్లు చూడాలని చెప్పారు. బీసీలలో భావజాల వ్యాప్తికోసం "బహుజనగణమన" కావ్యాన్ని పల్లెపల్లెకు, నవతరానికి అందించాలని దత్తాత్రేయ తెలియజేశారు. ఈ పుస్తకావిష్కరణ సభకు మీడియా అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షత వహించగా రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ రచయిత్రి జ్వలిత, చరిత్రకారుడు, రిటైర్డ్ ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలి, ప్రముఖ సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి రవికాంత్‌రెడ్డిలు ప్రసంగించారు. "బహుజనగణమన" పుస్తకం బీసీలకు భావజాల ఆయుధమని వక్తలు పేర్కొన్నారు. తరాలుగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలకు రాజ్యాధికారమే అంతిమ పరిష్కారమని ఈ కావ్యం చాటుతుందన్నారు.

# పూజలు సక్రమంగా జరిపించడం లేదు

## రంగంలో భవిష్యవాణి మాతంగి స్వర్ణలత



**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు. బాలబాలికలను మీరు విచ్చల విడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుం టున్నాని చెప్పారు. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారని, తాను అడ్డురానని పేర్కొన్నారు. 'బోనాల జాతరకు సంతోషంగా సాకలు పోసి బాగా చేశారు. ప్రతీసారి చేసినట్టే ఈ సారి కూడా పొరపాటు చేశారు. ప్రతి సంవత్సరం చెబుతునా.. నా బిడ్డలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాను. నా పూజలు అన్ని సక్రమంగా జరిపించాలి. వేల రాసులు నేను రప్పించుకుంటున్న. నాకు రక్తం బలి ఇవ్వడం లేదు. మీరు మాత్రం ఆరగిస్తారు. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. నాకు సరిగ్గా పూజలు చెయ్యకపోతే రక్తం కక్కుకొని చస్తారు. నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి. నేను అస్సలు ఆ విషయంలో అడ్డుపడను. నాకు రక్తం బలి కావాలి. నన్ను కొలిచే వారికి నేను ఎప్పుడు తోడుగా నిలబడుతాను. రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది. ప్రజలు జాగ్రత్త ఉండాలి. అగ్ని ప్రమాదాలు బాగా జరుగుతాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాలు పాటు- నాకు పూజలు, సాక పోసి ఆనంద పరచాలి. నాకు రక్తం చూపించండి లేకపోతే అల్లకల్లోలం జరుగుతుంది. నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# పాతబస్తీ పాడుబడ్డ ఇంట్లో అస్థిపంజరం కలకలం

**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** నగరంలోని ఓ ఇంట్లో మనిషి అస్థిపంజరం ఉండటం కలకలం రేపింది. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని నాంపల్లి మార్కెట్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఏడేళ్లుగా ఆ ఇంటిలో ఎవరూ లేరని.. యజమాని విదేశాల్లో ఉన్నారని స్థానికులు తెలిపారు. అస్థిపంజరం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్ అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఇటీవల ఓ యువకుడు శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటిలోకి వెళ్లినట్లు సమాచారం. లోపల అస్థిపంజరాన్ని వీడియోలో రికార్డు చేశాడని.. అది వైరల్ కావడంతో యువకుడిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. క్రికెట్ బాల్ ఆ ఇంట్లో పడటంతో తీసుకునేందుకు వెళ్లానని యువకుడు తెలిపినట్లు సమాచారం.

# మహిళా పేషెంట్ పట్ల అసభ్య ప్రవర్తన

## వార్డుబాయ్‌ను చితకబాది పోలీసులకు అప్పగింత

**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** హైదరాబాద్ విద్యానగర్ లోని ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రిలో దారుణం వెలుగుచూసింది. ఓ వార్డ్ బాయ్ మహిళా పేషెంట్ పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అసభ్య ప్రవర్తనతో మహిళా పేషంట్ కేకలు వేసింది. మహిళా పేషంట్ అరుపులతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. అక్కడే ఉన్న బాధితురాలి కుటుంబ సభ్యులు వార్డ్ బాయ్ ని చితకబాదారు. అనంతరం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు. అసభ్యంగా ప్రవర్తించిన వార్డుబాయ్ ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# బీసీ రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తడి తెండి

## బిజెపి నేతలకు మంత్రి పొన్నం డిమాండ్



**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడంలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర భాజపా నేతలపై ఉందన్నారు. రాష్ట్రపతితో ఆమోదింపజేసి.. 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం లేదా అఖిలపక్షం దిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాలో ఉన్న బీసీ నేతలు వాళ్ల అధిష్ఠానంపై ఒత్తిడి పెంచాలి. బీసీల రిజర్వేషన్లకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి. రిజర్వేషన్లపై భాజపా నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. తెలంగాణలో కులగణన చూసిన తర్వాతే కేంద్రం కళ్లు తెరిచింది. రాష్ట్ర ఒత్తిడితోనే కేంద్రం జనగణనతో పాటు కులగణనను ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# సినిమా షూటింగ్‌లో అపశృతి

## స్టంట్ మాస్టర్ రాజు మృతి



**చెన్నై, జూలై14 (జనంసాక్షి) :** తమిళ సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా భారీ యాక్షన్ సీన్ చిత్రీకరణలో స్టంట్ మ్యాన్ ఎస్ఎమ్ రాజు ప్రాణాలు కోల్పోయారు. పా రంజిత్ దర్శకత్వంలో ఆర్య నటిస్తున్న 'వెట్టువమ్' సినిమా షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం కారు స్టంట్ చేస్తున్న సమయంలో రాజు గుండెపోటుకు గురయ్యారు. వెంటనే రాజుని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజు మృతికి తమిళ చిత్ర పరిశ్రమలోని పలువురు నటులు సంతాపం తెలియజేశారు. ఆయనతో కలిసి పలు చిత్రాల్లో కలిసి పని చేసిన హీరో విశాల్.. రాజు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజు కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మరో స్టంట్ మాస్టర్ సిల్వ కూడా రాజు మరణానికి సానుభూతి తెలియజేశారు. కారు జంపింగ్ స్టంట్స్ చేయడంలో రాజు తర్వాతే ఎవరైనా అని.. ఆయన మరణం స్టంట్ యూనియన్‌తో పాటు చిత్ర పరిశ్రమకు తీరని లోటని అన్నారు.

# పాఠశాలలకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ, జూలై14 (జనంసాక్షి) :** దేశంలో బాంబు బెదిరింపులు తమాషాగా మారాయి. ఢిల్లీలోని పలు పాఠశాలలకు సోమవారం ఉదయం ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని చాణక్యపురిలో గల నేవీ స్కూల్, ద్వారక ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు సోమవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. రెండు పాఠశాలలకు ఫోన్ చేసిన ఆగంతకులు స్కూల్స్ ఆవరణలో బాంబులు పెట్టినట్లు- బెదిరించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు రెండు పాఠశాలల్లోనూ తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు- పోలీసులు వెల్లడించారు

# సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**నల్లగొండ, జూలై14 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యం 80 శాతం వృథా అయ్యేవని మంత్రి ఉత్తమ్ కుమారర్ రెడ్డి అన్నారు. దొడ్డు బియ్యం కోళ్ల ఫారాలకు, బీర్ల కంపెనీలకు వెళ్లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పథకం తీసుకొచ్చిందనీ.. ఇది చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ కోసం ఏర్పాటు- చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఇవాళ పండుగ రోజు అని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉగాది నుంచి దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు. గత సర్కార్ దొడ్డు బియ్యం కూడా నాణ్యంగా ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టామని తెలిపారు మంత్రి ఉత్తమ్. కాంగ్రెస్ ప్రభుత్వం 10 లక్షల మందికి సన్నబియ్యం ఇస్తోందని చెప్పారు. కాళేశ్వరం కట్టింది.. కూలింది బీఆర్ఎస్ హయాంలోనేనని మంత్రి ఉత్తమ్ అన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు.

# తెలంగాణ యూరియా ఇతర రాష్ట్రాలకు మళ్లింపు

## కేంద్రంపై మండిపడ్డ ఎంపి వంశీకృష్ణ



**పెద్దపల్లి, జూలై14 (జనంసాక్షి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణపై ప్రేమ లేదని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీ వంశీ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగానికి ఎరువులను అందించేందుకు కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన 60 శాతం యూరియా కోటాను 30 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న యూరియాను స్థానిక రైతాంగానికి ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు తరలించడం సరైన విధానం కాదని దుయ్యబట్టారు. తెలంగాణకి ఇచ్చే కోటాను కేంద్రం ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు తరలిస్తూ తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఫైర్ అయ్యారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి ఇస్తుంటే.. కేంద్రం తిరిగి 30 పైసలు మాత్రమే మనకి ఇస్తోందన్నారు. తెలంగాణపై అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ ప్రియారిటీ- ఇస్తోందని.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను రానున్న రోజుల్లో ఎక్కడికక్కడ ఎండగడతామని హెచ్చరించారు. తెలంగాణలో యూరియా కొరతపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్తానని.. తెలంగాణ రైతాంగానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370